అమరవీరులకు అరుణాంజలి
రూ॥ 220/-
పేజీలు: 230




నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

అదుపుతప్పి లోయలో పడిన ఆర్మీ వాహనం
పది మంది సైనికులు మృతి
05

27న ఐదు రోజుల పనిదినాల అమలుకు
దేశవ్యాప్త బ్యాంకుల సమ్మె

సంపుటి 09, సంచిక: 55 | శుక్రవారం | 23-01-2026 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00



ఫోన్ ట్యాపింగ్ కేసు

## కెటిఆర్‌కు సిట్ నోటీసులు

నేడు విచారణకు హాజరు కావాలని ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసుకు సంబంధించి సిరిసిల్ల ఎంఎల్ఎ, మాజీ మంత్రి కె. తారక రామారావు (కెటిఆర్) కు సిట్ అధికారులు నోటీసులు జారీ చేశారు. పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో నమోదైన క్రైం నెంబర్ 243/2024 కేసులో భాగంగా, సెక్షన్ 160 సిఆర్‌పిసి కింద తరువాయి 2లో

న్యూ ఇయర్ వేళ డ్రంక్ అండ్ డ్రైవ్

## 270 మందికి జైలు శిక్ష

ప్రజాపక్షం/హైదరాబాద్

నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో రోడ్డు భద్రతను పెంపొందించడం, ప్రమాదాలను నివారించడమే లక్ష్యంగా హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు నగరవ్యాప్తంగా 'డ్రంక్ అండ్ డ్రైవ్'పై ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్‌లను నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ తనిఖీలు డిసెంబర్ 24, 2025 నుండి డిసెంబర్ 31,2025 వరకు జరిగాయి. ట్రాఫిక్ పోలీసుల తరువాయి 2లో




పనిగంటలు పెంపు.. కార్మికులను మళ్లీ

# బానిసత్వంలోకి నెట్టడమే

- ఎనిమిదిగంటల పని విధానం రద్దుపై ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ విమర్శ
- 'వేతనం' పదానికి కొత్త నిర్వచనం ఇవ్వడంతో అలవెన్సులు తగ్గుతాయని ఆందోళన
- అనేక నిబంధనలతో కార్మికుల యూనియన్లను నిర్వీర్యం చేస్తున్నారని మండిపాటు
- సిఆర్ ఫౌండేషన్‌లో 'కొత్త లేబర్‌కోడ్‌లతో ప్రయోజనం ఎంత? కార్మికవర్గంపై వాటి ప్రభావం'పై సదస్సు

**తెలంగాణ రాష్ట్రంలో లేబర్ కోడ్‌లను అమలు చేయకుండా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఏకగ్రీవ తీర్మానం**

ప్రజాపక్షం/హైదరాబాద్

దశాబ్దాల పోరాట ఫలితంగా సాధించిన 8 గంటల పని విధానాన్ని రద్దు చేసి, యజమానుల ఇష్టానుసారంగా పని గంటలు పెంచుకునే వెసులుబాటు కల్పించడం కార్మికులను మళ్లీ బానిసత్వంలోకి నెట్టడమేనని ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ విమర్శించారు. 'వేతనం' అనే పదానికి కొత్త నిర్వచనం ఇవ్వడం ద్వారా అలవెన్సులు తగ్గిపోతాయని, దీని ప్రభావం పిఎఫ్, గ్రాట్యుటీ, రిటైర్‌మెంట్ ప్రయోజనాలపై తీవ్రంగా పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అనేక నిబంధనలతో కార్మిక యూనియన్లను నిర్వీర్యం చేస్తున్నారని ఆమె విమర్శించారు. దశాబ్దాల పోరాట ఫలితంగా సాధించిన చట్టాలను కార్పొరేట్ ప్రయోజనాల కోసం కుదించారన్నారు. ఇఎస్ఐ, పిఎఫ్ వంటి సామాజిక భద్రతా పథకాల పరిధిని తగ్గించడంతో కార్మికుల భవిష్యత్తు అంధకారమవుతుందన్నారు. హైదరాబాద్ కొండాపూర్ సి.ఆర్. ఫౌండేషన్‌లో ఇంద్రజిత్ గుప్తా హాల్‌లో 'కొత్త లేబర్ కోడ్‌లతో ప్రయోజనమెంత? కార్మిక వర్గంపై వాటి ప్రభావం' అనే అంశంపై గురువారం నిర్వహించిన సదస్సులో అమర్‌జీత్ కౌర్, తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, ఐఎఫ్‌టియు జాతీయ ఉపాధ్యక్షుడు పి. ప్రసాద్, ఎఐటియుసి సీనియర్ నేత బి.వి.విజయలక్ష్మి, సి.ఆర్.ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, ఎఐటియుసి అధ్యక్షుడు ఎం.డి. యూసుఫ్, ఎఐబిఇఎ జాతీయ కార్యదర్శి రాంబాబు, సి.ఆర్.ఫౌండేషన్ కోశాధికారి చెన్నకేశవ రావు పాల్గొనగా నీలం రాజశేఖర్ రెడ్డి తరువాయి 12లో

'విబి–జి రామ్ జి'కి వ్యతిరేకంగా

# పేదలు ఏకమవ్వాలి

- రైతులు చూపిన బాటలో 'ఎంజి నరేగా' పునరుద్ధరణ ఉద్యమం కోసం నడవాలి
- కొత్త చట్టం ఉద్దేశం... గతంలో మూడు నల్ల చట్టాల ఉద్దేశం ఒక్కటే...
- జాతీయ ఎంజి నరేగా కార్మికుల సదస్సులో రాహుల్‌గాంధీ
- ఉపాధి హామీ పథకం రద్దుపై పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో నిలదీస్తాం : ఖర్గే



**న్యూఢిల్లీ :** 'ఎంజి నరేగా' స్థానంలో కేంద్రం తీసుకువచ్చిన 'వికసిత్ భారత్‌గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ (గ్రామీణ) బిల్లు 'విబి–జి రామ్ జి'కి వ్యతిరేకంగా పేద ప్రజలంతా ఏకం కావాలని లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త చట్టం ఉద్దేశం, గతంలో తీసుకువచ్చిన 'మూడు నల్ల వ్యవసాయ చట్టాల' ఉద్దేశం ఒకటేనని విమర్శించారు. రైతుల నుంచి స్ఫూర్తి పొంది నరేగాను పునరుద్ధరించాలన్న డిమాండ్‌పై ఐక్యంగా ఉండాలని కార్మికులను కోరారు. గురువారం రచనాత్మక కాంగ్రెస్ నిర్వహించిన జాతీయ ఎంజి నరేగా కార్మికుల సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో రాహుల్‌గాంధీతో పాటు పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు జైరాం రమేష్, కె.సి. వేణుగోపాల్, రచనాత్మక కాంగ్రెస్ చైర్‌పర్సన్ సందీప్ దీక్షిత్ తదితరులు పాల్గొన్నారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ మాట్లాడుతూ పేదలకు హక్కులు కల్పించడమే నరేగా ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ సదస్సులో దేశవ్యాప్తంగా ఉన్న కార్మికులు పాల్గొన్నారు. వారు తమ పని ప్రదేశాల నుండి పిడికెడు మట్టిని తీసుకువచ్చారు. దానిని గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సమక్షంలో మొక్కలకు వేయడం ద్వారా ప్రతీకాత్మకంగా నిరసన తెలిపారు. 'రాజ్యాంగంపై, భారతదేశ భావనపై నమ్మకం ఉన్న పేద ప్రజలకు ఎంజి నరేగా ఉద్యమం ఒక పెద్ద తరువాయి 2లో




## త్యాగాలు, పోరాటాలతో సిపిఐ మమేకం

- మరో వందేళ్లు కూడా ప్రజల గుండెల్లో సుస్థిరం
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు
- భద్రాద్రి జిల్లా గౌతంపూర్‌లో 'శత వసంత పైలాన్' ఆవిష్కరణ


ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం

భారతగడ్డపై సిపిఐది తిరుగులేని ప్రస్థానం అని, 1925లో దేశ స్వాతంత్ర్యానికంటే ముందే ఆవిర్భవించిన సిపిఐ అనేక త్యాగాలు, పోరాటాలతో మమేకమై ఉందని సిపిఐ రాష్ట్రకార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. భద్రాద్రి జిల్లా చుంచుపల్లి మండల పరిధిలో గల గౌతమ్‌పూర్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శతవసంత పైలాన్‌ను ఆయన గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ పేదలు, కార్మికులు, రైతులు, రైతుకూలీలు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసమే నాటి నుండి నేటి వరకు ఎర్ర జెండా పనిచేస్తోందని తరువాయి 2లో

భారత్ ఫ్యూచర్ సిటీలో

# ఎఐ డేటా సెంటర్

- 100 మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చిన యుపిసి వోల్ట్
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' బృందంతో అవగాహన ఒప్పందం
- రూ.5 వేల కోట్ల పెట్టుబడులు – సుమారు 4 వేల మందికి ఉపాధి
- రూ.623 కోట్ల పెట్టుబడితో స్ర్నడర్ ఎలక్ట్రిక్ విస్తరణ
- తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌కు వరల్డ్ ఎకనామిక్ ఫోరం మద్దతు


డబ్ల్యుఇఎఫ్ ఎండి జెరెమీ జర్గెన్స్‌తో సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

దేశంలోనే తెలంగాణను ఎఐ డేటా సెంటర్ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక పెట్టుబడిని సాధించింది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' బృందం దావోస్‌లో యుపిసి వోల్ట్ సంస్థతో అవగాహన ఒప్పందం (ఎంఓయు) కుదుర్చుకుంది. యుపిసి వోల్ట్ సిఈఓ హాన్ డీ గ్రూట్, యుపిసి రిన్యూవబుల్స్ ఎపిఎసి సహ వ్యవస్థాపకులు స్టీవెన్ జ్వాన్, యుపిసి రిన్యూవబుల్స్ ఇండియా సిఈఓ అలోక్ నిగమ్‌తో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. నెదర్లాండ్స్‌కు చెందిన యుపిసి రిన్యూవబుల్స్ గ్రూప్, వోల్ట్ డేటా సెంటర్స్ కలిసి యుపిసి వోల్ట్ సంస్థగా ఏర్పడింది. రాష్ట్ర ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందం ప్రకారం ఈ సంస్థ భారత్ ఫ్యూచర్ సిటీలో 100 మెగావాట్ల సామర్థ్యంతో ఎఐకు అనుకూలమైన డేటా సెంటర్ నెలకొల్పనుంది. ఈ ప్రాజెక్టుకు ఐదేళ్లలో రూ.5,000 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. ఈ డేటా సెంటర్‌కు అవసరమైన విద్యుత్ సరఫరాకు 100 మెగావాట్ల సామర్థ్యంతో ప్రత్యేక పునరుత్పాదక విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాజెక్టు నిర్మాణ దశలోనే 3 వేల మందికి పైగా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగావకాశాలు లభిస్తాయి. డేటా సెంటర్ ప్రారంభమైన తర్వాత మరో 800 మందికి ఉద్యోగ అవకాశాలుంటాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల తరువాయి 2లో



ఆ రైస్ మిల్లులకు ధాన్యం

## కేటాయించొద్దు

- రాజకీయ జోక్యానికి లొంగవద్దు
- నిబంధనలు ఉల్లంఘించే రైస్ మిల్లులపై కఠిన చర్యలు
- బియ్యాన్ని ఎగుమతి చేసే మిల్లర్లకు ప్రోత్సాహం
- పౌర సరఫరాల శాఖామంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

డీఫాల్టర్ రైస్ మిల్లులకు ధాన్యం కేటాయించొద్దని, ఈ విషయంలో ఎటువంటి రాజకీయ జోక్యానికి లొంగవద్దని అధికారులను రాష్ట్ర పౌరసరఫరాల, నీటి పారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించే రైస్ మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తెలంగాణ బియ్యాన్ని విదేశాలకు ఎగుమతి చేసేందుకు ముందుకొచ్చే రైస్ మిల్లర్లను ప్రోత్సహిస్తామని, పేదల కడుపు నింపే 'సన్న బియ్యం' విషయంలో అవకతవకలకు పాల్పడితే సహించబోమని స్పష్టం చేశారు. ఖరీఫ్ సీజన్‌లో 71.64 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని తరువాయి 2లో

## జార్ఖండ్‌లో భారీ ఎన్‌కౌంటర్



**తలపై రూ. కోటి రివార్డు ఉన్న మావోయిస్టునేత సహా 15 మంది మృతి**

ప్రాణాలు కోల్పోయిన అగ్రనేత పతిరామ్ మాఝీ

**చైబాసా :** జార్ఖండ్‌లో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. పశ్చిమ సింగ్‌భూమ్ జిల్లాలో గురువారం భద్రతా బలగాలతో జరిగిన ఎదురుకాల్పుల్లో 15 మంది మావోయిస్టులు మృతి చెందారు. మృతుల్లో తన తలపై రూ. 2.35 కోట్ల రివార్డు ఉన్న అగ్ర నాయకుడు అనల్ దా కూడా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కిరిబురు పోలీస్ స్టేషన్ పరిధిలోని సరండా అడవిలోని కుండిలో సిఆర్‌పిఎఫ్ కోబ్రా యూనిట్‌కు చెందిన సుమారు 1,500 మంది సిబ్బంది ఈ ఆపరేషన్‌లో నిమగ్నమై ఉన్నారని వారు చెప్పారు. ఎదురు కాల్పులు తరువాత మావోయిస్టు అగ్ర నాయకుడు పతిరామ్ మాఝీ అలియాస్ అనల్ దా సహా 15 మంది మావోయిస్టుల మృతదేహాలను మేము స్వాధీనం చేసుకున్నామని చైబాసాలోని పోలీస్ ప్రధాన కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. భారీ మొత్తంలో ఆయుధాలు, మందుగుండు సామగ్రి కూడా స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొంది. ఉదయం 6 గంటలకు ప్రారంభమైన ఈ ఎదురు కాల్పులు ఇంకా కొనసాగుతున్నాయని వెల్లడించింది. సరండా అడవిలో మంగళవారం నుంచి మావోయిస్టుల వ్యతిరేక ఆపరేషన్ కొనసాగుతోందని, అయితే ఎదురు కాల్పులు గురువారం ఉదయం తరువాయి 12లో

కర్నాటకలోనూ

## అదే తీరు...



శాసనసభ, మండలి సంయుక్త సమావేశంలో కేవలం రెండు, మూడు లైన్లే చదివిన గవర్నర్

అధికారపక్షంలో తీవ్ర ఆగ్రహానికి గురి చేసిన థావర్‌చంద్ గెహ్లాట్ చర్య

గవర్నర్‌పై 'సుప్రీం'కు వెళ్లే విషయాన్ని పరిశీలిస్తామన్న సిఎం సిద్ధరామయ్య

**బెంగళూరు :** బిజెపియేతర పాలిత రాష్ట్రాల్లో గవర్నర్లు, ప్రభుత్వాలకు మధ్య విభేదాలు తలెత్తుతున్నాయి. రెండు రోజుల క్రితం కేరళ, తమిళాడు రాష్ట్రాల్లో జరిగిన ఘటనలే గురువారం కర్నాటకలోనూ పునరావృతమైంది. కొత్త ఏడాదిలో తొలిసారి కర్నాటకలో అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ శాసనసభలో తన సంప్రదాయ ప్రసంగాన్ని కేవలం మూడు వాక్యాలకే పరిమితం చేశారు. ప్రభుత్వం సిద్ధం చేసిన సుదీర్ఘ ప్రసంగంలోని మొదటి, చివరి వాక్యాలను మాత్రమే చదివారు. గవర్నరం చర్య అధికార పక్షంలో తీవ్ర ఆగ్రహానికి గురైంది. గవర్నర్‌పై ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మండిపడ్డారు. గెహ్లాట్ తరువాయి 2లో

డెన్మార్క్–గ్రీన్‌లాండ్ తరపున

## ట్రంప్‌తో నాటో అధిపతి ఎలా చర్చిస్తారు?

డెన్మార్క్ ప్రధాని ఫ్రెడెరిక్సెన్ ఆగ్రహం



**లండన్:** మా సార్వభౌమాధికారంపై ఎవ్వరితోనూ మేం సంప్రదింపులు చెయ్యలేమని డెన్మార్క్ ప్రధానమంత్రి మెట్టే ఫ్రెడెరిక్సెన్ ప్రకటించారు. ఆర్కిటిక్ ద్వీపం భవితవ్యంపై డెన్మార్క్ లేదా గ్రీన్‌లాండ్ తరపున అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో నాటో అధిపతి మార్క్ రట్టే ఎలా సంప్రదింపులు జరుపుతారని ఆమె వ్యక్తం చేశారు. మా తరపున ఆయన సంప్రదింపులు జరపలేరన్నారు. దీంతో కొత్త వివాదం తలెత్తినట్లయింది. గ్రీన్‌లాండ్‌పై బలప్రయోగం అవసరం లేదని, ఆ ఉద్దేశం లేదని, ఐతే తక్షణం తాము చర్చలు కోరుతున్నామని దావోస్‌లో డోనాల్డ్ ట్రంప్ ప్రతిపాదన, నాటో ప్రధాన కార్యదర్శి మార్క్ రట్టేతో ట్రంప్ ముఖాముఖీ సమావేశం తర్వాత గురువారం మధ్యాహ్నం మెట్టే ఫ్రెడెరిక్సెన్ పైవిధంగా స్పందించారు. ఆర్కిటిక్ తరువాయి 12లో

# దావోస్‌లో 'శాంతి మండలి' ఆవిర్భావం
# సంతకాలు చేసిన 19 దేశాల అధిపతులు

### ఐక్యరాజ్యసమితితో కలిసి పనిచేస్తాం.. మరో యుద్ధాన్ని కూడా పరిష్కరిస్తాం : ట్రంప్

**దావోస్ :** దావోస్ వేదికగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నాయకత్వాన ఆయన కోరుకున్న విధంగా గురువారం బోర్డ్ ఆఫ్ పీస్ (శాంతి మండలి) ఆవిర్భవించింది. ఈ 'శాంతి మండలి'చట్రానికి కట్టుబడి ఉండే 'గాజా కార్యనిర్వాహక మండలి' ఆ ప్రాంత అభివృద్ధికి పనిచేస్తుంది. ''మేం త్వరలో మరో యుద్ధాన్ని ఆపేయబోతున్నాం'' అని ఈ సందర్భంగా ట్రంప్ ఉక్రెయిన్ గురించి పరోక్ష ప్రకటన చేశారు. యథాప్రకారంగానే, ''ప్రపంచ వ్యాప్తంగా ఎనిమిది యుద్ధాలను నేను నివారించా'' అని చెప్పుకున్నారు. ట్రంప్‌తోపాటు అర్జెంటీనా అధ్యక్షుడు జేవియర్‌మిలే, హంగేరీ ప్రధాన మంత్రి విక్టర్ ఓర్బాన్, పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ సహా మొత్తం 19 దేశాలకు చెందిన ప్రధానమంత్రులు లేదా అధ్యక్షులు ఈ వేదికపై ఆసీనులై 'ఛార్టర్ ఆఫ్ డాక్యుమెంట్'పై సంతకాలు చేశారు. ఈ విషయంలో ఐక్యరాజ్య సమితిని పూర్తిగా పక్కకు నెట్టేసినప్పటికీ, శాంతి మండలి అంతర్జాతీయ సమితిలో కలిసి పనిచేస్తుందని ట్రంప్ ప్రకటించారు. గాజా పునర్నిర్మాణం, ప్రజలకు మానవతా సహాయం పంపిణీ ఈ బోర్డు ప్రస్తుత ప్రధాన లక్ష్యాలు. ఇప్పటివరకూ తెలిసిన సమాచారం ప్రకారం ఛార్టర్ ఆఫ్ డాక్యుమెంట్‌లో పాలస్తీనా ప్రాంతం పేరు ఎక్కడా లేదు. ఈ శాంతి మండలి ఛార్టర్ డాక్యుమెంటును చూస్తే ఐక్యరాజ్యసమితికి ప్రత్యామ్నాయంగా కార్యకలాపాలు నిర్వహించే లక్షణాలు కనిపిస్తున్నాయని నివేదికలు తెలిపాయి. పశ్చిమ ఆసియా ఇప్పుడు శాంతియుత వాతావరణంలో ఉందని, గాజాలోకి అపరిమితంగా మానవతా సహాయాన్ని ప్రవహింపజేస్తామని ప్రకటించారు.




గాజాలో యుద్ధం ముగింపు దశకు చేరుకుంటోందని, ఇప్పుడు ఉన్నది కేవలం చిన్న చిన్న మంటలు మాత్రమేనని, ఈ మంటలను చాలా సులభంగా ఆర్పేయవచ్చునని అన్నారు. హమాస్ వారు వాగ్దానం చేసిన విధంగా వారు ఆయుధాలను వదిలిపెట్టాలి, స్వాధీనం చేయాలి, లేకపోతే అదే వారికి అంతం అవుతుందని హెచ్చరిక చేశారు. గత ఏడాది అక్టోబరులో శాంతి ఒప్పందం అమలులోకి వచ్చినప్పటికీ అనేకసార్లు ఇజ్రాయెల్ సైన్యం కాల్పుల విరమణ ఒప్పందాన్ని వందలసార్లు ఉల్లంఘించింది. ఈ కాల్పుల్లో 466 మంది పాలస్తీనియన్లు మరణించారు.

అంతర్జాతీయ సంఘర్షణలను పరిష్కరించేందుకు ట్రంప్ ఛైర్మన్‌గా ఆవిర్భవించిన ఈ ''శాంతి మండలి''లో శాశ్వత సభ్యత్వం పొందడానికి 100 కోట్ల డాలర్ల మొత్తాన్ని సభ్యదేశాలకు విరాళం లక్ష్యంగా ఆయన నిర్దేశించారు. శత్రు–మిత్రువులనే తేడా లేకుండా విస్తారంగా ఆయన అనేక దేశాలకు ఈ శాంతి మండలిలో చేరాలని ఆహ్వానాలు పంపారు. ఈ జాబితాలో భారత్–పాకిస్థాన్, ఇజ్రాయెల్–టర్కీ, కాబోడియా–ఇండోనేసియా, కెనడా, బ్రిటన్,ఫ్రాన్స్ తదితర దేశాలున్నాయి. గాజా పునర్నిర్మాణాన్ని, కాల్పుల విరమణను ఈ దేశాలు పర్యవేక్షించాల్సి ఉంటుంది. వైట్ హౌస్ విడుదల చేసిన సమాచారం ప్రకారం మొత్తం 50 దేశాలకు ట్రంప్ ఆహ్వానాలు పంపించారు. 35 దేశాలు ఈ శాంతి మండలిలో చేరేందుకు సంసిద్ధత వ్యక్తం చేశాయి. తాజాగా గురువారం ఇండోనేసియా తన అంగీకారం తెలియజేసింది. గాజాలో 2025 అక్టోబరు 10వ తేదీ నుండి పూర్తిస్థాయి కాల్పుల విరమణ ఒప్పందం అమలులోకి వచ్చింది. బందీలను, మృతదేహాలను స్వాధీనం చేసుకునే మొదటి విడత ప్రక్రియ పూర్తికాగా ఇక హమాస్ ఉగ్రవాదులను సాగనంపి, గాజా బోర్డు ఏర్పాటు చేసే రెండోదశ ప్రక్రియ దావోస్‌లో ఈ రూపేణా ప్రారంభమైంది. ఆర్మేనియా, అజర్‌బైజాన్, బహ్రైన్, బల్గేరియా, ఇండోనేసియా, జోర్డాన్, కజకిస్థాన్, కొసావో, మంగోలియా, మొరాకో, పర్వాగే, ఖతార్, సౌదీఅరేబియా, టర్కీ, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఉజ్బెకిస్థాన్ దేశాల నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సెంట్రల్ గాజాలో ఇజ్రాయెల్ దాడి.. ముగ్గురు ఫోటో జర్నలిస్టులు మృతి




**గాజా:** సెంట్రల్ గాజాలో ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో ముగ్గురు ఫోటో జర్నలిస్టులు మరణించారు. ఒకవైపు దావోస్‌లో 'శాంతి మండలి' ఆవిర్భావసభ అట్టహాసంగా జరిగిన సమయంలోనే గాజాలో ఇజ్రాయెల్ దాడులు చేసింది. గాజా వ్యాప్తంగా గడచిన 24 గంటల్లో జరిగిన దాడుల్లో మరో ఎనిమిది మంది మరణించారు. సెంట్రల్‌గాజాలో ఒక ట్యాంకర్ దగ్గర కాపడుతో 13 ఏళ్ల బాలుడు సహా ముగ్గురు మరణించారు. గత ఏడాది అక్టోబర్‌లో గాజాలో కాల్పుల విరమణ ఒప్పందం అమలులోకి వచ్చినప్పటినుండి ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో 466 మంది పాలస్తీనియన్లు కాల్పుల్లో మరణించారు. ఇజ్రాయెల్ దాడిలో మరణించిన ఫోటో జర్నలిస్టులను మహ్మద్ సలాహ్ క్వాస్హ్, అనాస్ ఘునీమ్, అబ్దుల్ రావూఫ్ షాతుగా గుర్తించారు. వారు కారులో వెళుతుండగా సైన్యం దాడికి గురయ్యారు. నిజానికి ఈ ముగ్గురు ఫోటో జర్నలిస్టులు సెంట్రల్ గాజాలో ఈజిప్టు తరుపున పనిచేసే ఒక సహాయ పునరావాస సంస్థ తరుపున నిరాశ్రయులైన ప్రజల శిబిరాలను చిత్రీకరించే పనిలో నిమగ్నమై ఉన్నారు. ఐతే ఈ కారుకు మానవతా సహాయం అనే బోర్డులు రాసి ఉన్నాయని, ఉద్దేశపూర్వకంగానే వారి కారుపై దాడి జరిగిందని స్థానికులు చెబుతున్నారు. కాగా ఇజ్రాయెల్ సైన్యం మాత్రం అనేకమంది సందేహాస్పదంగా హమాస్ ఉగ్రవాదులతో కలిసి డ్రోన్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని, మరికొందరు నిర్దేశిత ఎల్లోలైన్ దాటి వస్తున్నారని ఈ క్రమంలో కాల్పులు జరిగాయని ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది.

## సిపిఐ మమేకం (మొదటి పేజీ తరువాయి)

చెప్పారు. రానున్న వందేళ్లు కూడా ప్రజలతో మమేకమై ముందుకు సాగుతుందన్నారు. ఈనెల 18న ఖమ్మం కేంద్రంగా నిర్వహించిన సిపిఐ శతవసంత ఉత్సవాల ముగింపు సభకు దేశ విదేశాల నుండి కమ్యూనిస్టు పార్టీల ప్రతినిధులు హాజరయ్యారని, కనీ వినీ ఎరుగని రీతిలో సభ జరిగిందని, లక్షలాది మంది హాజరైన ఈ సభ దేశ చరిత్రలో సువర్ణాధ్యాయంగా మిగిలిపోతుందన్నారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె సాబీర్ పాషా మాట్లాడుతూ దేశంలో కమ్యూనిస్టుల పని అయిపోయిందని అనేక మంది అవహేళన చేసే వాళ్ళు పేలుతున్నారని, కమ్యూనిస్టుల సత్తా ఏంటో మొన్నటి సభతో దేశంలో సూటిమేధావులుగా చెప్పుకునే వారికి అర్థమయ్యే ఉంటుందన్నారు. ప్రతీ కమ్యూనిస్టు కార్యకర్త ప్రజా సమస్యల పరిష్కారానికి పాటుపడాలని, ప్రజలతో మమేకమై ముందుకు సాగిన నాడు ఆ పార్టీని ప్రజలు గుండెల్లో పెట్టుకుంటారని, ఆ దిశగా ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. త్వరలో జరగనున్న మున్సిపల్ కార్పోరేషన్ ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. వల్లభిరెడ్డి మల్లిఖార్జునరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, జిల్లా కార్యవర్గ సభ్యులు మిర్యాల రంగయ్య, చలిగంటి శ్రీనివాస్, వాసిరెడ్డి మురళీ, జె వీరస్వామి, కంచర్ల జమలయ్య, కందుల భాస్కర్, భూక్య ధర్మ, ఎస్‌కే ఫయాం, జిల్లా సమితి సభ్యులు కొమారి హనుమంతరావు, ఇక్కుల రాములు, మునిగడప వెంకటేశ్వర్లు, నేరెళ్ల రమేష్, నాయకులు తోట రాజు, బొర్రా కేశవరావు తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# యూరప్ దేశాలపై 10 శాతం సుంకాల ఉపసంహరణ

### నాటో అధిపతితో భేటీ తర్వాత ట్రంప్ ప్రకటన

**దావోస్:** గ్రీన్‌లాండ్ స్వాధీనాన్ని వ్యతిరేకించిన ఎనిమిది యూరప్ దేశాలపై విధించిన 10 శాతం అదనపు సుంకాలను అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఉపసంహరించుకున్నారు. దీంతో ఫిబ్రవరి ఒకటో తేదీ నుండి వసూలు చేయాల్సిన 25 శాతం సుంకాలు తిరిగి 15 శాతానికి చేరాయి. గురువారం దావోస్‌లో నాటో కూటమి ప్రధాన కార్యదర్శి జనరల్ మార్క్ రట్టేతో ముఖాముఖీ సమావేశం తర్వాత తన ట్రూత్ సోషల్ మీడియా వేదికగా ట్రంప్ ఒక పోస్టింగ్ పెడుతూ పదీ శాతం సుంకాలను వెనక్కు తీసుకుంటున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా గ్రీన్‌లాండ్ సహా యావత్ ఆర్కిటిక్ ప్రాంత భవితవ్యానికి సంబంధించి నిర్దేశిత ప్రణాళిక నిమిత్తం ఒక చట్రాన్ని తయారు చేస్తామని, ఈ మేరకు తాము ఒక అవగాహనకు వచ్చినందువల్ల ఎనిమిది యూరప్ దేశాలపై పదిశాతం అదనపు సుంకాలను ఉపసంహరించుకున్నానని ఆ పోస్టింగ్‌లో పేర్కొన్నారు. డెన్మార్క్, నార్వే, స్వీడన్, ఫ్రాన్స్, జర్మనీ, బ్రిటన్, నెదర్లాండ్స్,ఫిన్లాండ్ దేశాలకు నిర్ణీత ప్రకారం ఈ అదనపు సుంకాలు వర్తించాల్సి ఉంది. ట్రంప్‌తో సమావేశం చాలా బాగా జరిగిందని మార్కో రట్టో ప్రకటించారు. గ్రీన్‌లాండ్‌పై భవిష్యత్ ఒప్పందం చేసుకోవడానికి వీలుగా ఒక ప్రణాళికా చట్రాన్ని తయారు చేసేందుకు ముఖాముఖీ చర్చల్లో తామిద్దరం అంగీకరించామని రట్టో చెప్పారు. గ్రీన్‌లాండ్‌లో ఆర్థిక, మిలిటరీపరమైన ప్రయోజనాలు పొందకుండా చూసేందుకు తదుపరి చర్చలు కొనసాగుతాయన్నారు. దీంతో గడచిన జులై నెలలో స్కాట్‌లాండ్ లోని ట్రంప్ సొంత గోల్ఫ్‌కోర్స్‌లో యూరోపియన్ కమిషన్ ఛైర్మన్ ఉర్సులా వోండర్ లేయన్–ట్రంప్ మధ్య ముఖాముఖీ చర్చల్లో కుదిరిన అమెరికా–యూరోపియన్ యూనియన్ వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేసుకునేందుకు ఉర్సులా సిద్ధపడ్డారు. ఈ ఒప్పందాన్ని లాంఛనంగా ఈ వారంలోనే ఆమోదించాల్సిన యూరోపియన్ పార్లమెంటు ఈ నిర్ణయాన్ని రద్దుచేసుకుంది. అమెరికా సరుకులపై ప్రతీకార సుంకాలకు కూడా ఉర్సులా సిద్ధమయ్యారు. యూరోపియన్ యూనియన్ దేశాల నాయకులందరూ గ్రీన్‌లాండ్ సార్వభౌమాధికారానికి, ఆర్కిటిక్ ప్రాంత సంరక్షణకు కట్టుబడి డెన్మార్క్ పక్షాన చేరారు. యూరోపియన్ యూనియన్ అమెరికాపై ఆధారపడకుండా సర్వస్వతంత్రంగా ఉండేవిధంగా పునర్నిర్మించుకోవాలని ఉర్సులా పిలుపు ఇచ్చారు. కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ దావోస్ వేదికపై జనవరి 20వ తేదీన ప్రసంగిస్తూ, ఆర్కిటిక్ ప్రాంత సార్వభౌమాధికారానికే తాము కట్టుబడి ఉన్నామంటూ నాటో చట్టంలోని ఆర్టికల్ ఫైవ్ పట్ల నిబద్ధత ప్రకటించారు. ఈ ఆర్టికల్ ప్రకారం ఒకటి లేదా అంతకంటే ఎక్కువ సభ్యదేశాలపై దాడి జరిగితే అది యావత్ నాటో కూటమిపై జరిగిన దాడిగా సభ్యదేశాలు పరిగణిస్తాయి. ఉద్రిక్తతలు పరాకాష్ఠకు చేరి ప్రపంచ అధికార సమతౌల్యంలో భారీ మార్పులు సంభవించే పరిణామాలు చోటు చేసుకోకముందే ట్రంప్ జాగ్రత్త పడ్డారు. దావోస్ వేదికగా జనవరి 21వ తేదీన కీలక ప్రసంగంలో నాటో,యూరప్ దేశాలపై ఘాటు విమర్శలు, ప్రశంసలు ఉపయోగించారు. ఫ్రాన్స్,జర్మనీ,బ్రిటన్, డెన్మార్క్, బెల్జియంలపట్ల సర్దుబాటు ధోరణితో వ్యవహరించారు. స్వీడన్ ప్రధానమంత్రి ఉల్ఫ్ క్రిస్టర్‌సన్ స్పందిస్తూ, ట్రంప్ ధిక్కార వాక్చాతుర్యం ప్రయోగించారని, ఏ విధంగా చూసినా ట్రంప్ దావోస్ ప్రసంగం అన్యాయంగా ఉందని విమర్శించారు. గ్రీన్‌లాండ్‌పై బల ప్రయోగం చేయాల్సిన అవసరం లేదని ట్రంప్ చెబుతూ నాటోకోసం అమెరికా చాలా చేసిందన్నారు.

## సిట్ నోటీసులు (మొదటి పేజీ తరువాయి)

ఈ నోటీసులు జారీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. జూబ్లీ హిల్స్ డివిజన్ సహాయ పోలీస్ కమిషనర్ కార్యాలయం నుంచి ఈ నోటీసులు పంపించారు.దర్యాప్తు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, కేసుకు సంబంధించిన విషయాలపై కెటిఆర్‌కు అవగాహన ఉందని గుర్తించిన నేపథ్యంలో, వ్యక్తిగతంగా విచారణకు హాజరై వివరణ ఇవ్వాల్సిందిగా ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం 11 గంటలకు జూబ్లీ హిల్స్‌లోని ఎసిపి కార్యాలయంలో హాజరు కావాలని నోటీసులో పేర్కొన్నారు. చట్టబద్ధమైన కారణం లేకుండా నోటీసులను పాటించకపోతే, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు.ఫోన్ టాపింగ్ వ్యవహారంలో ఇప్పటికే పలువురు అధికారులను విచారించిన పోలీసులు, రాజకీయ నేతల పాత్రపై కూడా దృష్టి సారించినట్లు సమాచారం. కెటిఆర్‌కు నోటీసులు జారీ కావడంతో ఈ కేసు మరింత రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది.**కెటిఆర్ విచారణకు హాజరవుతారు..:**ఫోన్ ట్యాపింగ్ కేసులో బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు నోటీసులు అందాయి. 160 సిఆర్‌పిసి కింద సిట్ అధికారులు నోటీసులు ఇచ్చారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు జూబ్లీహిల్స్ ఎసిపి కార్యాలయంలో విచారణకు కెటిఆర్ హాజరు అవుతారని న్యాయవాది సోమ భరత్ స్పష్టం చేశారు. ఈ కేసులో చట్టబద్ధంగానే న్యాయపోరాటం చేస్తామని కెటిఆర్ తరపు న్యాయవాది సోమ భరత్ తెలిపారు.

## ఎఐ డేటా సెంటర్

(మొదటి పేజీ తరువాయి)

ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దడంలో ఆధునిక డిజిటల్ మౌలిక వసతులు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు అభివృద్ధిని సాధించడమే రాష్ట్ర లక్ష్యమని స్పష్టం చేశారు. రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ అధునాతన ఎఐ డేటా సెంటర్ల ఏర్పాటుకు అవసరమైన ప్రోత్సాహకాలు, సౌకర్యాలు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

**రూ.623 కోట్ల పెట్టుబడితో స్నైడర్ ఎలక్ట్రిక్ విస్తరణ**

తెలంగాణ రాష్ట్రంలో స్నైడర్ ఎలక్ట్రిక్ ఇండియా కంపెనీ తమ యూనిట్లను విస్తరించనుంది. శంషాబాద్ , గాగిల్లాపూర్‌లో రూ.623 కోట్ల పెట్టుబడితో విస్తరిస్తున్నట్లు వెల్లడించింది. ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఎఫ్) 2026లో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, స్నైడర్ కంపెనీ సిఈఓ దీపక్ శర్మతో సమావేశమయ్యారు. విద్యుత్ రంగంలో వస్తున్న మార్పులు, విద్యుత్ నిల్వ ప్రాజెక్టులు, గ్రిడ్ ఆధునీకరణ, విద్యుత్ సామర్థ్యం పెంపు, ఇండస్ట్రీయల్ పార్కులు, పట్టణ మౌలిక వసతులకు డిజిటల్ విద్యుత్ నిర్వహణ వంటి అంశాలపై సమావేశంలో చర్చించారు. స్నైడర్ ఎలక్ట్రిక్‌కు తెలంగాణలోనే 38 నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఉన్నాయని, ఈ యూనిట్ల విస్తరణతో ఎలక్ట్రికల్ సేఫ్టీకి సంబంధించి ఎయిర్ సర్క్యూట్ బ్రేకర్లు, మోల్డెడ్ కేస్ సర్క్యూట్ బ్రేకర్లు, కాంటాక్టర్లు, పుష్ బటన్ల తయారీ సామర్థ్యం పెరుగనుందని అధికారులు వెల్లడించారు. ఇంధన నిర్వహణ, ఆటోమేషన్, ఈవీ భాగాల తయారీలో స్మార్ట్ ఫ్యాక్టరీల విస్తరణపై మంత్రులు చర్చించారు. ప్రస్తుతం దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఎలక్ట్రానిక్స్ తయారీ కేంద్రాల్లో ఒకటిగా తెలంగాణ ఎదిగిందని మంత్రులు తెలిపారు.

**తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌కు వరల్డ్ ఎకనామిక్ ఫోరం మద్దతు:** దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సులో ఏర్పాటు చేసిన తెలంగాణ పెవిలియన్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వరల్ ఎకనమిక్ ఫోరమ్ మేనేజింగ్ డైరెక్టర్ జెరెమీ జర్గెన్స్, సి4ఐఆర్ నెట్‌వర్క్ కోఆర్డినేషన్ హెడ్ మంజు జార్లజతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రైజింగ్ విజన్ లక్ష్యాలతో పాటు వరల్ ఎకనమిక్ ఫోరమ్ ఫాలోఅప్ సదస్సు నిర్వహించే ప్రతిపాదనలను చర్చించారు. జనవరిలో దావోస్‌లో జరుగుతున్న సదస్సులోని చర్చలు, తీసుకున్న నిర్ణయాల పురోగతిని సమీక్షించుకునేందుకు ఫాలో అప్ సమావేశం ఉపయోగపడుతుందని సిఎం చెప్పారు. తెలంగాణలో అందుబాటులో ఉన్న అవకాశాలు, పారిశ్రామిక రంగంలో ఉన్న అనుకూలతలు, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, ప్రభుత్వ విధానాలను ప్రపంచానికి చూపించాలనే ఆలోచనను పంచుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపాదనకు వరల్డ్ ఎకనమిక్ ఫోరం బృందం సానుకూలంగా స్పందించింది. వివిధ దేశాల నుంచి ప్రతిపాదనలు వచ్చినప్పటికీ సమీప భవిష్యత్తులో నిర్ణయం తీసుకుంటామని మేనేజింగ్ డైరెక్టర్ జెరెమీ జర్గెన్స్ తెలిపారు.



చైనాలో ప్రతి ఏడాది 'సమ్మర్ దావోస్' జరుగుతోందని, సౌదీ అరేబియా కూడా ఆసక్తి ప్రదర్శిస్తోందని చెప్పారు. ఈ సమావేశంలో తెలంగాణ రైజింగ్–2047 విజన్, 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే రోడ్‌మ్యాప్, లక్ష్యాలను సిఎం వివరించారు. తెలంగాణ విజన్‌లోని విభిన్న కోణాలు, వివిధ కోణాలు పరస్పర సహకారానికి అవకాశం కల్పించేలా ఉన్నాయని డైరెక్టర్ జెరెమీ జర్గెన్స్ ప్రశంసించారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌లో తాము భాగస్వామ్యం పంచుకుంటామన్నారు. తెలంగాణ ఆర్థిక వృద్ధి ప్రయాణంలో కలిసి వస్తామనే సంకేతాలు ఇచ్చారు. సమావేశంలో రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేట్టి, అధికారులు పాల్గొన్నారు.

## పేదలు ఏకమవ్వాలి (మొదటి పేజీ తరువాయి)

అవకాశం. వారు ఐక్యంగా నిలబడితే, (ప్రధానమంత్రి నరేంద్ర) మోదీ వెనక్కి తగ్గుతారు. ఎంజి నరేగాను పునరుద్ధరిస్తారు' అని అన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం వ్యవస్థలోని మూడవ అంచె అయిన పంచాయతీరాజ్ వ్యవస్థ ద్వారా పనిచేసిందని, ఈ పథకంలో ప్రజల గళం, వారి హక్కులు పొందుపరిచి ఉన్నాయని, దీని ద్వారా పేదలకు పని హక్కు కల్పించబడిందన్నారు. అతే ఇప్పుడు నరేంద్ర మోదీ–బిజెపి ఈ భావనను అంతం చేయడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. 2020లో మోదీ ప్రభుత్వం తీసుకువచ్చి, మరుసటి సంవత్సరం రద్దు చేసిన వ్యవసాయ చట్టాలను గుర్తుచేసుకుంటూ, కొన్ని సంవత్సరాల క్రితం బిజెపి రైతులపై దాడి చేసిందని గాంధీ అన్నారు. మోదీ ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా నల్ల చట్టాలను తీసుకురాగా, వాటిని రైతులు అడ్డుకోగలిగారని, పార్లమెంటులో, వీధుల్లో, రైతులతో కలిసి తాము ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఆ చట్టాలను రద్దు చేయించామని రాహుల్ గుర్తు చేశారు. ప్రభుత్వం రైతులకు ఏ పద్ధతిని అయితే వర్తింపజేసిందో, ఇప్పుడు అదే పద్ధతిని కార్మికులపై కూడా ప్రయోగించడానికి ప్రయత్నిస్తోందని గాంధీ ఆరోపించారు. ఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వం ఏ రాష్ట్రానికి ఎంత డబ్బు పంపాలి అని నిర్ణయిస్తుందనేది దీని వెనుక ఉన్న ఆలోచన అని అన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాలకు ఎక్కువ డబ్బు, ప్రతిపక్షాలు పాలించే రాష్ట్రాలకు తక్కు వ డబ్బు వెళ్తుందని ఆయన ఆరోపించారు. పని ఎప్పుడు, ఎక్కడ జరుగుతుందో, కార్మికుడికి ఎంత వేతనం లభిస్తుందో కేంద్ర ప్రభుత్వం మాత్రమే నిర్ణయిస్తుందని, కార్మికుల హక్కులు పూర్తిగా హరించబడ్డాయని మండిపడ్డారు. కార్మికులకు గతంలో లభించేది ఇప్పుడు కాంట్రాక్టర్లు, బ్యూరోక్రసీకి వెళ్తుందని విమర్శించారు. దేశ సంపద, ఆస్తిని కొద్దిమంది చేతుల్లో కేంద్రీకరించడమే బిజెపి విధానాలన్నింటి లక్ష్యమని, ఆ కొద్దిమందే ఈ దేశాన్ని పరిపాలించాలని చూస్తున్నారని రాహుల్‌గాంధీ ఆరోపించారు. గత లోక్‌సభ ఎన్నికల్లో రాజ్యాంగంపై బిజెపి దాడి చేస్తోందని తాను చెప్పానని గాంధీ గుర్తు చేశారు. 'వ్యవసాయ చట్టాలు రాజ్యాంగంపై దాడి, పెద్ద నోట్ల రద్దు కూడా అంతే, లోపభూయిష్టమైన జిఎస్‌టి కూడా అంతే. ఈ కొత్త చట్టం పేరు ఏమిటి.... నాకు తెలియదు' అని ఆయన అనగా, సభికులలో కొందరు 'విబి–జి రామ్ జి' అంటూ గుర్తుచేశారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, 'ఒక వ్యక్తి–ఒక ఓటు' అనే భావనను అంతం చేయడమే బిజెపి ఆలోచన అని మాజీ కాంగ్రెస్ అధినేత అన్నారు. మోదీ సర్కార్ ఎంజి నరేగాను రద్దు చేయడం మహాత్మాగాంధీ పేరును ప్రజల మదిలో నుండి తొలగించే ప్రయత్నమేనని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే గురువారం ఆరోపించారు. పార్లమెంట్ రాబోయే బడ్జెట్ సమావేశాల్లో తమ పార్టీ ఈ విషయాన్ని గట్టిగా లేవనెత్తుతుందని ఉద్ఘాటించారు. ప్రజలు ఏకమై ఈ కొత్త చట్టాన్ని అమలు చేయకుండా ప్రభుత్వాన్ని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు.

## అదే తీరు...(మొదటి పేజీ తరువాయి)

సొంత వ్యాఖ్యలు చేశారని ఆరోపించడమే కాకుండా, ఆయనను కేంద్రానికి కనుసన్నల్లో పనిచేసే వ్యక్తి అని అభివర్ణించారు. కేరళ, తమిళనాడులతో పాటు, బిజెపి యేతర పాలనలో ఉన్న మూడు దక్షిణ రాష్ట్రాలలో రెండు రోజుల్లో జరిగిన మూడవ ఘటన ఇది. గెహ్లాట్ శాసన సభ, శాసనమండలి సంయుక్త సమావేశంలో సంక్షిప్త ప్రసంగం తర్వాత బయటకు వెళ్లిపోయారు. ఈ సమయంలో అధికార కాంగ్రెస్ సభ్యులు నిరసన తెలుపుతూ, ఆయన్ను ఘెరావ్ చేయడానికి కూడా ప్రయత్నించారు. కాగా, గవర్నర్ తన ప్రసంగాన్ని ముఖ్యమంత్రి, అసెంబ్లీ స్పీకర్ యుటి ఖాదర్, మండలి చైర్మన్ బసవరాజ్ హొరట్టి, ప్రతిపక్ష నాయకులు, మంత్రులు, సభ్యులకు శుభాకాంక్షలు తెలుపుతూ ప్రారంభించారు. 'రాష్ట్ర శాసనసభ ఉభయ సభల సంయుక్త సమావేశానికి మీ అందరికీ హృదయపూర్వక స్వాగతం పలుకుతున్నాను. కర్ణాటక శాసనసభలో మరో సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగించడం నాకు చాలా సంతోషంగా ఉంది. రాష్ట్ర ఆర్థిక, సామాజిక, భౌతిక అభివృద్ధి వేగాన్ని రెట్టింపు చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. జై హింద్. జై కర్ణాటక' అని ఆయన హిందీలో చెప్పి, అక్కడి నుండి వెళ్లిపోయారు. హెచ్ కె పాటిల్ (న్యాయ, పార్లమెంటరీ వ్యవహారాలు) వంటి మంత్రులతో సహా అధికార పక్ష సభ్యులు ఆశ్చర్యంతో లేచి, ప్రసంగాన్ని పూర్తి చేయాలని గెహ్లాట్‌ను అభ్యర్థించారు. గవర్నర్ నిష్క్రమణ ద్వారం వైపు వెళ్తుండగా, ఎమ్మెల్సీ బికె హరిప్రసాద్ సహా కొందరు అధికార పార్టీ శాసనసభ్యులు నినాదాలు చేస్తూ ఆయన్ను ఘెరావ్ చేయడానికి ప్రయత్నించారు. వారిని భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. అనంతరం శాసనసభ్యులు 'సిగ్గు సిగ్గు' అని, కన్నడలో 'ధిక్కార–ధిక్కార, రాజ్యపాలరిగే ధిక్కార' (గవర్నర్‌కు నిరసన) అని నినాదాలు చేశారు. అయితే గవర్నర్‌ను సమర్థిస్తూ బిజెపి సభ్యులు 'భారత్ మాతా కీ జై' అని నినాదాలు చేశారు. గెహ్లాట్ చర్యపై ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తీవ్రంగా స్పందించారు. ఆయన తన రాజ్యాంగ బాధ్యతలు, విధులను నిర్వర్తించడంలో విఫలమయ్యారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేసిన ప్రసంగానికి బదులుగా గవర్నర్ తన సొంత ప్రసంగాన్ని చదివారని ఆరోపించిన సిద్ధరామయ్య, గెహ్లాట్ రాజ్యాంగ ఆదేశాలను పాటించలేదని మండిపడ్డారు. ప్రభుత్వం సిద్ధం చేసిన పూర్తి ప్రసంగాన్ని చదవకుండా గవర్నర్ రాజ్యాంగాన్ని ఉల్లంఘించారని, కేంద్ర ప్రభుత్వ 'కనుసన్నల్లో పనిచేసే వ్యక్తి'లా వ్యవహరించారన్నారు.'ప్రతి కొత్త సంవత్సరం గవర్నర్ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించాలి. రాష్ట్ర మంత్రివర్గం సిద్ధం చేసిన ప్రసంగాన్ని చదవాలి. అది రాజ్యాంగ బద్ధం. ఎందుకంటే, రాజ్యాంగంలోని ఆర్టికల్ 176, ఆర్టికల్ 163 ప్రకారం గవర్నర్ ప్రభుత్వం లేదా మంత్రివర్గం సిద్ధం చేసిన ప్రసంగాన్ని చదవాలి' అని సిద్ధరామయ్య విలేకరులతో అన్నారు. గురువారం అసెంబ్లీ సమావేశాలు ప్రారంభంలో మంత్రివర్గం సిద్ధం చేసిన ప్రసంగాన్ని చదవడానికి బదులుగా, ఆయన స్వయంగా సిద్ధం చేసుకున్న ప్రసంగం చేశారని,ఇది భారత రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధమని సిద్ధ రామయ్య పేర్కొన్నారు. ఇది ఆర్టికల్ 176, 163లను స్పష్టంగా ఉల్లంఘిస్తుందని, అందువల్ల ఇది గవర్నర్ ప్రసంగం కాదన్నారు. ఆయన రాజ్యాంగం ప్రకారం తన విధులను నిర్వర్తించలేదని ముఖ్యమంత్రి తీవ్రంగా విమర్శించారు. ఈ నేపథ్యంలో తాము గవర్నర్ వైఖరికి వ్యతిరేకంగా నిరసన తెలుపబోతున్నామన్నారు. సుప్రీంకోర్టును ఆశ్రయించాలా వద్దా అని తాము పరిశీలిస్తున్నామని చెప్పారు. బిజెపియేతర పాలిత రాష్ట్రాలలో ఎన్నికైన ప్రభుత్వాలు, రాజ్‌భవన్‌ల మధ్య జరుగుతున్న వరుస ఘర్షణలలో భాగంగా, రాజ్‌భవన్, కాంగ్రెస్ ప్రభుత్వం మధ్య నెలకొన్న ఉద్రిక్త ప్రతిష్టంభన తర్వాత గెహ్లాట్ క్లుప్తంగా కనిపించారు. గవర్నర్ తన ప్రసంగం ముగింపులో జాతీయ గీతం ఆలపించే వరకు వేచి ఉండనందున, ఆయన జాతీయ గీతాన్ని అవమానించారని పాటిల్ ఆరోపించారు.

## కేటాయించొద్దు

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసి దేశ చరిత్రలోనే కొత్త అధ్యాయం సృష్టించిందని, ధాన్యం దిగుబడి, కొనుగోలులో కూడా తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ఆల్‌టైమ్ రికార్డ్‌ను సాధించిందని ఆయన వెల్లడించారు. '2025–26 రబీ సీజన్ 'ధాన్యం కొనుగోలు, రబీ 2025–26 రబీ సీజన్ కొనుగోలు ప్రణాళిక అంశంపైన హైదరాబాద్‌లోని ఐఎఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్ బిల్డింగ్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గురువారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ధాన్యం కొనుగోలు, దిగుబడి, సరఫరా, ప్రజా పంపిణీ వ్యవస్థ తదితర అంశాలపైన పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఎం.స్టీఫెన్ రవీంద్ర పవర్‌పాయింట్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ గైడ్‌లైన్స్‌ను మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థ బాగుపడితే ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా బియ్యంతో పాటు మరిన్ని నిత్యావసర సరుకుల సరఫరాకు ప్రభుత్వం ఆలోచిస్తుందన్నారు. రాష్ట్రంలో 2020–21 లో నమోదైన 70.2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు రికార్డ్‌ను అధిగమించి, తాజాగా జరిగిన ఖరీఫ్ సీజన్ లో 71.64 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసి దేశ చరిత్రలోనే కొత్త అధ్యాయం సృష్టించిందని వెల్లడించారు. దేశ చరిత్రలోనే ఇంత పెద్ద స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసిన దాఖలాలు దేశంలోని ఏ ఇతర రాష్ట్రాలలో లేదన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారతదేశ చరిత్రలోనే రికార్డ్ స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసిన ఘనత తెలంగాణ రాష్ట్రానికి దక్కిందన్నారు. మద్దతు ధరతో పాటు సన్నాలకు మొట్ట మొదటి సారిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న బోనస్ తో కలిపి మొత్తం రూ 18,532.98 కోట్లను 14.20 లక్షల మంది రైతులకు చెల్లించామని వివరించారు. ఖరీఫ్ సీజన్ లో రాష్ట్ర వ్యాప్తంగా 8,548 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని, కొనుగోలుకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ధాన్యాన్ని నిల్వచేసే గోదాముల సామర్థ్యం 29 లక్షల మెట్రిక్ టన్నుల వరకే పరిమితమైందని, దీనిని కేంద్ర ప్రభుత్వ సహకారంతో పాటు ప్రభుత్వ,ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో గోదాములను ఆధునికరించే అంశాన్ని ప్రభుత్వం యోచిస్తోందని ఆయన చెప్పారు. ఆధునికీకరణ వల్ల తేమ శాతం నియంత్రణలో ఉంటుందని,తద్వారా నష్టానివారణ చర్యలు తీసుకునే అవకాశాలు ఉంటాయన్నారు.

**విదేశాలకు 'తెలంగాణ బియ్యం'..**

ఎఫ్‌సిఐ,ప్రజాపంపిణీ వ్యవస్థకు సరఫరా చేసిన తర్వాత మిగిలిన తెలంగాణ బియ్యాన్ని అంతర్జాతీయ మార్కెట్ డిమాండ్ మేరకు విదేశాలకు ఎగుమతి చేసేందుకు విధి విధానాలను రూపొందిస్తున్నామని ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయి డిమాండ్ ఉన్న ధాన్యాన్ని పండించేలా రైతులను ప్రోత్సహించేందుకు ప్రోత్సాహకాల ఆవశ్యకత ఉందన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం సంవత్సరానికి రూ 38,000 కోట్లను నేరుగా రైతుల ఖాతాలో జమ చేయడం కుడా ఒక అరుదైన రికార్డ్ అని అన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా రాష్ట్రంలోని 3.17 కోట్ల మందికి(85 శాతం ప్రజలకు) ఉచితంగా సన్న బియ్యంను పంపిణీ చేస్తున్నామని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.13,650 కోట్లను ఖర్చు చేస్తుందని వివరించారు.

**బిహార్ వలస కార్మికులపైనే రైస్ మిల్లుల ఆధారం**

బీహార్ వంటి రాష్ట్రాల నుండి వలస వచ్చే కార్మికులపై తెలంగాణ రాష్ట్రంలో రైస్ మిల్లులు ఆధారపడుతున్నాయని,ఇటీవల ఆ రాష్ట్రంలో ఎన్నికలు జరిగితే వలస కార్మికులు వారి, వారి స్వస్థలాలకు వెళ్లిపోవడంతో కొనుగోళ్ల ప్రక్రియకు ఆటంకాలు ఏర్పడ్డాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. అటువంటి పరిస్థితి తిరిగి ఉత్పన్నం కాకుండా ఉండేందుకు స్థిరమైన కార్మిక వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కాగా పెద్దపల్లి జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్‌కు మంత్రి ఉత్తమ్ ప్రశంస పత్రాన్ని అందజేశారు.

## జైలు శిక్ష (మొదటి పేజీ తరువాయి)

కఠిన చర్యలు, కోర్టు విచారణల అనంతరం, మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిలో 270 మందిని దోషులుగా నిర్ధారిస్తూ హైదరాబాద్‌లోని న్యాయస్థానాలు తీర్పునిచ్చాయి. దోషులుగా తేలిన వారికి జైలు శిక్ష విధించడంతో వారిని జైలుకు తరలించారు. అంతేకాకుండా, ఈ వ్యక్తులు పనిచేస్తున్న ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, వారు చదువుతున్న విద్యాసంస్థలకు లేఖలు రాస్తూ, వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరడం జరుగుతోందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం తీవ్రమైన నేరమని, ఇది ప్రజల భద్రతకు పెను ముప్పు కలిగిస్తుందని హెచ్చరించారు. ఇటువంటి ఉల్లంఘనలను హైదరాబాద్ ట్రాఫిక్ విభాగం కఠినంగా పరిగణిస్తోందని తెలిపారు. మద్యం సేవించి పట్టుబడిన నిందితులకు ఎటువంటి మినహాయింపు లేకుండా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. ప్రజల ప్రాణాలను రక్షించడం, రోడ్డు క్రమశిక్షణను కాపాడటం కోసం ఈ ప్రత్యేక డ్రైవ్‌లు కొనసాగుతాయన్నారు. వాహనదారులందరూ తమ భద్రతతో పాటు ఇతరుల భద్రతను దృష్టిలో ఉంచుకుని, ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించి, ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని కోరారు.



# గిరిజనుల అభివృద్ధికి ఇందిరా సౌర గిరిజల వికాసం

## కృతజ్ఞతలు తెలపడానికే వచ్చా

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు

**ప్రజాపక్షం/జైనూరు/కెరిమేరి :** రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం రావాలని ఆనాడు పాదయాత్రలో దీవించిన గిరిజనులకు కృతజ్ఞతలు తెలపడానికే ఇక్కడికి వచ్చానని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. గురువారం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూరు మండలం జాంగాం గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగించారు. పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో గిరిజనులు వివరించిన అటవీ భూముల సాగు సమస్యల పరిష్కారానికి దేశంలో ఎక్కడా లేని విధంగా ఇందిరా సౌర గిరిజల వికాసం పథకాన్ని తీసుకువచ్చామని ప్రకటించారు. ఈ పథకం ద్వారా ప్రభుత్వమే ఉచితంగా బోరు వేయించి, సోలార్ పవర్ ద్వారా విద్యుత్, డ్రిప్పు, పామ్ ఆయిల్ వంటి మొక్కలను అందిస్తుందని వివరించారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి అధికారులు వారానికి రెండు రోజులు పొలం బాట ప్రజల బాట నిర్వహిస్తున్నారని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. విద్యుత్ సమస్యలు ఉంటే 1912 నంబర్‌కు కాల్ చేస్తే 24 గంటల్లోనే సిబ్బంది వచ్చి పరిష్కరిస్తారని పేర్కొన్నారు. పివిటిజి గిరిజనులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, పేద బిడ్డలకు ప్రపంచ స్థాయి విద్య కోసం యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్స్ నిర్మిస్తున్నామని వెల్లడించారు. ఉట్నూరు నుంచి ఆసిఫాబాద్ వరకు రహదారి వెడల్పు పనులకు టెండర్లు పిలవబోతున్నామని, అనార్పల్లి వంతెన నిర్మాణాన్ని మంజూరు చేసినట్లు ప్రకటించారు. మహిళా సంఘాలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి దండే విఠల్, ట్రైకార్ రాష్ట్ర చైర్మన్ బెల్లయ్య నాయక్, జిసిసి చైర్మన్ కోట్నాక తిరుపతి, ఎన్పిడిసిఎల్ సిఎండి వరుణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ కె.హరిత, జిల్లా ఎస్‌పి నితిక పంత్, డిఎఫ్ఒ నీరజ్ కుమార్, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఎఎస్‌పి చిత్తరంజన్, ఎఎంసి చైర్మన్ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్రం



ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 12వ తేదీన చేపట్టనున్న దేశవ్యాపిత సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కేంద్ర కార్మిక సంఘాల రాష్ట్ర సదస్సు పిలుపునిచ్చింది. దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు, రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో "సమ్మె సన్నాహక రాష్ట్ర సదస్సు" హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం జరిగింది.
ఈ సదస్సుకు కార్మిక సంఘాల నాయకులు ఎం. నర్సింహా (ఎఐటియుసి), విజయ్‌కుమార్ (ఐఎన్‌టియుసి), రెబ్బారామారావు (హెచ్ఎంఎస్), చుక్క రాములు (సిఐటియు), పద్మ (టియుసిఐ), ఎం. శ్రీనివాస్ (ఐఎఫ్‌టియు), శ్రీనివాస్ (బిఆర్‌టియు), భరత్ (ఎఐయుటియుసి) అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాల్‌రాజ్ మాట్లాడుతూ అనేక పోరాటాలు, ఉద్యమాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలలో 29 చట్టాలను సంపూర్ణంగా రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లను ప్రవేశపెట్టి కార్మికుల హక్కులను కేంద్రం కాలరాస్తోందని విమర్శించారు. బ్రిటీష్ ప్రభుత్వంలో కార్మికులు అనేక ఉద్యమాలు చేసి 1923లోనే ప్రమాద నష్టపరిహార చట్టం సాధించుకున్నారని, ఈ చట్టం ఇప్పటికీ అమలవుతున్న చట్టాలలో ఒక్కటిగా ఉన్నదన్నారు. బిజెపి పాలనలో ప్రజల ఆర్థిక వ్యవస్థ దిగజారుతోందని, నిరుద్యోగం పెరుగుతోందని, సామాన్య ప్రజాస్వామ్య హక్కులపై దాడులు జరుగుతున్నాయని, విద్వేషపూరిత ప్రచారాల నేపథ్యంలో సంఘాలను ఏర్పాటుచేసుకునే హక్కును కాలరాస్తున్నారని మండిపడ్డారు. సమ్మె, నిరసనలు తెలియజేసే హక్కును కూడా బిజెపి ప్రభుత్వం అణచివేస్తుందని విమర్శించారు.
ఆదానీ, అంబానీలకు కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలను కారుచౌకగా అప్పగిస్తున్నారని దుయ్యబట్టారు. ఐఎన్‌టియుసి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జనక్‌ప్రసాద్, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, టియుసిఐ రాష్ట్ర నాయకులు కె.సూర్యం, ఐఎఫ్‌టియుసి రాష్ట్ర నాయకులు శ్రీనివాస్, బిఆర్‌టియు రాంబాబు యాదవ్, టిఎన్‌టియుసి రాష్ట్ర నాయకులు ఎం.కె.బోస్ మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు సామాన్యుల భూములను స్వాధీనం చేసుకునేందుకు కేంద్రం ప్రవేశపెట్టిన మూడు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా రైతులు పెద్ద ఎత్తున పోరాటం చేశారని, ఫలితంగా కేంద్రం ప్రభుత్వం వెనక్కితగ్గాల్సి వచ్చిందని, రైతులకు ప్రధాని మోదీ క్షమాపణచెప్పాల్సి వచ్చిందని గుర్తుచేశారు. విత్తన, విద్యుత్ సవరణ బిల్లులు, మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం లక్ష్యాలను మార్చి, గాంధీ పేరును మార్చి వివిజి రాంజి చట్టం 2025 తీసుకొచ్చి వ్యవసాయ రంగాన్ని మరింత సంక్షోభంలోకి నెట్టుతోందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# గ్రంథాలయాలు.. ఆధునిక దేవాలయాలు






మంత్రి జూపల్లికృష్ణారావు

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** సమాజ రుగ్మతలను నిర్మూలించే శక్తి పుస్తకాల సొంతమని నేటి ఆధునిక యుగంలో గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని, ప్రతి ఇల్లు ఒక గ్రంథాలయంగా మారాలని తెలంగాణ రాష్ట్ర టూరిజం, ఎక్సైజ్ శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం కొల్లాపూర్ పట్టణంలో నూతనంగా సిఎస్ఆర్ నిధులతో ఆధునికరించిన ఆధునాతన కంప్యూటర్లు, పుస్తకాలతో ఏర్పాటుచేసి డిజిటల్ గ్రంథాలయాన్ని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్‌తో కలిసి మంత్రి జూపల్లి కృష్ణారావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లికృష్ణారావు మాట్లాడుతూ దినపత్రికలు చదవడాన్ని దినచర్యలో భాగం చేసుకోవాలని, యువతి, యువకులు గ్రంథాలయంలో జ్ఞానాన్ని పెంచుకునేవిధంగా గ్రంథాలయాలను వినియోగించుకోవాలన్నారు. పోటిపరీక్షల్లో ప్రతిభతో రాణించేలా గ్రంథాలయాల వివిధ పుస్తకాలు, దినపత్రికలను చదవాలన్నారు.
జిల్లా కేంద్రంలో కూడా ఈరకమైన గ్రంథాలయంలేదని, మరిన్ని ఆధునాతన పుస్తకాలు వసతులు కల్పించి ప్రత్యేకంగా గుర్తింపువచ్చేలా గ్రంథాలయాన్ని తీర్చిదిద్దుతామని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కొల్లాపూర్ ఆర్‌డిఓ భన్సీలాల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.
**మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రజాప్రభుత్వ లక్ష్యం :** మహిళలను కోటీశ్వరులను చేయడమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రజాప్రభుత్వ ధృడసంకల్పమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్‌శాఖమంత్రి జూపల్లికృష్ణారావు అన్నారు. కొల్లాపూర్ పట్టణంలోని రాజకోట ఆవరణలో నిర్వహించిన సభలో మెప్మాపరిధిలోని 153 స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రభుత్వం మంజూరుచేసిన వడ్డీలేని రుణాలు రూ.47.15లక్షల విలువైన జంబోచెక్‌ను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళల ఆత్మగౌరవం, ఆర్థికస్వావలంభన పెంపొందించడమే ప్రజాప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ఇందిరమ్మరాజ్యంలో మహిళల సంక్షేమానికి తొలి సంతకంగా మహాలక్ష్మి పథకం అమలుచేసి ఉచితబస్సు ప్రయాణసౌకర్యం కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని గుర్తుచేశారు. మహిళాభివృద్ధికి తెలంగాణప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని, గ్రామాలు, పట్టణాల్లో మహిళలు దుబారాఖర్చులను తగ్గించుకొని పొదుపు, పెట్టుబడులవైపు దృష్టిసారించాలని సూచించారు.
పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి విద్యాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. మహిళలను ఆర్థికంగా బలోపేతంచేయాలనే ఉద్దేశ్యంతోఅన్నిరకాల సంక్షేమ, అభివృద్ధిపథకాలను మహిళలపేరుపై అమలుచేస్తుందని అన్నారు. కార్యక్రమంలో కొల్లాపూర్ ఆర్‌డిఓ భన్సీలాల్, మెప్మా అధికారులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, కవి యాకుబ్, రాష్ట్రసాంస్కృతిక శాఖ సలహామండలి సభ్యులు పల్లెనర్సింహ్మా పాల్గొన్నారు.

## ఎపి మద్యం స్కామ్ కేసులో ...
# ముగిసిన విజయసాయిరెడ్డి విచారణ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎపి మద్యం స్కామ్ కేసులో మాజీ ఎంపి విజయసాయి రెడ్డిని డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఇడి) అధికారులు గురువారం విచారించారు. అయితే ఈ విచారణ ఉదయం 10 గంటలకు ప్రారంభమై సాయంత్రానికి ముగిసింది. దీంతో విజయసాయిరెడ్డి ఇడి కార్యాలయం నుంచి వెళ్లిపోయారు. ప్రధానంగా గత ప్రభుత్వం హయాంలో జరిగిన మద్యం విక్రయాలు, మద్యం పాలసీ, నిధుల మళ్లింపు, అవకతవకలు, సూత్రధారులెవరు, లావాదేవీలు ఎలా జరిగాయనే కోణంలోనే ఇడి అధికారులు ప్రశ్నించినట్లు తెలుస్తోంది. హైదరాబాద్ ఇడి కార్యాలయానికి రావాలని అధికారులు ఇచ్చిన నోటీసుల నేపథ్యంలో ఆయన విచారణకు హాజరయ్యారు. ఇడి అడిగిన పలు ప్రశ్నలకు విజయసాయిరెడ్డి సమాధానాలిచ్చినట్లు సమాచారం. దాదాపు 7 గంటల పాటు ప్రశ్నించిన అధికారులు విజయసాయి రెడ్డి స్టేట్మెంట్ రికార్డ్ చేశారు.

## సిఎం రేవంత్ రెడ్డి ఒక గంట ఆలోచిస్తే ...
# బిఆర్‌ఎస్ నామరూపాల్లేకుండా పోతుంది

రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక గంట ఆలోచిస్తే బిఆర్‌ఎస్ పార్టీ నామరూపాలు లేకుండా పోతుందని రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం నడుస్తుందని, సిఎం గురించి నోటికొచ్చినట్లు మాట్లాడితే ఊరుకోమని హెచ్చరించారు. గాంధీభవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పటిన ప్పటీ నుంచి ఇప్పటివరకు ఉస్మానియా యూనివర్సిటీకి వెళ్లలేని దద్దమ్మలు నేడు రేవంత్‌రెడ్డిని విమర్శించడం విడ్డూరంగా ఉందని, రాబోయే మున్సిపల్ ఎలక్షన్లలో రాష్ట్ర ప్రజలు చెంప చెల్లుమనేలా బిఆర్‌ఎస్‌కు గుణపాఠం చెబుతారని అన్నారు. కెటిఆర్, హరీష్‌రావు అబద్దాలకు బ్రాండ్ అంబాసిడర్లు అని, వంద అబద్దాలైన సునాయాసంగ నిజం అనుకునేలా మాట్లాడే సమర్థత వారిద్దరికే ఉందని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు ఏవైతే ఉన్నాయో, నీళ్లు, నిధులు, నియామకాలు అవి కేవలం కెసిఆర్ ఇంట్లో వాళ్లకే వచ్చాయని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రాన్ని దోచుకున్న కల్వకుంట్ల కుటుంబం ఏ రోజైనా తెలంగాణ ప్రజలకు ప్రయోజనాలపై దృష్టి పెట్టారా అని ప్రశ్నించారు.
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 10 కిలోమీటర్ల గోతిలో బొంద పెట్టినా వారి బుద్ధి మారడం లేదని, రాష్ట్రానికి రూ.లక్షల కోట్ల పెట్టుబడులు వస్తుంటే, అవి ఓర్వలేకనే దావోస్ పర్యటన గురించి బిఆర్‌ఎస్ పెంచి పోషించే యూట్యూబ్ ఛానల్స్, ట్విట్టర్‌లో అడ్డగోలుగా మాట్లాడుతూ పోస్టులు పెడుతున్నారని మండిపడ్డారు.

# టిటిడి జెఇఒగా నల్గొండ జిల్లావాసి డా.శరత్ నియామకం



పలువురు హర్షం.. అభినందనల వెల్లువ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలోని ఉమ్మడి నల్గొండ జిల్లా మిర్యాలగూడ రెవెన్యూ డివిజన్ పరిధిలోని కొండ్రపోల్ సమీపంలో గల పార్థునాయక్ తండాకు చెందిన రిటైర్డ్ ఐఎఎస్ డాక్టర్ ఎ.శరత్‌ను తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) విద్య, వైద్యం విభాగాల జాయింట్ ఎగ్జిక్యూటివ్ అధికారి (జెఇఒ)గా నియమిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఈనెల 20న జీవో జారీ చేశారు. బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి 1 ఏడాది పాటు పదవిలో కొనసాగనున్నారు. తెలంగాణ రాష్ట్రంలో గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శిగా పనిచేస్తూ డాక్టర్ శరత్ జూలై నెలలో రిటైర్ అయ్యారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 19 ఆగస్టు 2025న తెలంగాణ పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి కార్పొరేషన్ (తెలంగాణ రెనువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్) చైర్మన్‌గా నియమించారు. తెలంగాణ రాష్ట్రం 2005 బ్యాచ్ ఐఎఎస్ అధికారి అయిన డాక్టర్ శరత్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు అత్యంత సన్నిహితంగా మెలిగిన అధికారులలో ఒకరుగా పేరుపొందారు. డాక్టర్ శరత్ ముఖ్యమంత్రి నారాచంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పంలో (కుప్పం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) ప్రత్యేక అధికారిగా పనిచేశారు. టిటిడి జెఇఒగా డాక్టర్ ఎ.శరత్ నియామకం కావడం పట్ల ఉమ్మడి నల్గొండ జిల్లా గిరిజన అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు, మాజీ సర్పంచ్, నల్గొండ జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు సీతారాం నాయక్, బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మాలోత్ దశరథ్ నాయక్, మాజీ సర్పంచ్ ఆనంద్ నాయక్, న్యాయవాది శ్రీధర్‌గౌడ్ కే మాత్రు నాయక్, జైత్రం నాయక్, మహేందర్ నాయక్, డాక్టర్ జితేందర్ నాయక్, నాయకులు శశిధర్ నాయక్‌తో పాటు పలువురు హర్షం వ్యక్తం చేసి, అభినందనలు తెలియజేశారు.

# ఆయిల్ పామ్ విస్తీర్ణాన్ని పెంచడమే ప్రభుత్వ ఉద్దేశం

మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోని కొన్ని జిల్లాలలో ఆశించిన స్థాయిలో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం లేని ఆయిల్ పామ్ కంపెనీల జోన్లను వెంటనే రద్దు చేసి, ఆసక్తి ఉన్న ఇతర కంపెనీలకు ఇవ్వాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సూచించారు. ఆయిల్ పామ్ విస్తీర్ణాన్ని పెంచడమే ప్రభుత్వం ఉద్దేశమని, అందుకు ఎటువంటి కఠిన నిర్ణయాలైన తీసుకుంటామని స్పష్టం చేశారు. టిజి సీడ్స్ ద్వారా నాణ్యత కలిగిన విత్తనాలను ఉత్పత్తి చేసి రైతులకు అందుబాటులో తీసుకురావాలని, ఆటోమేటెడ్ డ్రిప్ సిస్టంలను ప్రయోగాత్మకంగా పరిశీలించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. సచివాలయంలో టిజి ఆయిల్ ఫెడ్, మార్క్‌ఫెడ్, విత్తనోత్పత్తి సంస్థల అధికారులతో మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఆయా సంస్థల పురోగతిపై గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. కేటాయించిన లక్ష్యాలను చేరుకోకపోవడంతో కరీంనగర్, ఆసిఫాబాద్, వరంగల్,హన్మకొండ జిల్లాలలోని ప్రైవేట్ ఆయిల్ పామ్ కంపెనీలకు సంబంధించిన జోన్లను ఇప్పటికే రద్దు చేసి, వాటిని ఆయిల్ ఫెడ్ సంస్థకు అప్పగించామని, ఒక వేళ నిర్ధిష్ట లక్ష్యాలను చేరుకోవడంలో ఆయిల్ ఫెడ్ సంస్థ కూడా విఫలమైతే ఆ సంస్థకు సంబంధించిన జోన్లను కూడా రద్దు చేస్తామని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. ఆయిల్ పామ్ ప్లాంటేషన్ విస్తరణ కోసం అవసరమైన చోట అవుట్ సోర్సింగ్ ద్వారా ఉద్యోగులను నియమించుకోవాలని ఆయిల్ ఫెడ్ ఎండికి సూచించారు. అయిల్ పామ్ సాగుకు అవసరమైన పనిముట్లను వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగం చేయాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపిని ఆదేశించారు. ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ అనంతరం వచ్చే వ్యర్థాల నుండి ఉప ఉత్పత్తులను తయారు చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు . కల్లూరుగూడం, బీచుపల్లిలోని ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ యూనిట్ల పనులను వేగవంతం చేయాలని, ఆయిల్ పామ్ సాగులో దిగుబడి పెంచేందుకు ఆయిల్ పామ్ రైతులకు ట్రైకోడర్మా, గానోడెర్మా నిరోధక బయో ఫర్టిలైజర్లైన వివిఎం, మెగ్నీషియం, సల్ఫర్ మొదలైన వాటిని 50 శాతం సబ్సిడీతో రైతులకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని, రైతులకు అవసరమైన వ్యవసాయ యంత్ర సేవల కోసం కస్టమ్ హైరింగ్ సెంటర్లను పామ్ ఆయిల్ రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయిల్ ఫెడ్ ఎండికి మంత్రి సూచించారు. పామ్ ఆయిల్ పై ప్రస్తుతం ఉన్న దిగుమతి సుంకాన్ని 16.5 శాతం నుండి గతంలో మాదిరిగా 44 శాతానికి పెంచాలని కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, శివరాజ్ సింగ్ చౌహాన్,పియూష్ గోయల్‌తో పాటు ప్రధాన మంత్రి మోదీకి కూడా లేఖ రాసినట్టు మంత్రి వివరించారు.
**'జొన్న, మొక్కజొన్న' ధాన్యానికి వెంటనే టెండర్లను ఆహ్వానించండి:** మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన జొన్న, మొక్కజొన్న ధాన్యానికి వెంటనే టెండర్లను ఆహ్వానించాలన్నారు. ప్రొక్యూర్‌మెంట్, సీడ్ వెరైటీలు, స్టోరేజీల నిర్వహణకు సంబంధించి ఇంకా పాత పద్ధతులనే అవలంభిస్తున్నామని, పెరుగుతున్న సాంకేతికతను దృష్టిలో పెట్టుకుని కొత్త విధానాలను రూపొందించాలని అన్నారు. మార్క్ ఫెడ్ లాంటి సంస్థల ద్వారా కేవలం తెలంగాణ రాష్ట్రంలోనే ఇంత పెద్ద మొత్తంలో ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని గోదాములలో ఎక్కువ కాలం స్టోరేజీ చేయకుండా, పంట పాడవకముందే మంచి రేటు రాగానే అమ్ముకోవాలని సూచించారు. విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా నాణ్యతమైన, అధిక దిగుబడి వచ్చే విత్తనాలను తయారు చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని విత్తనాభివృద్ధి సంస్థ ఎండికి సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో వ్యవసాయశాఖ డైరెక్టర్ డాక్టర్ గోపి, విత్తన అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి, గిడ్డంగుల కార్పోరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, ఆయిల్ ఫెడ్ ,విత్తనాభివృద్ధి సంస్థల ఎండి యాస్మిన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

# సిసిపై రూ.1 కోటి రివార్డు ప్రకటించిన కేంద్ర హోంమంత్రిత్వ శాఖ

## సమాచారం అందించిన వారికి భారీ బహుమతి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశ భద్రతకు ముప్పుగా మారిన సైబర్ క్రైమ్ (సిసి) కేసుల నియంత్రణలో భాగంగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ (ఎంహెచ్ఎ) ఏ సైబర్ క్రైమ్ కేసులోనైనా కీలక సమాచారం అందించిన వారికి రూ.1 కోటి వరకు నగదు బహుమతి (రివార్డు) ప్రకటించింది. సైబర్ నేరాలకు పాల్పడుతున్న నిందితుల గుర్తింపు, అరెస్టు, నెట్‌వర్క్‌ల నిర్వీర్యం లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర అధికారులు తెలిపారు. ప్రజల నుంచి వచ్చే విశ్వసనీయ సమాచారంతో సైబర్ మాఫియాపై ఉక్కుపాదం మోపేందుకు ఈ రివార్డు విధానం దోహదపడుతుందని కేంద్రం అభిప్రాయపడుతోంది. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని, సరైన ఆధారాలతో దర్యాప్తుకు సహకరించిన వారికి మాత్రమే రివార్డు వర్తిస్తుందని ఎంహెచ్ఎ స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాలు, డేటా చోరీలు, హ్యాకింగ్ ఘటనల నేపథ్యంలో కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం కీలకంగా మారింది.

# సైబర్ నేరాలు 17

## నిందితులు, బాధితులది ఒకే లక్ష్యం సులువుగా డబ్బు సంపాదించాలని



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సైబర్ నేరగాళ్లు ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 17 రకాల నేరాలకు పాల్పడుతున్నారు. సైబర్ నేరగాళ్ల కొత్త పంథాను పోలీసులు పసిగట్టి చర్యలు తీసుకునే లోపే వాళ్లు మరో ఎత్తుగడతో దోచుకునేందుకు తెర లేపుతున్నారు. ఇప్పటి వరకు వీళ్లు పదిహేడు రకాల నేరాలకు పాల్పడుతున్నారని పోలీసులకు అందిన ఫిర్యాదుల ఆధారంగా తేలింది. ఒక రకమైన సైబర్ నేరం నుంచి తప్పించుకునేందుకు ప్రజలను చైతన్య పరిచెలోపే మరో కొత్త పంథాతో నిందితులు ముందుకు రావడం పోలీసులకు పెద్ద ప్రాయసగా మారింది. సైబర్ నేరగాళ్లు ఏ కొత్త పద్ధతుల్లో ముందుకు వచ్చినా వారి లక్ష్యం మాత్రం బాధితుల బ్యాంక్ నిధులను దండుకోవడమే.నేరాలకు పాల్పడుతున్న వారు, బాధితులు సైతం విద్యావంతులు కావడం గమనార్హం.అయితే ఇక్కడ డబ్బులు సంపాదించే నిందితులు, డబ్బు పోగోట్లుకున్న బాధితుల బలహీనత ఒకే రకంగా ఉంటుంది. తక్కువ సమయంలో, అత్యంత సునాయసంగా డబ్బులు సంపాదించేందుకు నిందితులు తెగిపడుతుండగా అదే పద్దతుల్లో అత్యాశకు లోనై బాధితులు తమ డబ్బులను పోగోట్టుకుంటున్నారు. సైబర్ నేరగాళ్ల పద్దతులు ఇలా ఉన్నాయి.
**హ్యాకింగ్ :** ఒక ప్రభుత్వ కార్యాలయ వెబ్‌సైట్‌ను హ్యాక్ చేసి డేటాను మార్చడం లేదా వెబ్‌సైట్‌ను పనిచేయకుండా చేయడం.
**ఫిషింగ్ :** మీ బ్యాంక్ ఖాతా బ్లాక్ అవుతుంది అంటూ లింక్ పంపి, ఆ లింక్‌లో లాగిన్ డీటెయిల్స్ తీసుకుని ఖాతా ఖాళీ చేయడం.
**ఐడెంటిటీ దొంగతనం :** మీ ఆధార్, పాన్ వివరాలతో ఫేక్ సిమ్ తీసుకుని లోన్లకు అప్లై చేయడం.
డేటా బ్రీచ్, డేటా లీక్: హాస్పిటల్ డేటాబేస్ హ్యాక్ చేసి రోగుల మెడికల్ రిపోర్‌ట్స్ బయట పెట్టడం.
**మాల్‌వేర్/వైరస్ దాడులు :** ఫ్రీ యాప్ పేరుతో వైరస్ ఉన్న యాప్ పంపి మొబైల్ డేటాను దొంగతనం చేయడం.
**ర్యాన్సమ్‌వేర్ :** కంప్యూటర్‌లోని ఫైళ్లను లాక్ చేసి ₹5 లక్షలు చెల్లిస్తేనే ఫైళ్లు తెరుస్తాం అని డిమాండ చేయడం.
**ఆన్‌లైన్ షాపింగ్ మోసాలు :** ఫేస్‌బుక్‌లో చౌకగా మొబైల్ విక్రయమని ప్రకటన పెట్టి డబ్బు తీసుకుని సరుకులు పంపకపోవడం.
**క్రెడిట్/డెబిట్ కార్డ్ మోసాలు :** ఒటిపి చెప్పమని ఫోన్ చేసి, కార్డ్ డీటెయిల్స్‌తో అక్రమ లావాదేవీలు చేయడం.
**సోషల్ మీడియా అకౌంట్ హైజాక్ :** వాట్సాప్ అకౌంట్ హ్యాక్ చేసి ఫ్రెండ్స్‌కు డబ్బు అడగడం.
సైబర్ బుల్లీయింగ్ హరాస్మెంట్:ఒక మహిళకు అశ్లీల మెసేజ్‌లు, ఫోటోలు పంపుతూ బెదిరించడం.
**డిజిటల్ అరెస్ట్ స్కామ్ :** మీ పేరు మనీలాండరింగ్ కేసులో ఉంది, వీడియో కాల్‌లో పోలీస్ విచారణ జరుగుతోంది అంటూ కోట్ల రూపాయలు కాజేయడం.
**చైల్డ్ ఎక్స్‌ప్లోటేషన్ –పోర్నోగ్రఫీ:** నాబాలికల ఫోటోలు/వీడియోలను ఆన్‌లైన్‌లో షేర్ చేయడం లేదా అమ్మడం.
**యుపిఐ–క్యూర్ కోడ్ స్కామ్:** రిఫండ పేరుతో క్యూర్ కోడ్ పంపి స్కాన్ చేయించుకుని ఖాతా నుంచి డబ్బు తీసుకోవడం.
**డిడిఓఎస్ దాడులు:** ప్రముఖ ఈకామర్స్ వెబ్‌సైట్‌ను ఓవర్‌లోడ చేసి సేవలు నిలిపివేయడం.
**ఫేక్ జాబ్ స్కామ్స్:** ఇంట్లో నుంచే పని అంటూ రిజిస్ట్రేషన్ ఫీజు తీసుకుని మాయమవ్వడం.
**ఆన్‌లైన్ పెట్టుబడి మోసాలు:** క్రిప్టో,షేర్ మార్కెట్‌లో రోజుకు డబుల్ లాభం అంటూ నమ్మించి డబ్బు కాజేయడం.
**డిప్‌ఫేక్ నేరాలు :**
ఒకరి ముఖాన్ని వీడియోలో మార్పు చేసి అశ్లీల వీడియోలు తయారు చేసి బెదిరించడం.
**ప్రజలకు హెచ్చరిక :** టిజిసిఎస్‌బి శిఖాగోయల్
సైబర్ నేరాల బారిన పడకుండా ఉండేందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు కార్యక్రమాలు చేపట్టామని శిఖాగోయల్ తెలిపారు.పోలీస్, సిబిఐ, ఇడి, బ్యాంక్ అధికారులు ఎప్పుడూ వీడియో కాల్‌లో అరెస్ట్ చేయరని ఆమె తెలిపారు.ఒటిపి,పిన్,క్యూర్ కోడ్ ఎవరికీ చెప్పకూడదన్నారు. అనుమానాస్పద లింక్‌లపై క్లిక్ చేయవద్దని హెచ్చరించారు.


**పురపాలక సంఘ కార్యాలయము – దుబ్బాక, జిల్లా :: సిద్దిపేట**

నెం. E1/08/15th FC/2025. టెండర్ ప్రకటన తేది: 22.01.2026.

దుబ్బాక పురపాలక సంఘం పరిధిలోని, 1). దుబ్బాక బి. సి. కాలనీ (మారెమ్మ గడ్డ) నుండి మల్లాయిపల్లి వరకు మంచినీటి పైపు లైన్ వేయుట కొరకు రూ: 9.00 లక్షలు, 2). దుబ్బాక పురపాలక సంఘం పరిధిలోని వివిధ వార్డులలో కొత్తగా ఏర్పడిన కాలనీలలో మంచినీటి పైపు లైన్లు వేయుట కొరకు రూ: 3.00 లక్షలు, 15 వ ఆర్థిక నిధుల నుండి మొత్తం రూ: 12.00 లక్షలు మంజూరీ కాబడినవి. ఇట్టి పనులు నిర్వహించుటకు పనులను చేపట్టుటకు ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్ ఆహ్వానించనైనది.

| | | |
|---|---|---|
| 1. | బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేదీ: | 23.01.2026 11.00 A.M. |
| 2. | బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ చివరి తేదీ: | 26.01.2026 4.00 P.M. |
| 3. | బిడ్ వ్యాలిడిటి పీరియడ్ | 90 Days |
| 4. | వివరములకు సంప్రదించు ఫోన్ నెం. | 9390988378, 9391495430, |

పైన తెలిపిన పనులకు టెండర్ ద్వారా ఆహ్వానించనైనది. తదుపరి వివరాలకు ఈ ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్ www.eprocurment.telangana.gov.in సంప్రదించగలరు.

సం/- కమీషనర్
పురపాలక సంఘం, దుబ్బాక.
DIPR R.O. No. : 14183-PP/CL/ADVT/1/2025-26, Date: 22-01-2026

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్ నెం.29, మూసారాంబాగ్.
GHMC

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ ప్రకటన

Short Tender NIT No.02/EE-29/Moosarambagh/CRZ/GHMC/2025-26 తేది: 21.01.2026

**పని స్వభావం:** వార్షిక పూడికతీత పనులు. **అంచనా మొత్తం:** రూ.87.60 లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 23.01.2026న మ.03.00గం.ల నుండి, బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది: 27.01.2026న మ.03.00గం.ల వరకు. **అధికారి పేరు & చిరునామా:** శ్రీ షేక్ సనాఉద్దీన్, ఇఇ, సర్కిల్-29, మూసారాంబాగ్, సిఆర్‌జెడ్, జిహెచ్ఎంసి, హైదరాబాద్. ఫోన్ నెం. 7993727669. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.tender.eprocurement.gov.inలో చూడవచ్చు. **గమనిక:** టెండర్ నోటీసు తేదీ తర్వాత 1% ఈఎండిని పొందాలి.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-29, మూసారాంబాగ్, చార్మినార్ జోన్, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 14188-PP/CL/ADVT/1/2025-26, Date: 22-01-2026

## సిఎం రేవంత్ రెడ్డి బృందం

# దావోస్ పర్యటన విజయవంతం




ప్రజాపక్షం/హైదరాబాద్: 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధుల బృందం స్విట్జర్‌లాండ్‌లోని దావోస్ పర్యటన విజయవంతంగా ముగిసింది. గత నెలలో హైదరాబాద్‌లో జరిగిన గ్లోబల్ సమ్మిట్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భారీగా రూ.5.75 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించింది. మూడు రోజుల వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సులోనూ తెలంగాణ ఆశించిన లక్ష్యాన్ని సాధించింది. మూడు రోజుల పాటు జరిగిన ఈ పర్యటనలో ప్రతినిధుల బృందం గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు, డేటా సెంటర్లు, క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ, తయారీ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించింది. ఎఐ, సస్టైనబిలిటీ, స్కిల్లింగ్ కార్యక్రమాలకు సంబంధించిన పలు అవగాహన ఒప్పందాలు (ఎంఓయులు) కుదుర్చుకుంది. ఈ పర్యటనలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి వరల్డ్ ఎకనామిక్ ఫోరం నిర్వహించిన రెండు కీలక సెషన్‌లలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన చేసిన ప్రసంగం, హైదరాబాద్‌లో వరల్డ్ ఎకనమిక్ ఫాలోఅప్ ఫోరమ్ నిర్వహించాలనే ప్రతిపాదనకు సానుకూల స్పందన లభించింది. మూడు రోజుల్లో ప్రపంచ స్థాయి ప్రముఖ కంపెనీలు, పారిశ్రామిక దిగ్గజాలతో 12 ముఖాముఖి సమావేశాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. పలు కీలక సమావేశాలు, ప్రత్యేక సెషన్ల అనంతరం మూడు రోజుల తెలంగాణ ప్రతినిధి బృందం దావోస్ పర్యటన గురువారం సాయంత్రం ముగిసింది. తద్వారా వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్–2026 సదస్సులో పెట్టుబడులకు మించి తెలంగాణ రైజింగ్ 2047 విజన్ లక్ష్యాలను ప్రపంచానికి చాటి చెప్పాలనే ప్రభుత్వ సంకల్పం నెరవేరిందని ముఖ్యమంత్రి కార్యాలయం ప్రకటించింది. దావోస్‌లో కార్యక్రమాలు ముగించుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూరిచ్ వెళ్ళారు. అక్కడి నుంచి అమెరికా పర్యటనకు వెళ్లనున్నారు. రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి దావోస్ పర్యటన ముగించుకుని భారతదేశానికి తిరిగి రానున్నారు.

## తెలంగాణ ఎఐ ఇన్నోవేషన్ హబ్‌కు అపూర్వ స్పందన

దావోస్‌లో జరిగిన వరల్ ఎకనామిక్ ఫోరం–2026 సమావేశాల్లో తెలంగాణ ఎఐ ఇన్నోవేషన్ హబ్‌కు అంతర్జాతీయ స్థాయిలో అపూర్వ స్పందన లభించింది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వం లోని 'తెలంగాణ రైజింగ్' బృందం పలు ప్రతిష్ఠాత్మక సంస్థలతో అవగాహన ఒప్పందాలు (ఎంఓయులు) కుదుర్చుకుంది. బ్రిటన్‌కు చెందిన ప్రముఖ విద్యా, పబ్లిషింగ్ సంస్థ పియర్సన్ తెలంగాణ ప్రభుత్వంతో ఎంఓయు కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా తెలంగాణలో ఏర్పాటు కానున్న గ్లోబల్ ఎఐ అకాడమీకి పియర్సన్ సహకారం అందించనుంది. ఎఐ శిక్షణ, పాఠ్య ప్రణాళిక, లెర్నింగ్ కంటెంట్, అంచనా విధానాలు, అంతర్జాతీయ స్థాయి సర్టిఫికేషన్‌లో తన నైపుణ్యాన్ని పియర్సన్ ఉపయోగించనుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మాట్లాడుతూ యువతకు ఎఐ శిక్షణ అందించి భవిష్యత్ తరాలకు నైపుణ్యం కలిగిన రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. ఎంఓయు కుదుర్చుకున్న బృందాన్ని ఆయన అభినందించారు. తెలంగాణ ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, హైదరాబాద్‌లో ఎఐ సిటీ నిర్మాణానికి అవసరమైన పూర్తి స్థాయి ఎకో సిస్టమ్‌ను అభివృద్ధి చేస్తామని చెప్పారు. తెలంగాణలో ఇప్పటికే అన్ని ప్రముఖ టెక్ కంపెనీలు ఉన్నాయని, ప్రతిభ, మౌలిక సదుపాయాలు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (ఐటి, పరిశ్రమలు) సంజయ్ కుమార్ మాట్లాడుతూ, పియర్సన్‌తో కలిసి ఉన్నత నైపుణ్యాలు కలిగిన మానవ వనరుల అభివృద్ధి దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. ప్రాజెక్టు త్వరితగతిన అమలుకు అవసరమైన అనుమతులు ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. జార్జౌన్ యూనివర్సిటీకి చెందిన ఎఐ కోల్యాబ్ సంస్థతో కూడా తెలంగాణ ప్రభుత్వం ఎంఓయు కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా ఆరోగ్య రంగంలో ఎఐ ఆధారిత పరిశోధనలు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆరోగ్య సంరక్షణ, ప్రజారోగ్యం, లైఫ్ సైన్సెస్ రంగాల్లో అనువర్తిత పరిశోధనలకు ఇది దోహదపడనుంది. అలాగే దుబాయ్ మల్టీ కమోడిటీస్ సెంటర్ (డిఎంసిసి) తో కుదిరిన ఎంఓయు ద్వారా స్టార్టప్‌లు అభివృద్ధికి అవకాశాలు అన్వేషించనున్నారు. రెండు దేశాల మార్కెట్లు, ఎకోసిస్టమ్‌లపై అవగాహన కల్పించడంతో పాటు, అంతర్జాతీయ సదస్సులు, కార్యక్రమాలు నిర్వహించే అంశాన్ని కూడా పరిశీలించనున్నట్లు మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు.

**సౌర , పవన విద్యుత్ ఉత్పత్తికి ఐనాక్స్ గ్రూప్ ఆసక్తి**

ఐనాక్స్ గ్రూప్ తెలంగాణలో సౌర , పవన విద్యుత్ ఉత్పత్తి చేపట్టి, ఆ తర్వాత తయారీ రంగంలోకి విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందిస్తోంది. తెలంగాణను కాలుష్య రహిత మహానగరంగా అభివృద్ధి చేసే లక్ష్యంతో ఐనాక్స్ గ్రూప్ డైరెక్టర్ దేవాంశ్ జైన్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సోలార్ మాడ్యూల్స్ సహా ఆధునిక, సుస్థిర తయారీ రంగాల్లో సహకార అవకాశాలపై చర్చించారు. రాష్ట్ర పారిశ్రామిక రంగానికి కాలుష్యం లేని విద్యుత్ (క్లీన్ ఎలక్ట్రిసిటీ) , గ్రీన్ హైడ్రజన్ అందిచాలనే ప్రణాళికలు ప్రభుత్వం రూపొందిస్తున్నదని తెలంగాణ ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. డేటా సెంటర్ల నుంచి అధిక స్థాయిలో పునరుత్పాదక విద్యుత్ అవసరం పెరుగుతోందని చెప్పారు. నూతన తెలంగాణ ఎనర్జీ పాలసీ కింద అనేక ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

## హైదరాబాద్ గోద్రేజ్ డెయిరీ విస్తరణ

### గోద్రేజ్ ఇండస్ట్రీస్ ఛైర్మన్‌తో తెలంగాణ మంత్రుల భేటీ



ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఎఫ్)2026 సందర్భంగా తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డితో కలిసి గోద్రేజ్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ నాదిర్ గోద్రేజ్ సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఆయిల్‌పామ్ వ్యవసాయంలో కృత్రిమ మేధస్సు (ఎఐ) వినియోగం, హైదరాబాద్‌లో ఉన్న గోద్రేజ్ క్రీమ్లైన్ డెయిరీ ప్లాంట్‌ను రూ.150 కోట్ల పెట్టుబడితో విస్తరించే అవకాశాలపై చర్చించారు. భారత్ ఫ్యూచర్ సిటీ నివాస ప్రాంతంలో భారీ గృహ నిర్మాణాల ప్రాజెక్టులు చేపట్టే అంశంపై మాట్లాడారు. ఫ్యూచర్ సిటీలో మౌలిక వసతులు (స్కూళ్లు, ఆసుపత్రులు, కమ్యూనిటీ సౌకర్యాలు) ఏర్పాటు చేయడం ప్రభుత్వానికి, సంస్థకూ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలంగాణ ప్రతినిధులు పేర్కొన్నారు. నాదిర్ గోద్రేజ్‌ను హైదరాబాద్‌కు రావాలని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానించారు.

## బిసి సెంట్రిక్‌గా ప్రజా ప్రభుత్వం పాలన

### టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణలో బిసి సెంట్రిక్‌గా ప్రజా ప్రభుత్వం పాలన నడుస్తుందని టిపిసిసి అధ్యక్షులు, ఎంఎల్‌సి మహేష్‌కుమార్‌గౌడ్ తెలిపారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఓబిసి డిపార్ట్‌మెంట్ ఛైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో గురువారం గాంధీభవన్‌లో నిర్వహించిన స్టేట్ ఎక్స్టెండెడ్ ఎగ్జిక్యూటివ్ సమావేశానికి మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్ఎన్ఆర్ఇజిఎ బచావో ఆందోళన్ కార్యక్రమంలో భాగంగా ఈ సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓబిసి విభాగం రాష్ట్ర నేతలు, జిల్లా ప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం అనంతరం కుల సర్వే నిర్వహించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని చెప్పారు. అదే విధంగా రాహుల్ గాంధీ ఆకాంక్ష మేరకు సిఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో చేసిన కుల సర్వే చరిత్రాత్మకమని కొనియాడారు. ఈ సర్వే ద్వారా బిసిలు 56 శాతం ఉన్నారని అఫిషియల్ డాక్యుమెంట్ ఇచ్చామని చెప్పారు. బిసిలపై ఉన్న చిత్త శుద్ధితో రెండు చట్టాలను తీసుకొచ్చామని, మూడు బిల్లులు గవర్నర్ దగ్గర పెండింగ్ లో ఉన్నాయన్నారు. 2029 జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని, రాహుల్ గాంధీ ప్రధాని కావడం తథ్యమని ఆశాభావం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ హయంలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల చట్ట బద్దత తెచ్చుకుంటామని పేర్కొన్నారు. నామినేటేడ్ పదవుల్లో బిసిలకు ప్రాధాన్యత కల్పిస్తున్నామని, సిపిఐ బిసి నేతకి ఎంఎల్‌సి స్థానం ఇవ్వడం, 25 ఏళ్లు పార్టీ కోసం కష్టపడిన శంకర్ నాయక్ కి, అద్దంకి దయాకర్ కి ఎంఎల్‌సిలుగా ప్రమోషన్ కల్పించామన్నారు. పిసిసి కార్యవర్గంలో కూడా 50 శాతం బిసిలకు ప్రాధాన్యత కల్పించామని, ఉపాధ్యక్షులు 68 శాతం ,జనరల్ సెక్రటరీల్లో 70 శాతం, అన్నిటికి మించి డిసిసిలో 17 జిల్లాలకు బిసిలను నియమించామని చెప్పుకొచ్చారు. చరిత్రలో కని విని ఎరుగని రీతిలో బిసిలకు పదవులు దక్కుతున్నాయని, మున్సిపల్ ఎన్నికల దృష్ట్యా డైరెక్టర్ పదవుల భర్తీ పెండింగ్‌లో పడ్డాయని తెలిపారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బిసిలు అత్యధిక స్థానాలు గెలిచి, సత్తా చాటాలని మహేష్‌కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు.

**వికలాంగుల హక్కుల పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంది**

వికలాంగుల హక్కుల పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని టిపిసిసి అధ్యక్షులు, ఎంఎల్‌సి మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ వికలాంగుల విభాగంలో సభ్యత్వ నమోదు ప్రక్రియను మరింత సులభతరం చేసేలా రూపొందించిన సభ్యత్వ నమోదు యాప్‌ను గాంధీభవన్‌లో గురువారం మహేష్‌కుమార్‌గౌడ్ అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగుల రాజకీయ భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఆధునిక సాంకేతికతను ఉపయోగించి వికలాంగుల విభాగాన్ని మరింత బలపరిచే దిశగా ఇది కీలక ముందడుగుగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల విభాగం కార్పొరేషన్ ఛైర్మన్ ముత్తినేని వీరయ్య, కాంగ్రెస్ పార్టీ వికలాంగుల విభాగం నాయకులు, పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## కంటోన్మెంట్ భూములపై న్యాయ విచారణకు జెసిపి డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్: సికింద్రాబాధ్ కంటోన్‌మెంట్ భూముల యాజమాన్యం, ఓల్డ్ గ్రాంట్ వాదనల చెల్లుబాటుపై హైకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని జనతా కాంగ్రెస్ పార్టీ (జెసిపి) రాష్ట్ర అధ్యక్షులు బి.సర్వేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ గడ్డం అబెల్ డిమాండ్ చేశారు. విచారణ పూర్తయ్యేవరకు తొలగింపులు, కూల్చివేతలు, బలవంతపు చర్యలపై యథాతథ స్థితి (స్టేటస్ కో) కొనసాగించాలని కోరారు. హైదరాబాద్‌లో గురువారం జరిగిన మీడియా సమావేశంలో జెసిపి తెలంగాణ, ఎపి ఇన్‌చార్జి దీపక్ శర్మ, నేతలు విశాల్ చైతన్య, మన్సూర్ అలీ, రవీందర్ నాయుడుతో కలిసి వారు మాట్లాడారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, భూ మాఫియా, కొందరు అధికారులు, రాజకీయ నేతల ప్రమేయంతో కంటోన్మెంట్ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని సర్వేందర్ ఆందోళన వ్యక్తంచేశారు. కంటోన్మెంట్ భూ సమస్యలను రాజ్యాంబద్ధంగా, పారదర్శకంగా పరిష్కరించాలని కోరారు. కంటోన్మెంట్ భూములపై కేంద్రప్రభుత్వానికి చట్టబద్ధమైన యాజమాన్య హక్కు లేదన్నారు. బ్రిటిష్ రాచరికం తదనంతరం కేంద్ర ప్రభుత్వం కంటోన్మెంట్ భూమిని స్వాధీనం చేసుకోవడం, అమ్మకం లేదా చట్టబద్ధంగా బదిలీ చేయడం జరగలేదని స్పష్టం చేశారు.

## పెట్టుబడులు, ఉద్యోగాలపై శ్వేతపత్రం విడుదల చేయాలి

### బిజెపి అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు

ప్రజాపక్షం/హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దావోస్ పర్యటనల ద్వారా వచ్చిన పెట్టుబడులు, కల్పించిన ఉద్యోగాలపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అన్నారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో గురువారం రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు రాంచందర్ రావు అధ్యక్షతన పదాధికారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి, నైనీ కోల్ టెండర్ల అక్రమాలపై సిబిఐ విచారణకు కేంద్రం సిద్ధంగా ఉందని, రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని కోరారు. రాబోయే మున్సిపల్ ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఐదు భారీ బహిరంగ సభలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

### సింగరేణి టెండర్లపై సిబిఐ విచారణ జరగలాంటే..

## సిఎం చొరవ తీసుకోవాలి

### కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్ : సింగరేణి అక్రమ టెండర్‌లపై సిబిఐ దర్యాప్తు జరగాలంటే రాష్ట్ర ముఖ్యమంత్రే చొరవ తీసుకోవాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో సిబిఐ అనుమతిని రద్దు చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వేలం నిర్వహించలేకపోతే, ఆ బాధ్యత తను కేంద్రానికి అప్పగిస్తే పారదర్శకంగా ఆక్షన్ నిర్వహించి సింగరేణికి కేటాయించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. సింగరేణి సంస్థ మనుగడను ప్రశ్నార్థకం చేస్తూ, రాజకీయ ప్రయోజనాల కోసం గత బిఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కలిసి సంస్థను ఆర్థిక విధ్వంసం దిశగా తీసుకెళ్తున్నాయని విమర్శించారు. గత 12 ఏళ్లలో రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ. 47,000 కోట్ల బకాయిలను సింగరేణికి చెల్లించాల్సి ఉందని, కేవలం టిజి జెన్‌కో నుంచే రూ. 32,000 కోట్ల బకాయిలు రావాల్సి ఉందని తెలిపారు. సింగరేణి సిఎస్ఆర్ నిధులను బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమ వ్యక్తిగత విలాసాలకు, స్విమ్మింగ్ పూల్స్, సోఫాల కోసం వాడుకున్నారని ఆరోపించారు. డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ మైనింగ్ ప్రాంతాల అభివృద్ధి కోసం కేటాయించిన రూ. 1,500 కోట్ల నిధులు ఇప్పటికీ జిల్లాలకు చేరలేదని తెలిపారు. 17 కంపెనీలు సైట్ విజిట్ చేసినా, 'ప్రాజెక్ట్ అథారిటీ సర్టిఫికేట్' అనే నిబంధన పెట్టి ఎవరికీ సర్టిఫికేట్లు ఇవ్వకుండా ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.




## సికింద్రాబాద్‌లో పిఎం సంసద్ ఖేల్ మహోత్సవ్

ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రేరణతో దేశవ్యాప్తంగా క్రీడా సంస్కృతిని పెంపొందించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న పిఎం సంసద్ ఖేల్ మహోత్సవ్ 2025–26 ప్రారంభోత్సవ కార్యక్రమం సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఎల్.బి. స్టేడియంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్, క్రీడాకారిణి సైనా నెహ్వాల్, భారతీయ మహిళా క్రికెటర్లు దయానా దేవిడ్ దృష్టి కేసరి తదితరులు హాజరయ్యారు. రాబోయే 15 రోజుల పాటు 30 గ్రౌండ్స్‌లో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, అథ్లెటిక్స్ వంటి పోటీలు జరుగుతాయి. సుమారు 35 వేల మంది క్రీడాకారులు నమోదు చేసుకున్నారు.

బస్తీ మహిళల కోసం మ్యూజికల్ చైర్స్, మీడియా ప్రతినిధులకు, దివ్యాంగులకు ప్రత్యేక పోటీలను ఏర్పాటు చేశారు. యువతను డ్రగ్స్ వంటి వ్యసనాల నుండి దూరంగా ఉంచి, క్రీడల వైపు మళ్లించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తెలిపారు.

## అన్ని జిల్లా కేంద్రాల్లో నర్సరీ మేళాలు

### పచ్చదనాన్ని మరింత విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావాలి : మంత్రి తుమ్మల



ప్రజాపక్షం/హైదరాబాద్: పచ్చదనాన్ని మరింత విస్తృతంగా అందుబాటులోనికి తీసుకొచ్చేందుకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో నర్సరీ మేళాలను ప్రోత్సహించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పండే ప్రతీ పంటను పండించేందుకు రాష్ట్రంలో అనుకూలమైన వాతావరణం ఉందన్నారు. హైదరాబాద్, ఎన్‌టిఆర్ మార్గ్‌లోని ఐమ్యాక్స్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన '19వ గ్రాండ్ నర్సరీ మేళా'ను మంత్రి తుమ్మల గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని రకాల పండ్ల చెట్లు, పూలచెట్లతో పాటు రైతులు లాభం వచ్చే పంటలను పండించాలన్నారు. నర్సరీలకు ప్రత్యేక ప్రోత్సాహం ఇచ్చి హైదరాబాద్‌తో పాటు పట్టణ వాసులందరికీ అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అకడమియా, ఆర్గానెట్ తదితర అన్ని రకాల పండ్ల చెట్లు, పూలచెట్లతో పాటు రైతులకు లాభం వచ్చే పంటలను రైతులు పండించుకునే ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఇలాంటి నర్సరీలు రైతాంగానికి, పట్టణ వాసులకు ఉపయోగపడాలన్నారు. ప్రతీ ఏటా పెద్ద ఎత్తున గ్రాండ్ నర్సరీ మేళాను నిర్వహించేందుకు ప్రోత్సహించడం, అలాగే పండ్లు, పూలమొక్కలు, కూర గాయల మొక్కల నర్సరీలను ప్రోత్సాహించేందుకు హార్టీకల్చర్ డిపార్ట్‌మెంట్ కృషి చేస్తుందన్నారు. హార్టీకల్చర్ డైరెక్టర్ యాస్మిన్ భాషా మాట్లాడుతూ నర్సరీమేళాలో భారతదేశంలోని అన్ని పూలమొక్కలను అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులకు, పట్టణ ప్రాంతంలో గార్డెనింగ్‌కు అవసరమైన పాట్స్ పాటింగ్ మెటీరియల్ ఇలా అన్ని వసతులకు వన్ స్టాప్ సొల్యూషన్‌గా మేళాలో అందుబాటులో ఉన్నాయని వివరించారు. బోన్సాయ్ గార్డెన్‌కు సంబంధించి అర్నమెంటల్ మెటీరియల్ , డెకరేషన్ మెటీరియల్ ప్రదర్శిస్తున్నారని. మేళా ఇంచార్జీ ఖాలీద్ అహ్మద్ మాట్లాడుతూ నర్సరీ మేళ ప్రదర్శన ఉదయం 9గంటల నుంచి రాత్రి 9గంటలకు వరకు అందుబాటులో ఉంటుందన్నారు.

### ఓయు ప్రొఫెసర్ మనోహర్‌ను

## తక్షణమే విధుల్లోకి తీసుకోవాలి

### జాజుల శ్రీనివాస్ గౌడ్

ప్రజాపక్షం/హైదరాబాద్: ఉస్మానియా విశ్వవిద్యాలయంలో అధ్యాపకులుగా పని చేస్తున్న బిసి సామాజిక వర్గానికి చెందిన ప్రొఫెసర్ మనోహర్‌ను అకారణంగా యూనివర్సిటీ యజమాన్యం సస్పెండ్ చేయడం చాలా అన్యాయమని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ ( క్యాష్) అమలులో ప్రమోషన్ పొందని యూనివర్సిటీ అధ్యాపకుల తరపున ఉస్మానియా యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (ఔటా) గత యాభై రోజులుగా ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలియజేస్తున్న వారికి నాయకత్వం వహిస్తున్న ఆచార్య మనోహర్‌ను సస్పెన్షన్ చేయడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. ప్రశ్నించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఉపాధ్యాయుల సమస్యలను వైస్ చాన్సలర్, రిజిస్ట్రార్‌ల దృష్టికి తీసుకుపోయే బాధ్యత ఔటకు ఉందని, ఇవేమీ పరిగణలోకి తీసుకోకుండా, సమస్యలను పరిష్కరిం చకుండా సస్పెండ్ చేయడమే పరిష్కారం అనుకోవడం యజమాన్యానికి తగదన్నారు.

### నీటి సంరక్షణ, సామర్థ్య వృద్ధి లక్ష్యంగా

## ప్రత్యేక శిక్షణలు దేశానికి ఎంతో అవసరం




### ఇఎస్‌సిఐ డాక్టర్ జి. రమేశ్వర్‌రావు

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఇండియన్ వాటర్ వర్క్స్ అసోసియేషన్ (ఐడబ్ల్యుడబ్ల్యుఎ) ఆధ్వర్యంలో 58వ వార్షిక మహాసభను ఈనెల 22 నుంచి 24 వరకు ఛత్రపతి సంభాజీ నగర్ (ఔరంగాబాద్)లోని మరాత్వాడా ఇనిస్టూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటి) క్యాంపస్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ మూడు రోజుల జాతీయ స్థాయి మహాసభను ఐడబ్ల్యుడబ్ల్యుఎ ముంబై సెంటర్, ఎంఐటి. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మరాత్వాడా విశ్వవిద్యాలయం సంయుక్తంగా నిర్వహించాయి. ఈ మహాసభలో నీటి పునర్వినియోగం, సస్టెయినబిలిటీ, సమకాలీన నీటి సవాళ్లపై దేశవ్యాప్తంగా నిపుణులు, ఇంజనీర్లు, విద్యావేత్తలు, విధాన నిర్ణయకులు విస్తృతంగా చర్చించారు. ఈ మహాసభలో ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా తరఫున డైరెక్టర్ డాక్టర్ జి. రమేశ్వర్ రావు పాల్గొని, ఈఎస్‌సిఐ వాటర్ రిసోర్సెస్ డెవలప్మెంట్ (డబ్ల్యుఆర్‌డి) విభాగం ద్వారా చేపడుతున్న శిక్షణా కార్యక్రమాలను వివరించారు. నీటి సంరక్షణ, సామర్థ్య వృద్ధి లక్ష్యంగా నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణలు దేశానికి ఎంతగానో అవసరమని ఆయన తెలిపారు.

**నీటి వనరుల అభివృద్ధిపై ఈఎస్‌సిపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు..**

ఈఎస్‌సిఐ – వాటర్ రిసోర్సెస్ డెవలప్‌మెంట్ విభాగం ద్వారా దేశవ్యాప్తంగా ఇంజినీర్లు, అధికారుల కోసం పలు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు డాక్టర్ జి. రమేశ్వర్ రావు తెలిపారు. ప్రస్తుతం ఈఎస్‌సిఐ క్రింది అంశాలపై శిక్షణలను చురుకుగా నిర్వహిస్తోందన్నారు. భూగర్భ జల రీచార్జ్ పద్ధతులు, లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల ప్రణాళిక, రూపకల్పన, నిర్మాణం, డ్యామ్ గేట్ల భద్రత, హైడ్రాలిక్ గేట్ల రూపకల్పన, స్థాపన, నిర్వహణ, మైక్రోఇరిగేషన్ వ్యవస్థల్లో ఆటోమేషన్, డ్యామ్ సేఫ్టీ మార్గదర్శకాలపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమాలకు దేశవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో ఇంజనీర్లు, అధికారులు హాజరవుతున్నారని తెలిపారు.




## హైదరాబాద్‌లో కీర్తిలాల్స్ 'సిగ్నేచర్ లాంజ్' ప్రారంభం

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఆభరణాల రంగంలో భారతదేశంలో అత్యంత విశ్వసనీయమైన బ్రాండ్‌గా గుర్తింపు పొందిన కీర్తిలాల్స్, హైదరాబాద్‌లోని సోమాజిగూడ షోరూమ్‌లో తన సిగ్నేచర్ లాంజ్‌ను ప్రారంభించింది. ఈ లాంజ్‌లో ప్రత్యేకంగా రూపొందించిన సింగిల్ ఎడిషన్ డైమండ జ్యువెల్లరీని ప్రదర్శించనున్నట్లు కీర్తిలాల్స్ స్టోర్ మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సిగ్నేచర్ లాంజ్‌ను అధిక శ్రేణి, వ్యక్తిగతమైన, విలాసవంతమైన వాతావరణాన్ని అందించేలా రూపొందించామని ఆయన చెప్పారు. ఇక్కడ ప్రదర్శించే ప్రతి ఆభరణం ఒక్కసారే తయారవుతుందని, అవి తిరిగి పునరావృతం కాబోవని స్పష్టం చేశారు. అరుదైన శిల్పకళ, నాజూకైన వివరాలు, ప్రత్యేక వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించేలా ఈ ఆభరణాలు రూపొందించినట్లు తెలిపారు. కీర్తిలాల్స్ అంతర్గత కళాత్మక దృష్టి, నైపుణ్యమైన తయారీ వారసత్వాన్ని ప్రతిబింబించేలా ఈ సింగిల్ ఎడిషన్ కలెక్షన్ రూపొందించిందన్నారు. ఆధునిక రూపకల్పన పద్ధతులు, ఖచ్చితమైన ఇంజనీరింగ్, ప్రపంచ స్థాయి హస్తకళతో ఈ ప్రత్యేక ఆభరణాలు రూపొందిస్తూ, ప్రతి డిజైన్‌కు ప్రత్యేక గుర్తింపును అందిస్తాయన్నారు. అద్భుతమైన రత్నాలు, కాలాతీత చక్కదనం, సొగసైన డిజైన్‌ను ఆదరించే అభిజ్ఞుల కోసం ఈ కలెక్షన్‌ను ప్రత్యేకంగా రూపొందించామన్నారు. విలక్షణమైన, అరుదైన ఆభరణాలను కోరుకునే వారికి సోమాజిగూడలోని కీర్తిలాల్స్ సిగ్నేచర్ లాంజ్ ఒక ప్రత్యేక గమ్యస్థానంగా నిలుస్తోందన్నారు. సోమాజిగూడ సర్కిల్లో ఉన్న ఈ సిగ్నేచర్ లాంజ్‌లో కీర్తిలాల్స్ సింగిల్ ఎడిషన్ ఆభరణాల సేకరణను ప్రత్యేక అనుభూతిగా ఆస్వాదించే అవకాశం అందుబాటులో ఉందన్నారు.

### అదుపుతప్పి లోయలో పడిన ఆర్మీ వాహనం

# పది మంది సైనికులు మృతి



#### మరో ఏడుగురు జవాన్లకు గాయాలు

**భదేర్వా/జమ్ము:** జమ్ముకశ్మీర్‌లోని దోడా జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఆర్మీ ట్రక్కు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న లోయలో పడిపోయింది. ఈ ఘటనలో 10 మంది సైనికులు మృతి చెందారు. మరో ఏడుగురు గాయపడ్డారని అధికారులు తెలిపారు. ప్రమాద సమయంలో వాహనంలో 17 మంది సైనికులు ఉన్నారు. భదేర్వా–చంబా అంతర్రాష్ట్ర రహదారిలోని 9000 అడుగుల ఎత్తయిన ఖన్నీ టాప్ వద్ద గురువారం మధ్యాహ్నం సమయంలో ఈ ప్రమాదం జరిగింది. బుల్లెట్ ప్రూఫ్ ఆర్మీ వాహనం అధిక ఎత్తులో ఉన్న పోస్ట్ వైపు వెళ్తుండగా వాహనంపై డ్రైవర్ నియంత్రణ కోల్పోయాడు. దీంతో ఆర్మీ వాహనం అదుపుతప్పి 200 అడుగుల లోతు గల లోయలోకి పడిపోయింది. ఘటనాస్థలిలోని నలుగురు సైనికులు చనిపోయారు. సైన్యం, పోలీసులు సంయుక్తంగా చేపట్టిన సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదంలో గాయపడిన 11 మందిని రక్షించినట్లు అధికారులు తెలిపారు. ఆర్మీ వాహనం ఎత్తయిన ప్రదేశం నుంచి లోయలో పడడంతో తీవ్రంగా నుజ్జునుజ్జు అయింది. ఆ తరువాత క్షతగాత్రుల్లో మరో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. గాయపడిన సైనికులను ప్రత్యేక చికిత్స కోసం ఉధంపూర్ కమాండ్ ఆసుపత్రికి హెలికాప్టర్ ద్వారా తరలించారు. 'సైనిక వాహనానికి దురదృష్టవశాత్తూ జరిగిన ప్రమాదంలో మేము 10 మంది సైనికులను కోల్పోయాము. మరో ఏడుగురు మంది గాయపడ్డారు' అని భదేర్వా అదనపు డిప్యూటీ కమిషనర్ సుమిత్ కుమార్ భూత్యాల్ పిటిఐకి తెలిపారు. లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ప్రమాదంపై విచారం వ్యక్తం చేశారు. ప్రాణాలు కోల్పోయిన సైనికుల కుటుంబాలకు ముఖ్యమంత్రి హృదయపూర్వక సంతాపం తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

### 'నేడు' వివాదాస్పద భోజ్‌శాల-కమల్ మౌలా మసీదు వద్ద ...

# హిందువులు, ముస్లిముల ప్రార్థనలకు 'సుప్రీం'ఓకె

#### ముస్లిముల కోసం ఒక ప్రత్యేక స్థలాన్ని అందుబాటులో ఉంచాలని అధికారులకు ఆదేశం

#### శాంతిభద్రతల నిర్వహణ కోసం సహకరించాలని ఇరుపక్షాలకూ విజ్ఞప్తి



**న్యూఢిల్లీ :** మధ్యప్రదేశ్ రాష్ట్రం ధార్ జిల్లాలోని వివాదాస్పద భోజ్‌శాలకమల్ మౌలా మసీదులో శుక్రవారం వసంత పంచమి సందర్భంగా ప్రార్థనలు చేసుకోవడానికి హిందువులు, ముస్లిములకు అత్యున్నత న్యాయస్థానం అనుమతి ఇచ్చింది. హిందువులకు సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకు, ముస్లిములకు మధ్యాహ్నం ఒంటిగంట నుండి సాయంత్రం 3 గంటల వరకు నమాజ్ చేసుకునేందుకు అనుమతినిచ్చింది. గురువారంనాడు సుప్రీంకోర్టు ముస్లిం సమాజం నుండి నమాజ్ కోసం వచ్చే వ్యక్తుల జాబితాను జిల్లా పరిపాలనా యంత్రాంగానికి అందజేయాలని ఆదేశించింది. జనవరి 23న భోజ్‌శాల కాంప్లెక్స్‌లో మతపరమైన కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు హిందూ, ముస్లిం సంఘాలు అనుమతి కోరాయి. శుక్రవారం వసంత పంచమి సందర్భంగా సరస్వతీ పూజ కూడా జరుగనున్నది. భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం.పంచోలితో కూడిన త్రిసభ్య ధర్మాసనం మాట్లాడుతూ 'పరస్పర గౌరవాన్ని పాటించడానికి, శాంతిభద్రతల నిర్వహణ కోసం రాష్ట్ర, జిల్లా పరిపాలనా యంత్రాగానికి సహకరించాలని ఇరుపక్షాలకు విజ్ఞప్తి చేసింది. శుక్రవారం మధ్యాహ్నం ఒంటిగంట నుండి మూడు గంటల మధ్య ముస్లిం సమాజానికి చెందిన ఎందరు వ్యక్తులు నమాజ్ కోసం వస్తారో తెలుసుకున్న తర్వాత అదే కాంపౌండ్ /ఆవరణలో ఒక ప్రత్యేక స్థలం అందుబాటులో ఉంచాలని, తద్వారా నిర్ణీత సమయంలో నమాజ్ నిర్వహించవచ్చని ఎఎస్‌జి, అడ్వకేట్ జనరల్ ఒక సముచితమైన సూచన చేశారు. అదేవిధంగా గత ఆచారం ప్రకారం వసంత పంచమి పండుగను పురస్కరించుకుని సాంప్రదాయ వేడుకను నిర్వహించడానికి హిందూ సమాజానికి ప్రత్యేకమైన స్థలం అందుబాటులో ఉంచబడుతుంది' అని సిజెఐ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం తెలిపింది. ఆ స్థలంలో ప్రార్థనలు నిర్వహించడానికి చట్టంచేసి, ఏర్పాట్లు చేయాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది. జిల్లా యంత్రాంగం శాంతిభద్రతల పరిరక్షణ కోసం సందర్శకులకు ఉచితంగా తగిన పాసులు జరీ చేయవచ్చు...లేదా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ఆచారాలు శాంతియుతంగా నిర్వహించబడతాయని నిర్ధారించుకోవడానికి ఏవైనా ఇతర న్యాయపరమైన చర్యలు తీసుకోవచ్చని ధర్మాసనం తెలియజేసింది. 11వ శతాబ్దపు ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఎఎస్‌ఐ) రక్షిత స్మారక చిహ్నం అయిన భోజ్‌శాలను హిందువులు వాగ్దేవి (సరస్వతీ దేవత)కు అంకితం చేయబడిన ఆలయంగా భావిస్తారు. అయితే ముస్లిం సమాజం దీనిని కమల్ మౌలా మసీదు అని పిలుస్తుంది. 2003 ఏప్రిల్ 7న ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఏర్పాటు ప్రకారం హిందువులు మంగళవారం భోజ్‌శాల ప్రాంగణంలో పూజలు నిర్వహిస్తారు. శుక్రవారం ముస్లిములు కాంప్లెక్స్‌లో నమాజ్ చేస్తారు. వసంత పంచమి నాడు హిందువులు ప్రార్థనలు చేయడానికి ప్రత్యేక హక్కులను కోరుతూ 'హిందూ ఫ్రంట్ ఫర్ జస్టిస్' దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారించింది. న్యాయవాది విష్ణు శంకర్ జైన్ ద్వారా దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం అత్యవసర విచారణ కోసం ప్రస్తావించడం జరిగింది. ఆర్కియలాజికల్ సర్వేఫ్ ఇండియా 2003 ఉత్తర్వు శుక్రవారం ప్రార్థనలతో వసంత పంచమి నాడు కలిసి వచ్చే పరిస్థితిని ప్రస్తావించలేదని, వసంత పంచమి రోజు మొత్తం హిందువులకు ప్రత్యేకమైన, నిరంతరాయమైన ఆరాధన హక్కులను కోరిందని జైన్ అన్నారు. విచారణ సందర్భంగా జైన్ తన వాదనలు వినిపిస్తూ సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకూ పూజలు, హవనాలు ఉంటాయని ధర్మాసనానికి తెలియజేశారు. రోజంతా పూజకు అనుమతిని కోరారు. మసీదు కమిటీ తరపున సీనియర్ అడ్వకేట్ సల్మాన్ ఖుర్షీద్ తన వాదనలు వినిపిస్తూ శుక్రవారం నమాజ్ మధ్యాహ్నం ఒంటిగంట నుండి 3 గంటల మధ్య జరుగుతుందని, ఆ తర్వాత ఆ ప్రాంగణాన్ని ఖాళీ చేయవచ్చని చెప్పారు. ఈ ప్రతిపాదనను అంగీకరిస్తూ ఖుర్షీద్ ముస్లిం కమిటీకి సంబంధించి నమాజ్ కోసం వచ్చే వ్యక్తులు ఎంత మంది హాజరుకానున్నారనే సంఖ్యను జిల్లా మెజిస్ట్రేట్‌కు అందజేస్తామని తెలిపారు. కేంద్రం, ఎఎస్‌ఐ తరపున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ కె.ఎం.నటరాజ్ జిల్లా అధికారయంత్రాంగం శాంతిభద్రతల పరిరక్షణ గురించి తప్పక జాగ్రత్త చర్యలు చేపడుతుందని చెప్పారు. 2024 మార్చి 11నాటి మధ్యప్రదేశ్ హైకోర్టు 'శాస్త్రీయ సర్వేపై' ఇచ్చిన ఆదేశాలను సవాల్‌చేస్తూ మౌలానా కమాలుద్దీన్ సంక్షేమ సమాజం దాఖలు చేసిన అప్పీల్‌ను కూడా అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఈ విషయాన్ని హైకోర్టులోని అత్యంత సీనియర్ న్యాయమూర్తి నేతృత్వంలోని డివిజన్ బెంచ్ విచారించాలని సుప్రీంకోర్టు హైకోర్టుకు సూచించింది. ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా శాస్త్రీయ సర్వేను పూర్తి చేసి తన నివేదికను ఒక సీల్డ్ కవర్‌లో హైకోర్టుకు అందజేసిందని గమనించిన సుప్రీంకోర్టు ఆ నివేదికను సీల్‌చేసి, దానిపై అభ్యంతరాలు దాఖలు చేయగల పార్టీలకు అందించాలని హైకోర్టును ఆదేశించింది.

### ఎర్రకోటపై దాడి కేసులో ఎల్‌ఇటి ఉగ్రవాది ఆరిఫ్ పిటిషన్‌పై...

# ఢిల్లీ ప్రభుత్వానికి 'సుప్రీం' నోటీసు

#### మరణశిక్షను సవాల్‌చేస్తూ ఆరిఫ్ దాఖలుచేసిన క్యురేటివ్ పిటిషన్ విచారణకు 'అపెక్స్ కోర్టు' అంగీకారం

#### 2000 సంవత్సరంలో జరిగిన ఈ దాడిలో ముగ్గురు ఆర్మీ జవాన్లు మృతి

**న్యూఢిల్లీ:** ఎర్రకోటపై 2000 సంవత్సరంలో జరిగిన దాడి కేసులో ముగ్గురు ఆర్మీ జవాన్ల మృతికి కారణమైన లష్కర్‌ఏతోయిబా (ఎల్‌ఇటి) ఉగ్రవాది మొహమ్మద్ ఆరిఫ్‌కు విధించిన మరణశిక్షకు వ్యతిరేకంగా దాఖలు చేసిన క్యురేటివ్ (నివారణ) పిటిషన్‌ను విచారించడానికి గురువారం సుప్రీంకోర్టు అంగీకరించింది.ఈ కేసులో ఆరిఫ్ దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌ను 2022 నవంబరు 3న సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఆరిఫ్ అలియాస్ అష్ఫాక్‌కు ట్రయల్ కోర్టు 2005 అక్టోబరులో మరణశిక్ష విధించింది. ఢిల్లీ హైకోర్టు 2007 సెప్టెంబరులో ట్రయల్ కోర్టు అభిప్రాయాన్ని సమర్థించింది. అనంతరం అతను హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. 2011 ఆగస్టులో సుప్రీంకోర్టు ఆరిఫ్‌కు విధించిన మరణశిక్షను ధృవీకరించింది. గురువారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ జె.కె.మహేశ్వరిలతో కూడిన ప్రత్యేక ధర్మాసనం మరణశిక్షను సమర్థించిన తర్వాత అప్పీల్, రివ్యూ పిటిషన్‌ను కొట్టివేసిన అనంతరం సుప్రీంకోర్టు తీర్పులను ఉదహరించిన న్యాయవాది సమర్పణలను ప్రధాన నాయమూర్తి గమనించారు. 'నోటీసు జారీచేయండి' అని సిజెఐ సూర్యకాంత్ చెప్పారు. ఈ తీర్పును సవాల్ చేయడానికి ఒక వ్యక్తికి ఉన్న చివరి చట్టపరమైన మార్గం క్యురేటివ్ పిటిషన్ అని తాజాగా ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ తీర్పును సుప్రీంకోర్టు రెండు సార్లు సమర్థించింది.



ఈ అప్పీల్, రివ్యూ పిటిషన్లను కొట్టివేసింది. ప్రాసిక్యూషన్ ప్రకారం 2000 సంవత్సరం డిసెంబరు రాత్రి కొందరు చొరబాటుదారులు ఎర్రకోట లోపల భారత సైన్యం యొక్క 7 రాజ్‌పుతన రైఫిల్స్ యూనిట్ ఉన్న ప్రాంతంలోకి చొరబడి కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ముగ్గురు ఆర్మీ జవాన్లు మృతిచెందారు.

# విజయ్, కమల్ పార్టీలకు గుర్తుల కేటాయింపు

**చెన్నై :** తమిళగ వెట్రి కజగం (టివికె) అధినేత, దళపతి విజయ్, మక్కల్ నీది మయ్యం అధినేత కమల్ హాసన్ పార్టీలకు కేంద్ర ఎన్నికల సంఘం అధికారికంగా గుర్తులను కేటాయించింది. విజయ్ పార్టీకి 'విజిల్' గుర్తును కేటాయించగా, కమల్ హాసన్ పార్టీకి 'బ్యాటరీ టార్చ్' గుర్తును ఖరారు చేసింది. ఈ నేపథ్యంలో తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఇద్దరు అగ్ర కథానాయకులు ఇప్పుడు రాజకీయ వేదికపై తమ అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఈ మేరకు గురువారం తమిళనాడు చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్‌కు ఆదేశాలు జారీ చేసింది. రిజిస్టర్డ్ గుర్తింపు లేని రాజకీయ పార్టీల జాబితా కింద ఈ గుర్తులను కేటాయించారు. ఎలక్షన్ సింబల్స్ ఆర్డర్, 1968లోని పారా 10బి నిబంధనల ప్రకారం ఈ పార్టీలకు ఇసి గుర్తులను కేటాయించింది. రాబోయే తమిళనాడు, బంగాల్, కేరళ, అసోం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో (2025–26) ఈ పార్టీలు ఈ గుర్తులపై పోటీ చేస్తాయి. తమ అభ్యర్థులకు కామన్ సింబల్ కేటాయించాలన్న పార్టీల



విజ్ఞప్తిని ఈసీ ఆమోదించింది. కాగా, ఉత్సాహవంతులైన పార్టీ కార్యకర్తలు రాష్ట్రవ్యాప్తంగా దానిని ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి ప్రయత్నాలు ప్రారంభించారని టివికె సీనియర్ నాయకుడు సిటి ఆర్ నిర్మల్ కుమార్ గురువారం తెలిపారు. పది గుర్తుల జాబితాలో విజయ్ ప్రాధాన్యతగా కోరుకున్న గుర్తు విజిల్ అని తమిళగ వెట్రి కజగం సంయుక్త ప్రధాన కార్యదర్శి కుమార్ అన్నారు. యాదృచ్ఛికంగా, నటుడు విజయ్ అగ్రశ్రేణి హిట్ పాటలలో ఒకటి అతని 2024 చిత్రం 'గోట్' నుండి వచ్చిన 'విజిల్ పోడు' (విజిల్ వేయు), ఇందులో అతని అప్పటి ప్రణాళికలో ఉన్న రాజకీయ ప్రవేశానికి సంబంధించిన కొన్ని ప్రస్తావనలు ఉన్నాయి. అతను 'బిగిల్' అనే చిత్రంలో నటించాడు. దీనికి కూడా విజిల్ అనే అర్థం ఉంది. 'తమిళనాడు ప్రజల మొత్తం ఆకాంక్ష, కోరిక ఏమిటంటే... మా నాయకుడు ముఖ్యమంత్రి కావాలి. మొదటి అడుగుగా తాము కోరుకున్న గుర్తు వచ్చింది' అని కుమార్ చెన్నైలో జరిగిన విలేకరుల సమావేశంలో చెప్పారు. పార్టీని ప్రారంభించిన రెండేళ్ల తర్వాత, 2026 అసెంబ్లీ ఎన్నికలు 50 ఏళ్ల విజయ్ నేతృత్వంలోని టివికె పార్టీకి మొదటి ఎన్నికల పోరాటం అవుతుందని కుమార్ అన్నారు. పార్టీ భారీ విజయం సాధించి విజయ్ ముఖ్యమంత్రి అవుతారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా, అంతకుముందు విజయ్‌తో సమావేశమయ్యారని వార్తలు వచ్చిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ప్రవీణ్ చక్రవర్తి, రాష్ట్రంలో 2026 ఎన్నికల విజిల్ మోగిందని అన్నారు.

# దేశవ్యాప్త బ్యాంకుల సమ్మె




#### యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ వెల్లడి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రభుత్వరంగ బ్యాంకులలో ఐదు రోజుల పని విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 27న దేశవ్యాప్త బ్యాంకుల సమ్మె చేయనున్నట్లు యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యుఎఫ్‌బియు) ప్రకటించింది. హైదరాబాద్‌లో గురువారం జరిగిన మీడియా సమావేశంలో యుఎఫ్‌బియు నేతలు బి.ఎస్.రాంబాబు (ఎఐబిఈఎ), తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ కె.ఆంజనేయ ప్రసాద్ మాట్లాడారు. ప్రభుత్వం 2015లో ప్రతి నెల 2వ, 4వ శనివారాలు సెలవు దినాలు ప్రకటించిందని, తర్వాత, 2023లో శుక్రవారం వరకు పని సమయాన్ని 40 నిమిషాలు పెంచి, మిగిలిన శనివారాలను సెలవుగా ప్రకటించాలని అంగీకరించి, ప్రభుత్వానికి సిఫార్సు కూడా చేశారని, అయినప్పటికీ రెండేళ్లుగా ప్రభుత్వ ఆమోదం పెండింగ్‌లో ఉన్నదని వారు తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ గత ఏడాది ఉద్యోగులు సమ్మెకు పిలుపునివ్వడంతో ప్రభుత్వం తమ హామీలను పరిశీలిస్తుందని ఇచ్చిన హామీ మేరకు సమ్మెను వాయిదా వేశామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, పని సమయాన్ని పెంచి మిగిలిన శనివారాలను సెలవుగా ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. బ్యాంకింగ్ రంగంలో 98 శాతం కంటే ఎక్కువ బ్యాంకింగ్ లావాదేవీలు డిజిటల్ ద్వారానే జరుగుతున్నందున ఖాతాదారులకు ఎలాంటి ఇబ్బందిఉండబోదని స్పష్టం చేశారు. సమావేశంలో బ్యాంకు యూనియన్ల నేతలు శాండిల్య (ఎన్‌సిబిఇ), ఫణికుమార్ (ఎఐబిఒఎ), సతీశ్ (బిఇఎఫ్‌ఐ), అర్జున్ (ఐఎన్‌బిఒసి), సతీశ్‌రెడ్డి, రాజేశ్‌కుమార్, నాగార్జున పాల్గొన్నారు.

### సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో

# కాంగ్రెస్ మాజీ ఎంపి సజ్జన్ కుమార్ నిర్దోషి

#### ఢిల్లీ కోర్టు తీర్పు

**న్యూఢిల్లీ:** సిక్కులకు వ్యతిరేకంగా 1984లో జరిగిన హింసాత్మక అల్లర్లలో నిందితుడుగా ఉన్న కాంగ్రెస్‌పార్టీ మాజీ ఎంపి సజ్జన్ కుమార్ నిర్దోషిగా బయటపడ్డారు. నేరం జరిగిన సమయంలో ఘటనాస్థలంలో ఆయన భౌతికంగా ఉన్నారనడానికి ఎలాంటి సాక్ష్యాధారాలు లేవని న్యూఢిల్లీ కోర్టు తేల్చి చెప్పింది. న్యూఢిల్లీలోని జానక్‌పురి ప్రాంతంలో హింసకు పురిగొల్పారన్న ఆరోపణలపై సజ్జన్ కుమార్ నిందితుడుగా ఉన్నారు. ఈ అల్లర్ల సమయంలో బాధితులు, వారి కుటుంబాలు ఎంత మనోవేదన, బాధ అనుభవించి ఉంటారో న్యాయస్థానం అర్థం చేసుకుందని, కానీ ఆయనను నిర్దోషిగా విడుదల చేస్తూ తీసుకున్న కోర్టు నిర్ణయానికి భావోద్వేగాలతో సంబంధం లేదని ప్రత్యేక న్యాయమూర్తి డిగ్ వియన్ సింగ్ 60 పేజీల తన తీర్పులో పేర్కొన్నారు. కేసులో చాలా మంది సాక్ష్యులను విచారణ చేశామని, కానీ గడచిన 30 సంవత్సరాలుగా సాక్ష్యులు




ఎవ్వరూ నిందితుడి పేరు చెప్పడంలో విఫలమయ్యారని, ప్రస్తుత విషయంలో ఈ సాక్ష్యాలను ఆధారం చేసుకుని మాత్రమే నిందితుణ్ణి నిర్దోషిగా ప్రకటించామని న్యాయమూర్తి తెలియజేశారు. హింసాత్మక అల్లర్లు సంభవించిన సమయంలో కుమార్ ఆ ప్రదేశంలో ఉన్నారనడానికి ఎలాంటి ఆధారాలూ లభించలేదని న్యాయమూర్తి స్పష్టం చేశారు. నిందితుణ్ణి సాక్ష్యులు గుర్తించడం,ఆనవాలు పట్టడంపై ఆధారపడటం చాలా సంశయాత్మకం, అపాయకరం కాగలదని, చివరకు అధిక్షేపణకు గురవుతుందని పేర్కొన్నారు.

# ముంబయి మేయర్ పదవి మహిళకే..

**న్యూఢిల్లీ:** ముంబై: ముంబైకి మహిళా మేయర్ రానున్నారు. మహారాష్ట్రలోని 29 మున్సిపల్ కార్పొరేషన్లకు మేయర్ పోస్టును ఏ కేటగిరీకి కేటాయించాలనే దానిపై లాటరీ ప్రక్రియను పట్టణాభివృద్ధి శాఖ గురువారం నాడు నిర్వహించింది. ఫలితాల్లో బృహన్‌ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ (బిఎంసి) మేయర్ పోస్టు జనరల్ మహిళ కేటగిరీకి రిజర్వ్ అయింది. అయితే బీఎంసీ లాటరీ ప్రక్రియపై ఉద్ధవ్ ఠాక్రే సారథ్యంలోని శివసేన(యుబిటి) తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. బాయ్‌కాట్ చేసింది. లాటరీ నిర్వహించిన పద్ధతిపై శివసేన యుబిటి నేత, ముంబయి మాజీ మేయర్ కిషోర్ ఫడ్నేకర్ తప్పుబట్టారు. గతంలో రెండు దఫాలు కూడా ఈ పోస్టు ఓపెన్ కేటగిరీలోనే ఉందని అన్నారు. బిఎంసిని ఎందుకు ఒబిసి కేటగిరీ కింద పరిగణించలేదని ప్రశ్నించారు. ఎవరికీ ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే రూల్స్ మార్పు నిర్ణయం తీసుకున్నారని అన్నారు. లాటరీ పద్ధతిని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు. ఎక్కడా ఎస్‌టి కేటగిరికి మేయర్ పోస్టు దక్కకపోవడాన్ని కూడా ఆ పార్టీ తప్పుపట్టింది. లాటరీ పద్ధతిలో కల్యాణ్ డోంబివిలి మున్సిపల్ కార్పొరేష్ ఎస్సీలకు కేటాయింపు జరిగింది. థానే మేయర్ పోస్టు ఎస్సీ కేటగిరీ (పురుషుడు)కి రిజర్వ్ అయింది. జల్నా–ఎస్‌సి పురుష, లూతూర్– ఎస్‌సి పురుష, ఇచల్కరంజీ – ఒబిసి పురుష, పాన్వెల్– ఒబిసి పురుష, అకోలా – ఒబిసి పురుష, అహిల్యానగర్– ఒబిసి మహిళ, ఉల్హాస్‌నగర్ – ఒబిసి పురుష, కొల్హాపూర్– ఒబిసి పురుష, చంద్రపూర్– ఒబిసి మహిళ, జలగావ్ – ఒబిసి మహిళకు రిజర్వ్ అయ్యాయి.

# స్టీల్ ప్లాంట్‌లో పేలుడు

# ఆరుగురు కార్మికులు మృతి



#### ఐదుగురికి గాయాలు

**బలోదాబజార్ (ఛత్తీస్‌గఢ్) :** ఛత్తీస్‌గఢ్‌లోని బలోదాబజార్–భటాపారా జిల్లాలో గురువారం ఒక స్టీల్ ప్లాంట్‌లో జరిగిన పేలుడులో కనీసం ఆరుగురు కార్మికులు మరణించగా, మరో ఐదుగురు గాయపడ్డారని అధికారులు తెలిపారు. ఈ సంఘటన భటాపారా గ్రామీణ ప్రాంతంలోని బకులాహి గ్రామంలో ఉన్న రియల్ ఇస్పాత్ అండ్ పవర్ లిమిటెడ్‌లో జరిగిందని జిల్లా కలెక్టర్ దీపక్ సోని పిటిఐకి ఫోన్‌లో తెలిపారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, యూనిట్‌లోని డస్ట్ సెట్లింగ్ ఛాంబర్ (డిఎస్‌సి)లో పేలుడు సంభవించిందని, వేడి ధూళి కార్మికులపై పడటంతో ఆరుగురు కార్మికులు అక్కడికక్కడే మరణించగా, మరో ఐదుగురికి తీవ్రమైన కాలిన గాయాలయ్యాయని ఆయన తెలిపారు. సమాచారం అందిన వెంటనే, పోలీసులు, సీనియర్ పరిపాలనా అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. గాయపడిన ఐదుగురు కార్మికులను బిలాస్‌పూర్‌లోని ఛత్తీస్‌గఢ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (సిఐఎంఎస్)లో చేర్చినట్లు కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి శ్యామ్ బిహారీ జైస్వాల్ కలెక్టర్‌తో మాట్లాడి, గాయపడిన వారికి సాధ్యమైనంత ఉత్తమ చికిత్స అందించాలని ఆదేశించినట్లు తెలిపారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై త్వరితగతిన కఠిన చర్యలు తీసుకోవాలని కూడా ఆయన కలెక్టర్‌ను ఆదేశించినట్లు ఒక అధికారిక ప్రకటన తెలిపింది. ఈ ఘటనపై జైస్వాల్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని, ఈ తీరని నష్టాన్ని భరించే శక్తిని వారి కుటుంబాలకు ప్రసాదించాలని ప్రార్థించారు. ఈ కష్టకాలంలో రాష్ట్ర ప్రభుత్వం బాధిత కుటుంబాలకు అండగా ఉంటుందని, అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

### ట్రంప్ 'శాంతి మండలి' ఆవిర్భావం..

# అనిశ్చితిలో పడిన భద్రతామండలి చెల్లుబాటు

**న్యూయార్క్:** మొదటినుండీ ఐక్యరాజ్యసమితిని చులకనగా చూస్తున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దావోస్‌లో గురువారం 'బోర్డ్ ఆఫ్ పీస్' (శాంతి మండలి) ఏర్పాటు చేయడం ద్వారా మరో తాజా సవాలు విసిరారు. 'బోర్డ్ ఆఫ్ పీస్' ఏర్పాటు చేయడం ద్వారా ఐక్యరాజ్యసమితి భద్రతామండలిని ఆయన పక్కకునెట్టేసే ప్రయత్నం చేశారు. దీంతో ప్రపంచవ్యాప్తంగా శాంతి సాధనకు మధ్యవర్తిత్వం చేసే ఒక ప్రాథమిక శక్తిగా ఉన్న 80 సంవత్సరాల చరిత్రగల భద్రతామండలి చెల్లుబాటు, భవితవ్యం అనిశ్చితిలో పడింది. శాంతి మండలి ఏర్పాటు చేయడంతో భద్రతా మండలి చెల్లుబాటుపై అనేక కొత్త ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ పరిస్థితులమధ్య ఐక్యరాజ్యసమితిని ఆధునీకరించేందుకు సంస్కరణలు చేపట్టాలని ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి ఆంటోనీగుటెర్రెస్ ఇప్పటికే పలుసార్లు ప్రకటించారు. భారత్ సహా పలు సభ్యదేశాలు కూడా సంస్కరణల ఆవశ్యకతను జనరల్ అసెంబ్లీ సమావేశాల్లో అనేకసార్లు ప్రముఖంగా ప్రస్థావిస్తూ వస్తున్నాయి. మరింత హేతుబద్ధంగా 21వ శతాబ్దంలో చెల్లుబాలయ్యేందుకు ఐక్యరాజ్యసమితికి ఆధునిక రూపు ఇవ్వాలని సమితి కోరుతున్న తరుణంలో ట్రంప్ ఆహ్వానించిన కొంతమంది దేశాధిపతులతోనే ఆయన శాంతి బోర్డు ఏర్పాటు చేస్తున్నారు. దాదాపు దశాబ్దకాలంపాటు సంస్కరణలకోసం కృషి చేసిన తర్వాత ట్రంప్ వచ్చి అంతర్జాతీయ సంస్థలకు ఇస్తున్న వందల కోట్ల డాలర్ల నిధులను, మానవతా సహాయం దక్కకుండా చేసేందుకు పూనుకున్నారు. ప్రాణ రక్షణకు అవసరమైన మానవతాయత్నాలు జరగకుండా కత్తెరపెడుతున్నారు. ప్రపంచ సంస్థలను స్వతంత్రంగా విడివిడిగా పనిచేయనీయకుండా ఎక్కువమందికి అందుబాటులో లేకుండా వాటిని ఏకీకృతం చేస్తున్నారు. సిబ్బందిని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయానికి దూరంగా పంపేస్తున్నారు. ట్రంప్, ఆయన మిత్ర దేశాలు ఐక్యరాజ్యసమితి తన పూర్తి శక్తిసామర్థ్యాలు సమకూర్చుకోకుండా సంస్థను విచ్ఛిన్నం చేస్తున్నారు. సమితి ఎందుకూ కొరగాకుండా తయారైందని, ఈ సంస్థలు నిరర్థకంగా ఉన్నాయి, ఊగిసలాట ధోరణితో సంస్థ పనిచేస్తున్నదని వారు ఆరోపిస్తున్నారు. గ్రత ఏడాది ఐక్యరాజ్యసమితికి ఇవ్వాల్సిన బాకీలను కూడా ట్రంప్ చెల్లించడంలేదు. భద్రతా మండలి అంటే ప్రపంచంలో ఎంతో శక్తిమంతమైన సంస్థ. సైనిక చర్యలకు కూడా అధికారం ఉన్న సంస్థ. కానీ ఇటీవలికాలంలో యుద్ధాలను నివారించడంలో సంస్థ విఫలమైంది. గాజా, ఉక్రేన్ లలో యుద్ధాలు కూడా ఈ జాబితాలో ఉన్నాయి. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత అదే ట్రంప్‌కు ఒక అవకాశంగా మారింది. ఈ వారంలో చాలాసార్లు ఆయన సమితి వైఫల్యం గురించి మాట్లాడారు. ''ఐక్యరాజ్య సమితి ఎంతమాత్రం సహాయకారిగా ఉపయోగపడటంలేదు, అది ఎప్పుడూ దాని శక్తిసామర్థ్యాలకు తగినవిధంగా పనిచేయలేదు'' అని ట్రంప్ వైట్‌హౌస్‌లో పాత్రికేయులతో అన్నారు. ఐక్యరాజ్యసమితి పరిష్కరించాల్సిన ప్రతి యుద్ధాన్ని నేను పరిష్కరించాను, నేను ఎప్పుడూ సమితిని ఆశ్రయించలేదు, వెళ్ళాలని అనుకోవడంలేదని ఆయన విమర్శించారు. ఐనాగానీ ఐక్యరాజ్యసమితి ఉండాలి, ఎందుకంటే అది చాలా గొప్ప శక్తిమంతమైన సంస్థ అని కూడా ఆయన అన్నారు. కారం ఇచ్చింది. ప్రపంచ సంఘర్షణలకు ఒక మధ్యవర్తి పాత్రగా దీనిని ట్రంప్ అభివర్ణించారు.

SHRIRAM Finance
వాహనముల బహిరంగ వేలం ప్రకటన

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీన పరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | AP36AT 0111 | Suresh Janne | Verna (Fludic) CRDI SX 1.6 VGT Diesel 5 Seater | 2012 |
| 2 | TG 25 9110 | Suman Dudapaka | Glanza V AT BS6 Petrol 5 Seater | 2024 |
| 3 | TS25E 0812 | Gadham Kumarswamy | Mahindra 475 DI | 2020 |

AUCTION DATE : 24-01-2026
VENUE : SHRIRAM AUTOMAL WARANGAL, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA , WARANGAL
గమనిక : ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయ్యే వరకు వర్తించును
SHRIRAM FINANCE LIMITED
1st Floor, H.No. 6-159, Above DCC Bank, Bhupalpally, Jayashankar Bhupalpally. Cell : 9849981545, 9949340057

# రూపాయి పతనం ఎన్నాళ్లు!

డాలర్‌తో పోలిస్తే, రూపాయి మారకం విలువ పతనం కొనసాగుతునే ఉంది. బుధవారం ఏకంగా 61 పైసలు పతనంతో, చరిత్రలో ఎన్నడూ లేని విధంగా డాలర్ విలువ 91.58 రూపాయలకు చేరింది. ఈ క్షీణత దేశ ఆర్థిక వ్యవస్థలో లోతుగా చోటుచేసుకుంటున్న పరిణామాలకు, సామాన్య ప్రజల జీవనంపై పడుతున్న భారానికి సూచిక. రూపాయి విలువ తగ్గడాన్ని మార్కెట్ సహజ పరిణామంగా, గ్లోబల్ పరిస్థితుల ప్రభావంగా పేర్కొంటూ, కేంద్ర ప్రభుత్వం, బ్యాంకింగ్ వ్యవస్థలు తేలిగ్గా తీసుకునే ప్రయత్నం పలాయన వాదానికి తార్కాణం. రూపాయి మారకం విలువ పతనం నిరంతరంగా కొనసాగుతున్నప్పుడు, దాని ప్రభావాలు ప్రజల నిత్యజీవితంలో స్పష్టంగా కనిపించటం మొదలైనప్పుడు, ఇది ముమ్మాటికీ, ప్రభుత్వానికి, పాలకులకు, విధాన రూపకర్తలకు హెచ్చరికే. అభివృద్ధి కేవలం గణాంకాల్లో, నివేదికల్లో, అంతర్జాతీయ వేదికలపై చేసే ప్రకటనల్లో మాత్రమే కనిపిస్తే సరిపోదు. అది ప్రజల జీవన ప్రమాణాల్లో, వారి కొనుగోలు శక్తిలో, వారి భద్రతాభావంలో ప్రతిబింబించాలి. ఆ దృష్టితో చూస్తే రూపాయి పతనం మన ముందు జటిలమైన ప్రశ్నలను ఉంచుతున్నది. ఒక దేశ కరెన్సీ విలువ, ఆ దేశ ఆర్థిక బలం... ఆర్థిక స్థిరత్వం... అంతర్జాతీయ విశ్వసనీయతకు ప్రతీక.

రూపాయి విలువ తగ్గడమంటే డాలర్ వంటి విదేశీ కరెన్సీలకు ఎక్కువ రూపాయలు చెల్లించాల్సి రావడం. ఇది వినడానికి సాంకేతికపరమైన అంశంగా అనిపించినా, దాని ప్రభావం సామాన్య కుటుంబ బడ్జెట్‌పై నేరుగా పడుతుంది. భారత్ పెద్ద మొత్తంలో ఇంధనం, ముడి చమురు, సహజ వాయువు, ఎరువులు, ఎలక్ట్రానిక్స్, యంత్రాలు వంటి అవసరమైన వస్తువులను దిగుమతి చేసుకుంటుంది. రూపాయి బలహీనపడిన కొద్దీ, వీటి ఖర్చులు పెరుగుతాయి. ఆ ఖర్చు ప్రభుత్వం భరించదు... పరిశ్రమలే భరించవు... అది నేరుగా వినియోగదారుడిపైనే పడుతుంది. పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగితే రవాణా ఖర్చు పెరుగుతుంది. రవాణా ఖర్చు పెరిగితే కూరగాయల నుంచి పాలు, బియ్యం నుంచి మందుల వరకు అన్నీ ఖరీదవుతాయి. ఈ గొలుసు ప్రభావమే ద్రవ్యోల్బణం. ప్రస్తుతం ద్రవ్యోల్బణం ఇప్పటికే సహన స్థాయిని దాటింది. వినియోగ ధరల సూచీ నిరంతరం ఆందోళన కలిగిస్తున్నది. ఆదాయాలు దాదాపు స్థిరంగా ఉండగా, ధరలు మాత్రం రోజురోజుకూ పైపైకి పోతున్నాయి. ఇది ముఖ్యంగా తక్కువ ఆదాయం గల కుటుంబాలకు, మధ్య తరగతికి తీవ్రమైన దెబ్బ. వారి సంపాదనలో పెద్ద భాగం ఆహారం, ఇంధనం, అద్దె, విద్య, ఆరోగ్యం వంటి అవసరాలకే ఖర్చవుతుంది. పిల్లల చదువు, ఆరోగ్యం, భవిష్యత్తు కోసం చేసే పొదుపు అన్నీ దెబ్బతింటాయి. ఈ పరిస్థితి సామాజిక అసమానతలను మరింత పెంచుతుంది. ఉన్నవారు ద్రవ్యోల్బణాన్ని కొంతవరకు తట్టుకోగలుగుతారు. కానీ లేనివారికి అది రోజువారీ జీవన పోరాటంగా మారుతుంది. 'ధనిక', 'పేద' వర్గాల మధ్య అంతరం మరింత పెరుగుతుంది. రూపాయి పతనం వల్ల మరో కీలక సమస్య విదేశీ పెట్టుబడులపై పడే ప్రభావం. కరెన్సీ నిరంతరం బలహీనపడుతున్న దేశంలో పెట్టుబడి పెట్టేందుకు విదేశీ మదుపరులు వెనకాడతారు. ఇప్పటికే అనేక సందర్భాల్లో విదేశీ సంస్థాగత పెట్టుబడులు భారత మార్కెట్ల నుంచి బయటకు వెళ్లిన దృశ్యాలు చూశాం. ఇది, మార్కెట్లలో అస్థిరత, షేర్ ధరల్లో పతనం, కంపెనీలకు మూలధనం అందుబాటులో తగ్గుదలకు సంకేతం. దీని ప్రభావం ఉద్యోగాలపై కూడా పడుతుంది. కొత్త పరిశ్రమలు రావడం తగ్గితే, ఉన్న పరిశ్రమలు విస్తరించలేకపోతే, ఉద్యోగ సృష్టి మందగిస్తుంది. నిరుద్యోగం పెరిగితే వినియోగం తగ్గుతుంది. వినియోగం తగ్గితే ఆర్థిక వృద్ధి కుంటుపడుతుంది. ఇది ఒక విషచక్రం. రూపాయి బలహీనపడటం విదేశీ రుణాలను మరింత భారంగా మారుస్తుంది. ప్రభుత్వం లేదా సంస్థలు విదేశీ కరెన్సీలో తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించేందుకు ఎక్కువ రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుంది. దీని వల్ల ప్రభుత్వ ఖజానాపై ఒత్తిడి పెరుగుతుంది. చివరికి ఈ భారాన్ని కూడా పన్నుల రూపంలో లేదా సబ్సిడీల కోత రూపంలో ప్రజలే భరించాలి.

రూపాయి పతనం అనేది పూర్తిగా ప్రభుత్వ నియంత్రణలో ఉండే అంశం కాదన్న వాదనను పూర్తిగా తిరస్కరించలేం. అయితే, దేశీయ విధానాలు, ఆర్థిక నిర్వహణ, ప్రజల నమ్మకం ఇవన్నీ కూడా కరెన్సీ విలువపై ప్రభావం చూపుతాయి. ఆర్థిక వ్యవస్థపై ప్రజలకు, పెట్టుబడిదారులకు నమ్మకం కలిగించేలా నిర్ణయాలు తీసుకోవడం ప్రభుత్వ కర్తవ్యం. ధరల నియంత్రణకు స్పష్టమైన చర్యలు ఉండాలి. అవసరమైన చోట సబ్సిడీలు, పన్నుల విధానంలో సమతౌల్యం, ఉత్పత్తి రంగాన్ని ప్రోత్సహించే చర్యలను సమన్వయంగా అమలు చేయాలి. అభివృద్ధి అనే పదాన్ని మళ్లీ నిర్వచించుకోవాల్సిన అవసరం కూడా ఇక్కడ స్పష్టంగా కనిపిస్తుంది. స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) వృద్ధి శాతం, స్టాక్ మార్కెట్ సూచీలు, అంతర్జాతీయ ర్యాంకింగ్స్ తదితరాలన్నీ ఆర్థిక వ్యవస్థకు ముఖ్యమే. కానీ అవి ప్రజల జీవితాల్లో ప్రతిబింబించకపోతే ఆ అభివృద్ధి అర్థహీనం. రూపాయి పతనం మనకు చెప్తున్న పాఠం ఇదే. కాగితాలపై వృద్ధి ఉన్నా, ప్రజల కొనుగోలు శక్తి తగ్గుతుంటే, వారి భద్రతాభావం క్షీణిస్తుంటే, ఆర్థిక విధానాలను సమీక్షించుకోకతప్పదు. సమానత్వం, సమగ్రత, సామాజిక న్యాయం లేకుండా ఆర్థిక వృద్ధి నిలకడగా ఉండదు. అందుకే, ప్రభుత్వం తక్షణ చర్యలతో పాటు దీర్ఘకాలిక దృష్టితో ఆర్థిక విధానాలను ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలతో అనుసంధానించాలి. అభివృద్ధి నిజంగా ప్రజలకు లభించినప్పుడే రూపాయి బలపడుతుంది. లేకపోతే గణాంకాల్లో మాత్రమే వృద్ధి ఉంటుంది. సామాన్యుడు మరింత పేదవాడిగా మారే ప్రమాదం తప్పదు.



## పెట్టుబడిదారుల ప్రభావం పెరుగుతోంది

దేశంలో పెట్టుబడిదారుల ప్రభావం పెరుగుతున్నది. ఇది సోషలిస్ట్ ఆదర్శాలకు సవాలుగా మారింది. పెట్టుబడిదారీ విధానం మీడియాను ఆక్రమించింది. జర్నలిస్టులు ఎవరి ఎజెండాను అమలు చేయవద్దు. పెట్టుబడిదారులు ఆధిపత్యం చెలాయించినప్పుడు, సోషలిస్ట్ ఉద్యమం ఎలా ముందుకు సాగుతుంది, జనేశ్వర్ మిశ్రా జీ, నేతాజీ (ములాయం సింగ్ యాదవ్), బాబాసాహెబ్ భీమ్‌రావ్ అంబేద్కర్, రామ్ మనోహర్ లోహియా ఆదర్శాలను మనం ఎలా నిలబెట్టుకుంటామో అనేది మాకు సోషలిస్టులకు ఆందోళన కలిగించే అంశంగా మారుతోంది. ఉద్యమ లాఠీని వారికి అందించినందుకు సోషలిస్టులు మిశ్రాను గుర్తుంచుకుంటారు. సమాజ్‌వాదీ పార్టీ పిడిఎ (పిచ్డా, దళిత, అల్ప సంఖ్యాక్ -- వెనుకబడిన తరగతులు, దళితులు, మైనారిటీలు) పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లడానికి కట్టుబడి ఉంది.

ఎస్‌పి అధినేత అఖిలేశ్ యాదవ్



## నీటి సంక్షోభం... ఒక అంతర్జాతీయ సవాల్

ప్రపంచం ప్రస్తుతం ఎదుర్కొంటున్నది అత్యంత తీవ్రమైన నీటి సమస్య— 'నీటి దివాలా'. ఐక్యరాజ్యసమితి యూనివర్సిటీ ఇన్‌స్టిట్యూట్ ఫర్ వాటర్, ఎన్విరన్‌మెంట్ అండ్ హెల్త్ (UNUINWEH) తాజా నివేదిక ప్రకారం, ప్రకృతి తిరిగి భర్తీ చేయగల సామర్థ్యాన్ని మించిపోయే వేగంతో ప్రపంచం నీటిని వినియోగిస్తోంది. అనేక నదీ పరీవాహక ప్రాంతాలు, భూగర్భ జల భాండాగారాల్లో దశాబ్దాలుగా కొనసాగిన అతివినియోగం, పర్యావరణ క్షీణత కారణంగా, గతంలో ఉన్న నీటి – పర్యావరణ సమతుల్యతను తిరిగి సాధించడం ఇప్పుడు కష్టతరంగా మారింది. వాణిజ్యం, వలసలు, వాతావరణ మార్పులు, భౌగోళిక–రాజకీయ పరస్పర ఆధారాలు ఈ పరిస్థితిని మరింత సంక్లిష్టంగా మారుస్తున్నాయి.

ఇప్పటివరకు విస్తృతంగా ఉపయోగించిన నీటి ఒత్తిడి, నీటి సంక్షోభం వంటి పదాలు ఈ వాస్తవాన్ని పూర్తిగా వివరించలేవు. 'ఒత్తిడి' అన్నది ఇంకా సరిదిద్దగలిగే స్థితిని సూచిస్తే, 'సంక్షోభం' తాత్కాలికంగా ఏర్పడే తీవ్రమైన పరిస్థితిని సూచిస్తుంది. కానీ 'నీటి దివాలా' పూర్తిగా భిన్నమైన దశను సూచిస్తుంది— దీర్ఘకాల అతివినియోగం వల్ల నీటివ్యవస్థలు స్వయంగా కోలుకునే సామర్థ్యాన్ని కోల్పోవడం. ఈ వాస్తవాన్ని స్పష్టంగా అంగీకరించి, దానికి తగిన విధానాలు రూపొందించడం ఇప్పుడు అత్యవసరమైన కర్తవ్యంగా మారింది.

నీటి దివాలా నిర్వహణలో రెండు అంశాలు అత్యంత కీలకం— దివాలా స్థితి, తిరిగి సరిదిద్దలేని నష్టం. ఆర్థిక దివాలా సాధారణంగా అప్పులు–ఆస్తుల మధ్య సమతుల్యతను సరిచేయడంపైనే దృష్టి సారిస్తే, నీటి దివాలా మాత్రం డిమాండ్ సరఫరాల మధ్య ఉన్న సంబంధాన్ని పూర్తిగా పునరాలోచించాల్సిన అవసరాన్ని సూచిస్తుంది. ఇది సంప్రదాయ సంక్షోభ నిర్వహణకంటే విస్తృతమైన దృష్టికోణం; దీర్ఘకాలిక పరిష్కారాలు, సమగ్ర విధానాలు అవసరమని స్పష్టంగా తెలియజేస్తుంది. ఈ కొత్త నీటి వాస్తవానికి 'మనుషుల చేత సృష్టించబడిన కరువు' (Anthropogenic drought) కేంద్రబిందువుగా నిలుస్తోంది. నీటికొరత కేవలం సహజ కారణాల ఫలితం మాత్రమే కాదు; అతివినియోగం, భూగర్భ జలాల క్షీణత, నేల–భూమి నష్టం, అరణ్య నరుకుడు, కాలుష్యం, వాతావరణ మార్పులు కలిసి నీటి లభ్యతను తీవ్రంగా తగ్గిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా సుమారు 70 శాతం నీటి వినియోగం వ్యవసాయ రంగంలోనే జరుగుతుండగా, ముఖ్యంగా గ్లోబల్ సౌత్‌లో ఇది కోట్లాది జీవనాధారాలతో ముడిపడి ఉంది. నీటిని ఒక ప్రవాహ అవకాశ రంగంగా గుర్తించడం ద్వారా దేశాల మధ్యనే కాదు, దేశాల లోపల గ్రామీణ–పట్టణ ప్రాంతాల మధ్య, విభిన్న రాజకీయ వర్గాల మధ్య కూడా విశ్వాసాన్ని పునర్నిర్మించే అవకాశం ఉంది. 2026 –2028 UN Water Conferences, 2028 Water Action Decade ముగింపు, 2030 SDG6 లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుంటే, ప్రపంచం ఇప్పుడు ఒక కొత్త, సమగ్ర, స్థిరమైన నీటి విధానాన్ని రూపొందించాల్సిన కీలక మలుపు వద్ద నిలిచిం ది. నీటి దివాలా ఒక అంతర్జాతీయ సవాల్ మాత్రమే కాదు; ఇది మానవ భద్రత, సమానత్వం, స్థిరత్వానికి సంబంధించిన పరీక్ష. దీన్ని గుర్తించడం సరిపోదు— దీని పరిష్కారానికి న్యాయపూర్వకమైన, దీర్ఘకాలిక విధానాలను తక్షణ మే అమలు చేయాల్సిన బాధ్యత మన ముందుంది.

**డా.కృష్ణ కుమార్ వేపకొమ్మ**
ప్రొఫెసర్ & ప్రిన్సిపాల్ (రిటైర్డ్), హైదరాబాద్

# మోదీ–షాలకు హెచ్చరికలు పంపనున్న 2026 ఎన్నికలు

**ఆర్.సత్యమూర్తి**

భారత ఎన్నికలు దశాబ్దకాలంగా మోసపూరితమైన ఒక ఫార్ములా చుట్టూ తిరుగుతున్నాయి: అది నరేంద్ర మోదీ ప్రజలకు సాక్షాత్కరిస్తాడు. అమిత్ షా ఎన్నికల అంకగణితాన్ని పరిపూర్ణం చేస్తాడు. ఒకటి కథనంపై ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తుంది. మరొకటి యంత్రాంగాన్ని నియంత్రిస్తుంది. వీరిద్దరూ కలిసి భారతీయ జనతా పార్టీని అత్యంత కేంద్రీకృత, క్రమశిక్షణ కలిగిన, ఎన్నికలపరంగా సమర్థవంతమైన రాజకీయ సంస్థగా మార్చారు. భారతదేశం కాంగ్రెస్ పతాక స్థాయిలో ఉండగా చూసినట్లుగా వారు తమ పార్టీని మార్చేశారు.

బిజెపి ఎదుర్కోకుండా జాగ్రత్తగా తప్పించుకుంటున్న అత్యంత అసౌకర్య వాస్తవాన్ని 2026 బహిర్గతం చేసే ప్రమాదం ఉంది: అదేమంటే, జాతీయ ఆధిపత్యం తానంతటతానుగా ప్రాంతీయ శక్తిగా పరివర్తన చెందదు.

పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం, పుదుచ్చేరిలలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు కేంద్రంలోని నరేంద్ర మోదీప్రభుత్వాన్ని అస్థిరపరచవు లేదా పార్టీపై అమిత్ షా పట్టును సడలించబోవు. ఎన్నికలపరంగా మోదీ జాతీయ స్థాయిలో సవాలు చేయబడడు. సంస్థపై షా ఆధిక్యం దాదాపు సంపూర్ణంగా ఉంది. కానీ, ప్రతిచోటా, సంస్కృతులు, భాషలు, కుల దొంతరలు, రాజకీయ సంప్రదాయాలకు అతీతం గా ఎన్నికలపరంగా ఎదురులేనివాడు అని బిజెపి ఒక దశాబ్దం పాటు పెంచి పోషించిన బ్రాండ్ మోదీ అనే మిథ్యను ఈ ఎన్నికలు గాలి తీయగలవు. న్యూఢిల్లీలో కాకుండా ఇక్కడే మోదీ–షా పథకానికి గట్టి ప్రతిఘటన ఎదురవుతుంది. బిజెపి ఎంచుకున్న గణాంకాల ప్రకారం, ఆ పార్టీ తిరుగులేనిదిగా కనిపిస్తోంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో దాని ఓట్ల వాటా దాదాపు 36.5 శాతంగా ఉంది. అది భారతదేశంలో అతిపెద్ద రాజకీయ శక్తిగా నిలిచింది. ఆర్థిక వ్యవస్థ 6.77 శాతంతో వృద్ధి చెందుతోంది. ద్రవ్యోల్బణం తగ్గింది. నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ 18 రాష్ట్రాలను ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా పరిపాలిస్తోంది. ప్రతిపక్షం విచ్ఛిన్నమై, సైద్ధాంతికంగా అసంబద్ధంగా, వ్యూహాత్మకంగా విభజించబడింది.

కానీ జాతీయ సగటుల ఆధారంగా ఎన్నికల పోరాటాలు జరగబోవు. అవి నిర్దిష్ట సామాజిక సంకీర్ణాలలో, చారిత్రక జ్ఞాపకాలలో, స్థానిక అధికార నిర్మాణాల ఆధారంగా జయాపజయాలు ఉంటాయి. 2026లో ఓటు వేయబోయే ఐదు రాష్ట్రాలలో, బిజెపి కేవలం అస్సాం రాష్ట్రాన్ని మాత్రమే ప్రత్యక్షంగా పరిపాలిస్తుంది. అందులోనూ అక్కడ హిమంత బిశ్వ శర్మ తప్ప మోదీ గురుత్వాకర్షణ కేంద్రం కాదు. మిగతా అన్ని చోట్లా, మోదీ–షా బ్రాండ్ పాతుకుపోయిన సాంస్కృతిక, కుల, భాషా అడ్డంకులను ఎదుర్కొంటున్నది. వాటిని కేంద్రంలో పన్నెండు సంవత్సరాల నిరంతరాయ అధికారం తొలగించలేకపోయింది.

**పశ్చిమ బెంగాల్** బిజెపిని అత్యంత బహిర్గత పరిచే పరిశీలనార్హమైన అంశం. 2011–2021 మధ్య ఆ పార్టీ ఓట్ల వాటా 10 శాతం నుండి దాదాపు 38 శాతానికి పెరిగింది. ఇది బిజెపి చరిత్రలో అత్యంత వేగవంతమైన ఎన్నికల పెరుగుదలలో ఒకటి. అయినప్పటికీ, 2021లో మమతా బెనర్జీకి చెందిన తృణమూల్ కాంగ్రెస్ 48 శాతం ఓట్లతో, 294 అసెంబ్లీ స్థానాలకు గాను 213 స్థానాలను గెలుచుకుని, ఈ సవాలును చిత్తుగా ఓడించింది.

క్షీణిస్తున్న ప్రతిఫలాలు అంటే ఇలాగే ఉంటాయి. బిజెపి దశాబ్దానికి పైగా దూకుడుగా విభజన రాజకీయాలు చేసింది. విస్తృతంగా ప్రజలను సమీకరించింది. సంస్థాగత శ్రమను ధారపోసింది. కానీ బెంగాల్ రాజకీయాలు కేవలం సైద్ధాంతిక విభజనల ద్వారా మాత్రమే నిర్ణయించబడవు. అవి సంక్షేమ పథకాల అమలు, స్థానిక అభిమాన అనుసంధానాలు, లోతుగా పాతుకుపోయిన బెంగాలీ ఉప–జాతీయవాద భావన ద్వారా రూపుదిద్దుకుంటాయి. బెంగాల్ జనాభాలో ముస్లింలు 27–28 శాతంగా ఉన్నారు. వారిలో సుమారు మూడింట రెండు వంతుల నుండి నాలుగింటి మూడు వంతుల మందికి తృణమూల్ కాంగ్రెస్ పట్ల విధేయత ఉంది. దీనికి అదనంగా లక్ష్మీర్ భండార్ వంటి పథకాల ద్వారా, మొత్తం ఓటర్లలో దాదాపు 49 శాతంగా ఉన్న మహిళా ఓటర్లు టిఎంసి సంక్షేమ వ్యవస్థలో రాజకీయంగా సమీకృతం చేయబడ్డారు. ఇది బిజెపికి గల పరిమితిని ఏ మాత్రం పొరపాటు లేకుండా చూపిస్తుంది.

మోదీ బ్రాండ్ ర్యాలీలను ఉత్తేజపరచవచ్చు. కానీ బెంగాల్లో ఎన్నికలు వేదికల ద్వారా గెలవబడవు. అవి మునిసిపల్ కార్యాలయాలు, రేషన్ దుకాణాలు, పరిసర ప్రాంత కమిటీలలో గెలవబడతాయి.ఈ ప్రదేశాలలో బిజెపి ఇప్పటికీ పాలక ప్రత్యామ్నాయంలా కాకుండా, ఒక దూకుడుగా వ్యవహరించే వెలుపలి వ్యక్తిలా ఎక్కువగా కనిపిస్తుంది.

బెంగాల్ బిజెపి పరిమితులను బయటపెడితే, **తమిళనాడు** దాని అంచనాలను అవమానిస్తుంది.

పొత్తులు, కేంద్ర ప్రచారాలు, నిరంతరం కేంద్రం ఉనికి ప్రదర్శన ఉన్నప్పటికీ, తమిళనాడులో బిజెపి ఓట్ల శాతం 3 నుండి 6 శాతం మధ్యే నిలిచిపోయింది. 2021లో కూడా, ఎఐఎడిఎంకె పొత్తుతో ఎన్‌డిఎ 234 మందిసభ్యుల అసెంబ్లీలో కేవలం 23 స్థానాలను మాత్రమే గెలుచుకుంది.

ఇది సందేశం అందించడంలో వైఫల్యం కాదు. ఇది అక్కడి పరిస్థితులకు సరిపోని కారణంగా సంభవించిన వైఫల్యం.




జాతీయ స్థాయిలో బిజెపికి అత్యంత విశ్వసనీయమైన మద్దతుదారులుగా ఉండే అగ్ర కులాలు తమిళనాడు జనాభాలో కేవలం 3–4 శాతం మాత్రమే ఉన్నారు. ఒబిసిలు, ఎంబిసిలు కలిసి మొత్తం ఓటర్లలో దాదాపు మూడింట రెండు వంతుల మంది ఉన్నారు. ఇక్కడ ద్రవిడ రాజకీయాలు కేవలం సైద్ధాంతిక ప్రదర్శన కాదు; ఇది రోజువారీ పాలన, సామాజిక అస్తిత్వంలో పాతుకుపోయిన రాజకీయ వివేకం. ఆర్థికపరంగా తమిళనాడు బిజెపికి ఇష్టమైన ప్రచారానికి మరింత గండి కొడుతుంది. ఈ రాష్ట్రం భారతదేశ జిడిపిలో సుమారు 9 శాతం వాటాను అందిస్తుంది. తలసరి ఆదాయం రూ.2.8 లక్షలకు పైగా ఉంది. మోదీ కంటే దశాబ్దాల ముందు నుంచే ఉన్న ద్రవిడ చట్రం ద్వారా సంక్షేమాన్ని అందిస్తోంది. ఇక్కడి ఓటర్లు జాతీయ పరివర్తన కోసం ఎదురుచూడటం లేదు. వారు పంపిణీ, ఆత్మగౌరవం, స్వయంప్రతిపత్తి కోసం బేరసారాలు ఆడుతున్నారు. 'మోదీ మాయాజాలం' ఏదీ ఈ నియమాన్ని ఛేదించలేకపోయింది. 2026లో అది సాధ్యమవుతుందనడానికి ఎలాంటి ఆధారాలు లేవు. **కేరళ**ను బిజెపి వ్యూహకర్తలు తరచుగా పార్టీకి 'తదుపరి సరిహద్దు'గా చిత్రిస్తుంటారు. కానీ అందుబాటులోని సమాచారం మరింత వాస్తవిక చిత్రాన్ని అందిస్తుంది. 2015, 2020, 2025 సంవత్సరాల లో స్థానిక సంస్థల ఎన్నికలలో బిజెపి ఓట్ల శాతం 14–15 శాతం మధ్యే కొట్టుమిట్టాడుతూ ఉంది. ఇది పురోగతి కాదు, స్తబ్దత. కేరళ జనాభా స్వరూపం అంత సులభమైనది కాదు. జనాభాలో ముస్లింలు సుమారు 27 శాతం, క్రైస్తవులు దాదాపు 18 శాతం ఉన్నారు. దాదాపు 45 శాతం మంది ఓటర్లు మైనారిటీలే. వీరు బిజెపి జాతీయ సైద్ధాంతిక ప్రణాళికపై తీవ్రమైన సందేహంలో ఉన్నారు. 2024లో పార్టీ సాధించిన ఎంతో ప్రశంసలు పొందిన ఒక లోక్‌సభ సీటు విజయం కూడా ఈ సమీకరణాన్ని ఏ మాత్రం గణనీయంగా మార్చలేదు. అంచనాలు తక్కువగా ఉన్నందునే స్వల్ప లాభాలను చారిత్రాత్మక మార్పులుగా చిత్రీకరిస్తున్నారు.

కేరళలో మోదీ బ్రాండ్ కుప్పకూలదు. అది కేవలం విస్తరించడానికి నిరాకరిస్తుంది. బిజెపికి **అస్సాం** అతి బలమైన ప్రతివాదన. 2021లో ఎన్‌డిఎ 126 స్థానాలకు గాను 75 స్థానాలను సుమారు 45 శాతం ఓట్ల వాటాతో గెలుచుకుంది. కానీ ఈ విజయం మోదీ ఆకర్షణ కంటే హిమంత బిశ్వ శర్మకే ఎక్కువగా దక్కుతుంది. అస్సాం రాజకీయాలు అత్యంత స్థానికమైనవి. అవి జాతి, భూ హక్కులు, వలసల ఆందోళనలు, అస్తిత్వ సంఘర్షణల ఆధారంగా ప్రభావితమవుతాయి. జనాభాలో 34–35 శాతంగా ఉన్న ముస్లింలు, ఎక్కువగా బిజెపికి దూరంగా ఉన్నారు. శర్మ యొక్క శక్తిమంతమైన స్థానిక నాయకత్వం అస్సామీ హిందువులు, ఒబిసిలు, గిరిజన సమూహాలను ఏకీకృతం చేయడం ద్వారా పార్టీ ఈ లోటును పూడ్చుకుంటోంది. ఈ నమూనా బదిలీ చేయదగినది కాదు. దీనికి ఒక ఆధిపత్య ప్రాంతీయ నాయకుడు అవసరం. చాలా హిందీయేతర రాష్ట్రాలలో బిజెపికి లేనిది స్పష్టంగా ఇదే. ఇది బిజెపికి అత్యంత ఇబ్బందికరమైన సంస్థాగత సమస్య. దాని జాతీయ భాగస్వాములైన అగ్ర కులాలు, ఒబిసిలలో ఒక వర్గం హిందీ రాష్ట్రాలలో అద్భుతంగా పనిచేసింది. కానీ అగ్ర కులాలు జనాభాలో 10 శాతం కంటే తక్కువగా ఉన్న రాష్ట్రాలలో, సామాజిక న్యాయ రాజకీయాలు హిందుత్వ కంటే ముందు ఉన్న చోట, ఈ సూత్రం విఫలమవుతూంది. కులం కేవలం అంకగణితం కాదు. అది జ్ఞాపకం, చరిత్ర, జీవిత అనుభవం. భారతదేశంలోని చాలా ప్రాంతాలలో, ఆ జ్ఞాపకం బిజెపి సైద్ధాంతిక కథనానికి అనుకూలంగా లేదు.

2026 అసెంబ్లీ ఎన్నికలు మోదీ నాయకత్వానికి లేదా షా అధికారానికి ముప్పు కలిగించవు. కానీ, అవి నిశ్శబ్దంగా,మోదీ–షా బ్రాండ్ తన ప్రాంతీయ పరిమితులను చేరుకుందని అత్యంత నష్టం కలిగించే తీర్పును ఇవ్వవచ్చు. రాజకీయాల్లో పన్నెండేళ్లు చాలా సుదీర్ఘ కాలం. కేంద్రంలో దశాబ్దం పాటు నిరంతరాయంగా అధికారంలో ఉన్న తర్వాత కూడా బిజెపి పశ్చిమ బెంగాల్, తమిళనాడు లేదా కేరళలో పాగా వేయలేకపోతే, సమస్య నాయకత్వం, ప్రయత్నం లేదా వనరులు కాదు. అది వ్యవస్థాగతంగా అనుగుణంగాలేని లోపం. బిజెపి భారతదేశాన్ని పరిపాలించడం కొనసాగవచ్చు. కానీ భారతదేశాన్ని పరిపాలించడం అంటే, దానిలోని ప్రతి భాగానికి ప్రాతినిధ్యం వహించడం కాదు. 2026లో ప్రాంతీయ భారతదేశం మోదీ–షా జగన్నాథ రథం చాలాకాలంగా ప్రతిఘటిస్తున్న ఒక సత్యాన్ని గుర్తు చేయబోతోంది :కొన్ని కోటలు జయించబడేందుకు ఎదురు చూడవు. అవి ఏ మాత్రం ప్రభావితం కావు.

# స్ఫూర్తినింపిన సిపిఐ శతాబ్ది ఉత్సవాలు




భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శతాబ్ది ఉత్సవాల ముగింపు సభ సందర్భంగా ఈనెల 18 నుంచి 21 వరకు జరిగిన కార్యక్రమాలు స్ఫూర్తిని నింపాయి. ముఖ్యంగా 18న ఖమ్మంలో జరిగిన ప్రదర్శన, బహిరంగ సభ కమ్యూనిస్టు శక్తులకు ఉత్తేజాన్ని, ఊపును ఇచ్చింది. కమ్యూనిస్టులు బలహీనపడ్డారని వాదించే వారికి శతాబ్ది ఉత్సవాల ముగింపు సభ తగు రీతిలో సమాధానం ఇచ్చింది. దశాబ్దాల నాడు కమ్యూనిస్టు పార్టీ సభలకు తరలి వచ్చిన రీతిలో కమ్యూనిస్టు శక్తుల పురోగమనాన్ని కోరుకుంటూ పెద్ద సంఖ్యలో కార్యకర్తలు సుదూర ప్రాంతాల నుంచి తరలి వచ్చారు. శరీరానికే వార్ధక్యం కానీ ఆలోచనకు కాదని రుజువు చేస్తూ అనేక మంది వృద్ధులు పడుతూ లేస్తూ ప్రదర్శనలో పాల్గొని యువతకు స్ఫూర్తిగా నిలిచారు. ముఖ్యంగా ఖమ్మం నగరంలో జరిగిన జనసేవాదళ్ కవాత్ నభూతో నభవిష్యత్ అన్న రీతిగా సాగింది. ఇంత మంది యువకులు కమ్యూనిస్టు పార్టీ వెనక ఉన్నారా అని ఆలోచించే రీతిలో వేలాది మంది యువకులు లెఫ్ట్ రైట్ అంటూ ఖమ్మం పుర వీధుల్లో చేసిన కవాతు మరికొన్ని దశాబ్దాల పాటు గుర్తుండి పోయేలా చేసింది. కిలో మీటర్ల మేర ప్రదర్శన ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బహిరంగ సభకు అనూహ్య రీతిలో ప్రజలు కదలి వచ్చారు. 18న ఎటు చూసినా ఎర్ర జెండా రెపరెపలతో ఖమ్మం అరుణకాంతులినిండింది. ఎటుచూసినా ఎర్ర జెండాలు పట్టిన జనమే కనిపించారు. త్యాగాలు, పోరాటాలతో వందేళ్లు గడిచినా తాము మద్దతుగానే నిలుస్తామని సభకు వచ్చిన ప్రజలు చాటి చెప్పారు. సభ పునరుత్తేజాన్ని ఇచ్చింది. భవిష్యత్తు పోరాటాలకు ప్రేరణగా నిలిచింది.

శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని మూడు రోజుల పాటు ఖమ్మంలో జరిగిన సిపిఐ జాతీయ స్థాయి సమావేశాలు రానున్నకాలంలో పార్టీ అనుసరించాల్సిన విధానాలకు సంబంధించి దిశా నిర్దేశం చేశాయి. పెరుగుతున్న ఫాసిస్టు శక్తుల దుశ్చర్యలను అడ్డుకునేందుకు వామపక్ష ప్రజాతంత్ర శక్తులను కలుపుకుని బహుముఖ పోరాటాలకు సమాయత్తం కావాలని సమావేశాలు పిలుపునిచ్చాయి. ప్రపంచంలో పెరుగుతున్న ధోరణులు, ట్రంప్ విధానాలను నిరసిస్తూ వెనుజులా, క్యూబా లాంటి దేశాలకు కమ్యూనిస్టు పార్టీ సంపూర్ణ మద్దతును ప్రకటించింది. బిజెపి విధానాలు ఈ దేశ ప్రజాస్వామ్యానికి ప్రమాదకరంగా మారాయని, ఒక పక్క పార్లమెంటును నిర్వీర్యం చేస్తూ మరో పక్క దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారని సమావేశం పేర్కొన్నది. వీటిని అడ్డుకోవడానికి ప్రజలను చైతన్యవంతం చేయడంతో పాటు మతతత్వ శక్తులను నిలువరించేందుకు పార్టీ కార్యకర్తలను సమాయత్తం చేయాలని సమావేశాలు నిర్ణయించాయి.

విపక్ష పాలనలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలను ఇబ్బందుల పాలు చేస్తున్న గవర్నర్ వ్యవస్థను రద్దు చేయాలని సిపిఐ సమావేశాల సందర్భంగా డిమాండ్ చేస్తూ తీర్మానాన్ని ఆమోదించాయి. జాతీయ కౌన్సిల్ సమావేశాల్లో మొత్తం తొమ్మిది తీర్మానాలను ఆమోదించారు. ఫిబ్రవరి 12న మోదీ ప్రభుత్వ కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జరిగే సార్వత్రిక సమ్మె జయప్రదానికి కృషి చేయాలని, ఎంజి ఎన్‌ఆర్‌ఈజిఎస్ పథకం కొనసాగింపుకు పోరాడాలని, విబి జి రామ్ జీ పేరిట మోదీ తీసుకు వచ్చిన పథకాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఐ తీర్మానించింది. శ్రీ మాతా వైష్ణో దేవి మెడికల్ ఇనిస్టిట్యూట్ రద్దు ప్రతిపాదనను తక్షణం ఉపసంహరించుకోవాలని, భారతదేశంలో పెరుగుతున్న వాయు కాలుష్యాన్ని నియంత్రించేందుకు ముఖ్యంగా ఉత్తర భారతదేశంలో పెరుగుతున్న వాయుకాలుష్య నియంత్రణకు తక్షణ చర్యలు చేపట్టాలని, ప్రైవేట్ సెక్టార్‌లో రిజర్వేషన్లు కల్పించాలని, ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా ఉన్న విబి జి రామ్ జి చట్టాన్ని ఖండించాలని జాతీయ స్థాయి సమావేశాలు తీర్మానించాయి. శతాబ్ది ఉత్సవాల సందర్భం గా జరిగిన సెమినార్ ఐక్య ఉద్యమాలకు పిలుపునిచ్చింది. ఈనెల 20న నేటి భారత దేశం–వామపక్షాలు ఎదుర్కొంటున్న సవాళ్లు అనే అంశంపై జరిగిన సెమినార్‌లో సిపిఐ, సిపిఎం, సిపిఐ(ఎంఎల్)లిబరేషన్, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్, జాతీయ కార్యదర్శులు డి. రాజా, ఎంఎబేబీ, దీపాంకర్ భట్టాచార్య, జి. దేవరాజన్‌తో పాటు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క పాల్గొన్నారు. భారత ప్రజాస్వామ్యానికి ప్రమాద ఘంటికలు మోగుతున్నాయని ఒక పక్క ఓట్ల తొలగింపు జరుగుతుండగా మరో పక్క జనాభా లెక్కల పేరుతో బిజెపి సర్కార్ మరో కుట్రకు పూనుకుందని వక్తలు తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్ సూచనలతో బిజెపి ప్రభుత్వం పాలనలోకి మతాన్ని చొప్పిస్తుందని, కులం పేర, మతం పేర సమాజాన్ని విడదీస్తుందని ఆరోపించారు.

అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని సవరించడం ద్వారా ఈ దేశంలో శాశ్వతంగా అధికారంలో ఉండాలని బిజెపి ప్రయత్నిస్తుందని మోదీ చర్యలు నియంత పాలన వైపుకు దారి తీస్తున్నాయని వామపక్షాల నేతలు ఆరోపించారు. ఈ సెమినార్ వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ఐక్య పోరాటాలకు పిలుపునిచ్చింది. మొత్తంగా శతాబ్ది ఉత్సవాలు వందేళ్ల సిపిఐ చరిత్రలో త్యాగాలు చేసిన వారిని స్మరించుకుంటూ గత పోరాటాలను మననం చేసుకుని భవిష్యత్ పోరాటాలకు కార్యోన్ముఖులను చేసింది. ఓట్లు, సీట్లు నోట్లతో ముడిపడి ఉన్న రోజుల్లో ప్రజా ఉద్యమ నిర్మాణం, ప్రజా వ్యతిరేక విధానాలను అడ్డుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగాలని శతాబ్ది ఉత్సవాలు పిలుపునిచ్చాయి. జాతీయ స్థాయి సమావేశాల ముగింపు సందర్భంగా నాయకులు బెలూన్లు ఎగురవేసి ఘనంగా ముగించారు.

**ఏనుగు వెంకటేశ్వరరావు**, ఖమ్మం



## శ్మశానవాటిక అభివృద్ధి పనులు ప్రారంభం

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** నేరేడ్‌మెట్ డివిజన్‌లోని యాప్రాల్‌లో రూ.1.90 కోట్ల వ్యయంతో అమ్ముగూడ శ్మశానవాటిక అభివృద్ధి పనులను గురువారం స్థానిక కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్‌రెడ్డి ప్రారంభించారు. డివిజన్‌లోని అన్ని ప్రాంతాల్లోనూ మౌలిక వసతులను కల్పించటంలో ప్రాధాన్యత ఇస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు ఉపేందర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు ఆదిత్య, శ్మశానవాటిక అధ్యక్షుడు పరమేష్, పరస్ జైన్, విష్ణు, రమణ్ తదితరులు పాల్గొన్నారు.



## సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్లు పెంచాలి

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు కనీస పెన్షన్‌ను రూ.10 వేలకు పెంచాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అళవందార్ వేణుమాధవ్ కోరారు. గురువారం పోచారం సర్కిల్‌లోని కొర్రెముల సుప్రభాత్ టౌన్‌షిప్‌లో అసోసియేషన్ అధ్యక్షుడు దండంరాజు రాంచందర్‌రావు అధ్యక్షతన కార్యవర్గ సమావేశం సమావేశం జరిగింది. కరువు భత్యంతో కూడిన పెన్షన్‌లు ఇవ్వాలని గతంలో డిల్లీ, వారణాసి, కోలకత్తా, కొత్తగూడెంలలో భారీ ప్రదర్శన జరిగిందన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు అన్ని రకాల వైద్య సేవలు ఉచితంగా అందించాలని గతంలో పలుసార్లు మంత్రులు, అధికారులకు విన్నవించినా ఇప్పటికీ ఎలాంటి స్పందన లేదన్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు విజయబాబు, బీరయ్య, ఎస్ నర్సింగ్‌రావు, ఉమాకర్, పార్థసారథి, జయంత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## బాక్స్ డ్రైయిన్‌కు నిధులు మంజూరు



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** వినాయకనగర్ డివిజన్‌లోని జెకె కాలనీలో బాక్స్ డ్రైయిన్‌పనుల కోసం రూ.132 లక్షల నిధులు మంజూరయ్యాయని స్థానిక కార్పొరేటర్ రాజ్యలక్ష్మి తెలిపారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే ఈ పనులు పూర్తయ్యేలా చూడాలని జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలోని చీఫ్ ఇంజనీర్ నిత్యానందంను ఆమె గురువారం కల్సి వినతిపత్రం సమర్పించారు.



## గంగపుత్ర సంక్షేమానికి సహకరిస్తా

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** గంగపుత్ర అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వపరంగా సహకరిస్తానని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి తెలిపారు. గౌతంనగర్ డివిజన్ మల్లికార్జుననగర్ ప్రాంతానికి చెందిన మల్లికార్జున నగర్ గంగపుత్ర సంఘ సభ్యులు గురువారం ఎమ్మెల్యేను కల్సి పవర్ బోరు వేయించాలని కోరారు. సంఘ ప్రతినిధులతో పాటు స్థానిక బిఆర్ఎస్ నేత మేకల రాముయాదవ్ ఎమ్మెల్యేలను కలిసారు.



## ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పర్యటన

**కూకట్‌పల్లి/ప్రజాపక్షం :** ఫతేనగర్ డివిజన్‌లోని భరత్‌నగర్ కాలనీలో గురువారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పర్యటించారు. భరత్‌నగర్ కాలనీలో ప్రధాన రహదారిపై వాటర్ వర్క్స్ అధికారులు రోడ్డు తవ్వి మరమ్మతులు పూర్తి చేయకపోవడంతో రోడ్డు ఎగుడు, దిగుడుగా మారడంతో పాఠశాల విద్యార్థులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్, అధికారులతో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జలమండలి అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు తవ్వి అస్తవ్యస్తంగా మట్టి పోయడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దీనికి సంబంధించి రోడ్డు పనులు జిహెచ్ఎంసికి అప్పగించినా, వారు పూర్తిచేసే వారని తెలిపారు. వెంటనే ఈఈ గోవర్ధన్‌కు ప్రణాళిక సిద్ధం చేసి, సిసి రోడ్డు చేపట్టి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేయాలని ఆదేశించారు. పారిశుద్ధ్యం, దోమల బెడదకు సంబంధించి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తూము శ్రవణ్‌కుమార్, ఎఇ రంజిత్, డివిజన్ అధ్యక్షులు అంబటి శ్రీను, బిక్షపతి, విజయ్‌కుమార్, ఉమాపతిగౌడ్, జ్యోతిగౌడ్, కుమారి, జనరల్ సెక్రటరీ, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## స్కూల్‌లో స్వచ్ఛ సర్వేక్షణ్

**ప్రజాపక్షం/చర్లపల్లి:** స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా కుషాయిగూడ శ్రీ శిశు మందిర్ స్కూల్‌లో విద్యార్థులకు తడి, పొడి చెత్త, కంపోస్ట్ గూర్చి అవగాహన కల్పించారు. శుభ్రతలో విద్యార్థుల పాత్ర కీలకమని వారికి అవగాహన కల్పించడంతో పారిశుద్ధ్యం, ప్రజారోగ్యం విషయంలో సత్ఫలితాలు సాధించవచ్చునని కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీహరి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ డిఇ బాల కృష్ణ, శానిటరీ సూపర్‌వైజర్ సుదర్శన్, జవాన్ రాజన్, రామకృష్ణ, శ్రీనివాస్, ఎస్‌ఎఫ్‌ఎలు లక్ష్మి , వసంత, సంజీవ, తదితరులు పాల్గొన్నారు.




# సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో పార్కింగ్ మార్పులు

* ప్లాట్‌ఫామ్ నం.10 వద్ద విస్తృత పార్కింగ్ సౌకర్యం
* ప్లాట్‌ఫామ్ నం.1వద్ద నిలిపివేత







**ప్రజాపక్షం/హైదరాబాద్:** సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను ఆధునీకరించే దిశగా దక్షిణ మధ్య రైల్వే చేపట్టిన పునరాభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. దాదాపు రూ.714.73 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ భారీ ప్రాజెక్టులో భాగంగా ప్రయాణికుల సౌకర్యాలు మెరుగుపరచడం, భద్రతను పెంపొందించడం, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

పునరాభివృద్ధి పనుల నేపథ్యంలో ప్లాట్‌ఫామ్ నంబర్ 1 వద్ద ఉన్న పార్కింగ్ సౌకర్యాన్ని తాత్కాలికంగా నిలిపివేశారు. ఈ ప్రాంతంలో ప్రస్తుతం కేవలం తక్కువ సమయంలో పికప్, డ్రాప్‌కు మాత్రమే వాహనాలను అనుమతిస్తున్నారు. మరోవైపు, ప్లాట్‌ఫామ్ నంబర్ 10 వైపున ట్రాఫిక్ రద్దీ నివారించేందుకు యాక్సెస్ కంట్రోల్ సిస్టమ్ అమలు చేశారు. ఈ జోన్‌లోకి ప్రవేశించే వాహనాలకు 15 నిమిషాల వరకు ఉచిత పికప్, డ్రాప్ సౌకర్యం కల్పించగా, ఆ తర్వాత అధీకృత పార్కింగ్‌లో నిలపని వాహనాలపై అదనపు రుసుములు విధించనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం ప్లాట్‌ఫామ్ నంబర్ 10 వైపున ఉన్న బేస్‌మెంట్‌లో నాలుగు చక్రాల వాహనాలు, ద్విచక్ర వాహనాలకు తగినంత పార్కింగ్ సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. ఈ పార్కింగ్‌కు జీఎస్టీతో కలిపిన రుసుములు నిర్ణయించారు. నాలుగు చక్రాల వాహనాలకు మొదటి రెండు గంటల వరకు రూ.40, తదుపరి ప్రతి గంటకు రూ.20, ద్విచక్ర వాహనాలకు మొదటి రెండు గంటలకు రూ.25, తదుపరి గంటకు రూ.10, సైకిళ్లకు మొదటి రెండు గంటలకు రూ.5, ఆ తర్వాత గంటకు రూ.2 చొప్పున వసూలు చేస్తారు. ఈ వివరాలను పార్కింగ్ ప్రాంతంలోని ప్రముఖ ప్రదేశాల్లో ప్రదర్శించినట్లు తెలిపారు.

స్టేషన్‌లో ప్రయాణికులకు స్పష్టమైన దిశానిర్దేశం కోసం సైన్‌బోర్డులు, పబ్లిక్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్, డిస్‌ప్లే బోర్డులను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పునరాభివృద్ధి పను ల్లో సుమారు 50 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులు కూడా యుద్ధప్రాతిపదికన సాగుతున్నాయని అధికారులు వెల్లడించారు. మొత్తం ప్రాజెక్టును డిసెంబర్ 2026 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

పునరాభివృద్ధి పూర్తయిన తర్వాత సికింద్రాబాద్ స్టేషన్‌లో ప్రపంచస్థాయి సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. ప్లాట్‌ఫామ్ నంబర్ 1 వైపు మల్టీ లెవెల్ కార్ పార్కింగ్, ప్లాట్‌ఫామ్ నంబర్ 10 వైపు బేస్‌మెంట్ పార్కింగ్, పెరిగిన పార్కింగ్ సామర్థ్యం, క్రమబద్ధమైన వాహన కదలిక వంటి సదుపాయాలు ఏర్పాటవుతాయి. పునరాభివృద్ధి పనుల సమయంలో ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ప్రయాణం సాగేందుకు, అలాగే అనధికార పార్కింగ్ వల్ల ఓవర్‌స్టే ఛార్జీలు పడకుండా ఉండేందుకు ప్లాట్‌ఫామ్ నంబర్ 10 వైపున ఏర్పాటు చేసిన బేస్‌మెంట్ పార్కింగ్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని దక్షిణ మధ్య రైల్వే ప్రయాణికులకు విజ్ఞప్తి చేసింది.

## 'అరైవ్—అలైవ్' కార్యక్రమంపై అందరికీ అవగాహన



**ప్రజాపక్షం/చర్లపల్లి/నాగారం:** రోడ్డు భద్రతను మెరుగుపరిచే లక్ష్యంతో 'అరైవ్ అలైవ్' కార్యక్రమం తెలంగాణ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. వాహనదారులు, ఆటో డ్రైవర్లు, బస్సు డ్రైవర్లు, కాలనీవాసులు, విద్యార్థులు, యవతకు రోడ్డు భద్రత నియమ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా నియమాలు పాటిస్తూ సురక్షిత ప్రయాణం చేయాలని, హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వాడకాన్ని నివారించాలని సూచిస్తున్నారు.

**హెల్మెట్ తప్పనిసరిగా వాడాలి:** రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాపాయం నుండి బయట పడాలంటే హెల్మెట్ ధరించడం ఒక్కటే మార్గమని, ఇది ద్విచక్ర వాహనం నడిపేవారికి రక్షణ కవచంలా పనిచేస్తుందని, పోలీసులు సూచిస్తున్నారు. బెల్ట్ ధరించడం వల్ల సడన్‌గా ప్రమాదాలు జరిగినప్పుడు హెల్మెట్ తల నుండి ఊడిపోకుండా గాయాలు కాకుండా ఉంటుందన్నారు.

**సీట్ బెల్ట్ ప్రాణాలు కాపాడుతుంది:** వాహనాలలో ప్రయాణించేటప్పుడు సీట్ బెల్ట్‌ను తప్పనిసరిగా ధరించాలని, సీటు బెల్ట్ పెట్టుకుంటే ప్రాణాలు నిలబెట్టుకోవచ్చునని కానీ సీటు బెల్టు నామోషీగా భావిస్తుంటారు. ఏదైనా ప్రమాదాలు జరిగినప్పుడు సీటు బెల్ట్ పెట్టుకుంటే ఎయిర్ బాగ్స్ తెరుచుకున్నప్పుడు ప్రాణాలు కాపాడుకోవచ్చు.

**మొబైల్ డ్రైవ్ ప్రమాదకరం:** మొబైల్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం చట్టవిరుద్ధం, చాలా ప్రమాదకరం, ఫోన్ మాట్లాడుకుంటు డ్రైవింగ్‌చేస్తే రోడ్డపై దృష్టి ఉండదు. ఇది దృష్టి మర్చడం వల్ల ప్రమాదాలు జరిగి ఆసుపత్రిలో చేరే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది.





**డ్రంక్ అండ్ డ్రైవ్‌తో కుటుంబం ఆగం**

మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల అనేకమంది ప్రాణాలు గాలిలో కలసిపోతున్నాయి. దీనివల్ల అనేక మంది ప్రాణాలు కోల్పోతుండడంతో వారి కుటుంబం తీరని వేదనను మిగుల్చుతున్నాయి. డ్రంక్ డ్రైవ్ కార్యక్రమాలను నిర్వహించి చలాన్లు విధించడం,జైలుకు పంపించడం జరుగుతుంది. వీటితో పాటు సిగ్నల్ జంపింగ్, నో పార్కింగ్, ఓవర్ స్పీడ్ డ్రైవింగ్ ఇన్సూరెన్స్, కార్ డోర్ ఒపెనింగ్‌లపై పోలీసులు అవగాహన కల్పిస్తు ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ సురక్షితం గా ఇంటికి చేరుకోవాలని ఇంట్లో కుటుంబ సభ్యులు మన కోసం ఎదురుచూస్తుంటారని గుర్తు చేస్తున్నారు.

**శామీర్‌పేటలో:** ప్రతి ఒక్కరు రోడ్డు నిబంధనలను తప్పకుండా పాటించాలని జిల్లా ఆర్‌టిఏ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి అన్నారు. గురువారం రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా మేడ్చల్ చెక్‌పోస్టు, శామీర్‌పేట ప్రధాన రోడ్లపై జరుగుతున్న ప్రమాదాలు బ్లాక్ స్పాట్‌లను ట్రాఫిక్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపే వారు రోడ్డు ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌లు ధరించాలని, నాలుగు చక్రాల వాహనం నడిపేవారు సీటు బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. మద్యం తాగి వాహనాలను నడపరాదని, వాహనాల పత్రాలను ఎల్లప్పుడు అందుబాటులో పెట్టుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ట్రాఫిక్ సిఐ మధుసూదన్, మేడ్చల్ సిఐ సత్యనారాయణ, డిఐ రాజు, శామీర్‌పేట ఎస్ఐ శశివర్ధన్ రెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ నవీన్‌రెడ్డి, ఎఎంవిఐ కిరణ్ కుమార్, ఆర్‌అండ్‌బి ఎఇ రంజిత్, జిహెచ్‌ఎంసి ఎఇ తిరుపతి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన తెలంగాణ ఉద్యమకారుడు వెంకటేష్



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ఉద్యమకారులను పట్టించుకున్న పాపన పోలేదని బిఆర్ఎస్ నాయకుల స్వార్ధ రాజకీయాలతో పార్టీ భ్రష్టు పట్టిందని తెలంగాణ ఉద్యమకారుడు మ్యాడబోయిన వెంకటేష్ అన్నారు. గురువారం మూడుచింతలపల్లి మున్సిపల్ పొన్నాల్‌లో బోడుప్పల్ మాజి మేయర్ అజయ్ యాదవ్ సమక్షంలో మ్యాడబోయిన రమేష్‌తో పాటు 30మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా అజయ్‌యాదవ్ బిఆర్ఎస్ నాయకులకు కాంగ్రెస్ కండవా కప్పి సాదరంగా కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం రమేష్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ఉద్యమకారులు తమ ప్రాణాలకు తెగించి పోరాడిన కార్యకర్తలను బిఆర్ఎస్‌లో పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రవేశపెడుతున్న పథకాలు ప్రతి ఇంటింటికి చేరుతున్నాయని ప్రజల పక్షపాతిగా ఉన్న కాంగ్రెస్ జెండా నీడలోనే ప్రజల కు సేవ చేస్తానని తెలిపారు. మాజీ మేయర్ అజయ్‌యాదవ్ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు గౌరవం ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్, మున్సిపల్ అధ్యక్షుడు దోసకాయల వెంకటేష్, మాజీ మేయర్ అమర్‌సింగ్, మాజీ డిప్యూటి మేయర్ కొత్త కిషోర్‌గౌడ్, మాజీ కార్పోరేటర్ కిరణ్, తదితర నాయకులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్‌గా మధుసూదన్‌రెడ్డి

**ప్రజాపక్షం/తాండూరు:** తాండూరు మున్సిపల్ నూతన కమీషనర్‌గా మదుసుదన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ కమీషనర్‌గా విధులు నిర్వహించిన యాదగిరి బదిలీ కావడంతో ఆయన స్థానంలో సంగారెడ్డి జిల్లా ఇంద్రేశం మున్సిపల్ కమీషనర్‌గా విధులు నిర్వహిస్తున్న మదుసుధన్‌రెడ్డిని తాండూరు మున్సిపల్ కమీషనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు గురువారం తాండూరు మున్సిపల్ కమీషనర్‌గా మదుసుధన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన కమీషనర్ మాట్లాడుతూ అందరి సహకారం తో పట్టణాభివృద్ధి కృషి చేస్తానని అన్నా రు.

## విద్యార్థులు సాంకేతికతతో విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలి

### కలెక్టర్ ప్రతీక్‌జైన్



**ప్రజాపక్షం/వికారాబాద్:** విద్యార్థులు ఇంటర్‌నెట్ సాంకేతికతను మంచి పనులను ఉపయోగించి విద్యావ్యవస్థను బలోపేతం చేయాలనీ జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన అన్నారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని జెడ్పిఎచ్ఎస్ బాలుర పాఠశాలలో జిల్లా కలెక్టర్ వినూ త్న కార్యక్రమంపై ప్రత్యేక పరస్పర సమావేశం నిర్వహించారు. సోహం అకాడమీ ఆఫ్‌హ్యూమన్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇర్‌ఐఎ కార్యక్రమంలో ద్వారా సోహం అకాడమీ ఇప్పటివరకు వికారాబాద్ జిల్లాలో 15 పాఠశాల ల్లో రోబోటిక్స్ వర్క్‌షాప్‌లను విజయవంతంగా పూర్తి చేసింది. వాటిలోంచి 5పాఠశాలలను ఎంపిక చేసి ఈ ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొనేటట్లు చేశారు. విద్యార్థులు తమ వినూత్న నమూనాలు ప్రదర్శించారు. స్పీడ్ మానిటరింగ్ సిస్టంమ్ ఆఫ్ సిటీ రోడ్స్, స్మార్ట్‌గ్రీన్‌ప్రొటెక్షన్ సిస్టమ్ వంటి ప్రాజెక్టులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచా యి. నగర రహదారులపై వేగనియంత్రణతో ప్రమాదాలను తగ్గించే విధానం, అలాగే ధాన్యాన్ని తేమ, పురుగుల నుంచి రక్షించే విధానాన్ని విద్యార్థులు కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడి రూపొందించిన నమూనాలను పరిశీలించి సృజనాత్మకతను, ప్రాక్టికల్ అవగాహనను ఈ సందర్భంగా ప్రశంసించారు. అనంతరం కలెక్టర్ విద్యార్థుల్లో కొత్త ఆలోచనలు సాంకేతికతను మంచి పనులకు వాస్తవ జీవిత సమస్యల పరిష్కారానికి ఉపయోగించాలనే ఉత్సాహాన్ని కలిగించారు. పిల్లలకు ఆత్మవిశ్వాసం, జట్టు పని నైపుణ్యా లు, సమస్యల పరిష్కార సామర్థ్యం గురించి తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి రేణుకాదేవి, గోపి, సహదేవ్ జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

**ఇసుక అక్రమ రవాణా జరుగకుండా పకడ్బందీగా చర్యలు:** జిల్లాలో ఇసుక అక్రమ రవాణా జరుగకుండా పగడ్బందీగా చర్యలు చేపట్టాలన్ని కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. గురువారం జిల్లా ఎస్‌పి తో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో ఎంపిడిఒలు, తహసీల్దార్లుతో ఇసుక అక్రమ రవాణా జరగకుండా సంబంధిత శాఖల సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్‌పి మాట్లాడుతూ అన్ని శాఖల సమన్వయంతో ఇసుక అక్రమ రవాణ ను అరికట్టాలన్నారు. ఆన్లైన్ బుక్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి కలెక్టర్ రాజేశ్వరి అదనపు కలెక్టర్ సుధీర్, పంచాయతీ అధికారి జయసుధ, ఎడి సత్యనారాయణ, టాన్స్‌పోర్ట్ అధికారి, తదితరులు పాల్గొన్నా రు.

## 'సిఎం కప్-2025 సెకండ్ ఎడిషన్'కు శుభారంభం



**ప్రజాపక్షం/ఉప్పల్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సెకండ్ ఎడిషన్ చీఫ్ మినిస్టర్ కప్—2025 క్రీడా పోటీలకు ఉప్పల్ మండల కేంద్రంలో ఘనంగా శుభారంభం జరిగింది. ఈ సందర్భంగా బుధవారం ఉప్పల్ రింగ్ రోడ్ నుండి ఉప్పల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకు కాగడా ర్యాలీ నిర్వహించి క్రీడాలను ప్రారంభించారు. ఈ ర్యాలీలో మండ ల విద్యాధికారి రామరావు, తహశీల్దార్ ఫూల్ సింగ్ చౌహాన్, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రాజు, సిఐ భాస్కర్, ట్రాఫిక్ సిఐ నాగరాజ్, ప్రధానోపాధ్యాయులు శిరీష, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతలో క్రీడాస్ఫూర్తి ని పెంపొందించడమే సిఎం కప్ ప్రధా న లక్ష్యమని పేర్కొన్నారు. 28వ తేదీ నుండి ఉప్పల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మండల స్థాయి సిఎం కప్—2025 పోటీలు ప్రారంభమవుతాయని మండల విద్యాధికారి వెల్లడించారు. క్యారమ్స్, చెస్, వాలీబాల్, కబడ్డీ, కోకో క్రీడాంశాలలో పోటీ లు నిర్వహించనున్నట్లు తెలిపారు.



**శామీర్‌పేటలో:** శామీర్‌పేట మండల కేంద్రంలోని యువతీ, యువకులు, విద్యార్థులకు సిఎం కప్ పోటీలను నిర్వహిస్తామని శామీర్‌పేట ఎంఇఒ కమలాకర్ అన్నారు. గురువారం శామీర్‌పేట జడ్పిహెచ్ఎస్ విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులతో టార్చ్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ ఈ నెల 28 నుంచి 31 వరకు సిఎం కప్ పోటీలు జరుగుతాయని యువతీ యువకులు, విద్యార్థులు పాల్గొనాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో హెచ్ఎం వేణు, పిడిలు సత్తిరెడ్డి, గోపాల్‌చారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నా రు. అలాగే మూడుచింతలపల్లి ఎంఇఒ భాగ్యమణి ఒక ప్రకటనలో మాట్లాడుతూ మూడుచింతలపల్లి రెవెన్యూ మండల స్థాయి సెకండ్ ఎడిషన్ సిఎం కప్ క్రీడలు మున్సిపల్‌లోని మిని స్టేడియంలో తేది 28 నుంచి 31 వరకు నిర్వహిస్తామని చెప్పారు. ఆసక్తిగల యువతీ, యువకులు విద్యార్థిని, విద్యార్థులు తమ పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని చెప్పారు. రిజిస్ట్రేషన్ లేకుం డా క్రీడల్లో పాల్గొనే అవకాశం లేదని చెప్పారు. ఈ పోటీలకు సంబంధించి పూర్తి సమాచారం ఎస్‌జిఎఫ్ జోనల్ సెక్రటరి పిడి కవిత మొబైల్ నెంబర్ 7416542457 సంప్రదించాలని ఆ ప్రకటనలో కోరారు. సిఎం కప్ సందర్భంగా టార్చ్ ర్యాలీ నిర్వహించామని పేర్కొన్నారు.




## నిర్లక్ష్యం వహిస్తే సస్పెండ్ చేస్తా

### కలెక్టర్ హెచ్చరిక

**ప్రజాపక్ష/మేడ్చల్ మల్కాజిగిరి :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా 2002 నుండి ఉన్న ఓటరు జాబితాను 2025 ఓటరు జాబితాకు అనుగుణంగా సవరించే మ్యాపింగ్ ప్రక్రియలో నిర్లక్ష్యం వహించే ఉద్యోగులను సస్పెండ్ చేస్తామని జిల్లా కలెక్టర్ మనుచౌదరి హెచ్చరించారు. ఓటరు జాబితా మ్యాపింగ్ ప్రక్రియ రాష్ట్రంలో మేడ్చల్ జిల్లా చివరి స్థానంలో ఉందని, ఇప్పటికైనా సంబంధిత అధికారులందరూ ప్రత్యేక శ్రద్ధతో విధులు నిర్వహించాలన్నారు. గురువారం జిహెచ్ఎంసి మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయంలో ఓటరు జాబితా అనుసంధాన ప్రక్రియ పురోగతిపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. తమ తమ బిఎల్ఒలతో సూపర్‌వైజర్లు సమావేశమై వేగవంతం చేయాల్సిన బాధ్యత వహించాలన్నారు. బిఎల్ఒలు ఎప్పుడైనా వైద్యపరంగా సెలవులకు వెళితే వారి స్థానంలో మరొకరిని నియమించుకొని ప్రక్రియ కొనసాగించాలని సూచించారు. ఎఇఆర్ఒలు పూర్తి బాధ్యత తీసుకొని సూపర్‌వైజర్లు, బిఎల్ఒలకు ప్రతి రోజు టార్గెట్‌లను నిర్దేశించాలన్నారు. బిఎల్ఒలతో ఇంటింటికి వెళ్లి ప్రత్యేకంగా పరిశీలించాలన్నారు. ఈ సమావేశంలో జిహెచ్ఎంసి మల్కాజిగిరి డిప్యూటి కమిషనర్ జకీరా సుల్తానా, మల్కాజిగిరి ఆర్డీఓ శ్యాంప్రకాష్, మల్కాజిగిరి తహసీల్దార్ సీతారాం తదితరులు పాల్గొన్నారు.

## చిక్కడపల్లిలో యువకుడి మిస్సింగ్.. ఆచూకీ కోసం పోలీసులు గాలింపు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువకుడు అనుమానాస్పదం గా కనిపించకుండా పోయిన ఘటన కలకలం రేపుతోం ది. వివేక్‌నగర్‌కు చెందిన కె. వెంకటేశ్ (19) గత నెల 19 నుంచి అదృశ్యం అయినట్లు తండ్రి కె.అశోక్ ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు ప్రారంభించారు. వివరాలు ఇలా ఉన్నాయి..చిక్కడపల్లి, వివేక్‌నగర్‌కు చెందిన కే. వెంకటేశ్ ఇంటర్ పూర్తిచేశాడు. సోషల్ మీడియా ద్వారా ఓ యువతితో పరిచయం ఏర్పడిన నేపథ్యంలో కుటుంబంలో గతంలో మాటల తేడాలు వచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. 2025 డిసెంబర్ 19 ఉదయం ఇంట్లో జరిగిన వాగ్వాదం అనంతరం బయటకు వెళ్లిన వెంకటేశ్ తిరిగి ఇంటికి రాలేదని తెలిపారు. ఇప్పటికే బంధువులు, స్నేహితులు, పరిసర ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభించకపోవడంతో చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. యువకుడి సమాచారం తెలిసిన వారు చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ 04027853578 నెంబర్‌పై సంప్రదించాలని పోలీసులు కోరుతున్నారు.




## డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపుపై అమృత్ నగర్ తండావాసుల హర్షం

**కూకట్‌పల్లి / ప్రజాపక్షం :** ఫతేనగర్ డివిజన్ పరిధిలోని అమృత్ నగర్ తండా వాసుల 40ఏళ్ల కల నెరవేరబోతుంది. ఇక్కడ నివసిస్తున్న ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన కుటుంబాలకు పట్టాలు మంజూరు చేసి, కైతలాపూర్ సమీపంలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కేటాయించనున్నట్లు బుధవారం ప్రభుత్వం తెలియజేసింది. ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా గత నవంబర్‌లో కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, టిపిసిసి ఉపాధ్యక్షుడు బండి రమేష్ అమృత్ నగర్ తండాను సందర్శించారు. ఈ సందర్భంగా తండా వాసులు తాము 40ఏళ్లుగా ఇక్కడ నివసిస్తున్నప్పటికీ రోడ్లు, త్రాగునీరు వంటి కనీస మౌలిక సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. దీనికి స్పందించిన బండి రమేష్ ఈ సమస్యను రెవెన్యూ మంత్రి శ్రీనివాస్‌రెడ్డితో పాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యక్తిగత సలహాదారు వేం నరేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్ళారు. వారి ఆదేశాలతో ఉన్నతాధికారులు వెంటనే చర్యలు చేపట్టి తండావాసులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయింపును ప్రకటించారు. ఇళ్లల్లో అవసరమైన చిన్నపాటి మరమ్మత్తులు పూర్తయిన వెంటనే లబ్ధిదారులను అక్కడికి తరలించి, వారికి ధ్రువపత్రాలు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు. కేవలం రెండు నెలల్లోనే కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ బండి రమేష్ తమ సమస్యకు పరిష్కారం చూపడంపై తండావాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏ బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, ఫతేనగర్ డివిజన్ ప్రెసిడెంట్ కుక్కల రమేష్, నాయకులు హమీద్, శివ చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

## మార్చినాటికి డ్వాక్రా భవనాలు పూర్తి

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** వచ్చే మార్చినాటికి డ్వాక్రా భవనాల నిర్మాణాలను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. గురువారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన మొదటి ఏడాదిలోనే షాద్‌నగర్ నియోజకవర్గానికి 20డ్వాక్రా భవనాలను మంజూరు చేయించడం జరిగిందని, వాటి నిర్మాణాలు సైతం కొనసాగుతున్నాయని వివరించారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్య, నేతలు బస్వం, సర్వర్‌పాషా, పురుషోత్తంరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ సీతారాములు పాల్గొన్నారు.

## కాలనీల సమస్యల పరిష్కారానికి కృషి

బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** కాలనీల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పేర్కొన్నారు. గురువారం డివిజన్‌లోని బిఎన్‌రెడ్డి నగర్ ఫేజ్‌లో 53 లక్షల వ్యయంతో మంజూరైన స్టామ్ వాటర్ డ్రైన్ అభివృద్ధి పనులను కాలనీ వాసులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం ఈఈ నాగేందర్ గౌడ్, డీఈ కనకయ్య, ఏఈ మల్లికార్జున్ గౌడ్, కాలనీ అధ్యక్షులు పురుషోత్తంరెడ్డి దేవి పోచయ్య ఆలయం చైర్మన్ ప్రదీప్‌రెడ్డి, హరిహరపురం కాలనీ అధ్యక్షులు శంకరయ్య గౌడ్, ఉపాధ్యక్షులు రాములు, ధనరాజ్, రవి కిరణ్, నవీన్ కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## డివిజన్ అభివృద్ధికి సహకరించండి

కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి



**ప్రజాపక్షం/హయత్ నగర్:** మన్సూరాబాద్ డివిజన్‌కి సహకరించాలని కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. గురువారం సరూర్‌నగర్ లోని సర్కిల్ కార్యాలయంలో డివిజన్ అభివృద్ధికి నిధులు, పెండింగ్ పనులపై అధికారులతో చర్చించారు ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ మన్సూరాబాద్ డివిజన్ పరిధిలో ప్రజలకు మౌలిక సదుపాయాలు మరింత మెరుగుపరచడమే లక్ష్యంగా చేపట్టబోయే అభివృద్ధి పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయని తెలిపారు. సమావేశంలో ఇంజనీరింగ్ శాఖ ఇఇ నరేందర్, డిఇ కనకయ్య, ఎఇ వినీల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి నిధుల మంజూరుకు వినతి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** ఎల్‌బి నగర్ సర్కిల్, హస్తినాపురం, బైరమల్ గూడా వార్డు కార్యాలయాల నిర్మాణానికి నిధులు మంజూరుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిహెచ్‌ఎంసి కమిషనర్‌కు మేయర్ గద్వాల విజయలక్ష్మీ కోరినట్లు జిహెచ్‌ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ తెలిపారు. గురువారం మేయర్‌ను ప్రధాన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. హస్తినాపురం డివిజన్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని సుజాత నాయక్ అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

## గురుకుల పాఠశాలలో ప్రవేశాలు



**ప్రజాపక్షం/యాచారం :** గురుకుల పాఠశాలలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సాంఘిక సంక్షేమ గురుకుల సంస్థ జాయింట్ సెక్రటరీ సక్రునాయక్, స్టైట్ అధికారి కె.నిర్మల అన్నారు. గురువారం మండల పరిధిలోని తాడిపర్తి గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు. గురుకుల పాఠశాలల్లో అడ్మిషన్లు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నల్లకంచె ప్రిన్సిపాల్ లీలావతి, కందుకూర్ ప్రిన్సిపాల్ బి.రామయ్య, శంషాబాద్ ప్రిన్సిపాల్ పి.నాగేశ్వర్‌రావు, ఇబ్రహీంపట్నం వైస్ ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్, సీనియర్ ఫ్యాకల్టీ కుక్కుడు యాదయ్య, హసీన్, రమేష్, సైదులు, పాండునాయక్, గ్రామ సర్పంచ్ నీలం జాన్సీ, ఉప సర్పంచ్ రమేష్, నంది వనపర్తి సర్పంచ్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి

షాద్‌నగర్ జోన్ డిసిపి సిహెచ్ శిరీష



**ప్రజాపక్షం/కేశంపేట:** పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించేందుకు కృషి చేయాలని షాద్‌నగర్ జోన్ డిసిపి సిహెచ్ శిరీష అన్నారు. గురువారం షాద్‌నగర్ ఎసిపి లక్ష్మీ నారాయణతో కలిసి కేశంపేట పోలీస్ స్టేషన్‌ను డిసిపి శిరీష తనిఖీ చేశారు. కేశంపేట పోలీస్ స్టేషన్‌లో ఉన్న రికార్డులను పరిశీలించడంతోపాటు శాంతి భద్రతల పరిస్థితులపై తగిన సూచనలు, సలహాలు చేశారు. తనిఖీల్లో కేశంపేట సిఐ నరహరితోపాటు పోలీస్ సిబ్బంది ఉన్నారు. దొంగతనం కేసును త్వరగా చేదించినందుకు పోలీస్ సిబ్బంది సిసి కిరణ్‌కుమార్, ఎస్‌సిఓ మల్లేశంలకు డిసిపి శిరీష క్యాష్ రివార్డు అందజేశారు. సిఐ నరహరితోపాటు సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

### గ్రేటర్ హైదరాబాద్ అభివృద్ధిపై

# సిఎం ప్రత్యేక దృష్టి



మంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రేటర్ హైదరాబాద్‌లో పౌర సదుపాయాల అభివృద్ధికి సిఎం అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని హైదరాబాద్ ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 45లో రూ.3.10 కోట్లతో అభివృద్ధి చేసిన జిహెచ్‌ఎంసి చిల్డ్రన్ ప్లే పార్క్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ పాల్గొన్నారు. ఒక ఎకరా 40 గుంటల విస్తీర్ణంలో అభివృద్ధి చేసిన ఈ పార్క్‌లో వాకింగ్ ట్రాక్, యోగా స్థలం, టెన్నిస్ కోర్టు, 10లక్షల లీటర్ల వర్షపు నీటి నిల్వ వ్యవస్థ ఏర్పాటు చేశారు. ఈ పార్క్ ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం కల్పిస్తుందని మంత్రి తెలిపారు.

### కేంద్రీకృత జల నిర్వహణతోనే

## హైదరాబాద్‌కు జల భద్రత

జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలో వరదలు, మురుగు నీటి సమస్యల పరిష్కారానికి వికేంద్రీకృత జల నిర్వహణ ఒక్కటే మార్గమని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ స్పష్టం చేశారు. ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ (ఐజిబిసి)తో కలిసి నిర్వహించిన స్టేక్‌హోల్డర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన సముదాయాలు కేవలం నీటిని వినియోగించడమే కాకుండా, నీటి ఉత్పత్తి, పునర్వినియోగ కేంద్రాలుగా మారాలని సూచించారు. వికేంద్రీకృత పద్ధతిలో నీటిని నిల్వ చేయడం వల్ల భారీ వర్షాల సమయంలో డ్రెయిన్లపై భారం తగ్గి, వరద ముప్పు తప్పుతుందని తెలిపారు. డెవలపర్లు, ఆర్డబ్ల్యుఏలు పరిశ్రమలు సమిష్టిగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఐజిబిసితో కలిసి మరిన్ని శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి, స్టేక్‌హోల్డర్స్ సూచనలను విధానపరమైన నిర్ణయాలుగా మారుస్తామని అదనపు కమిషనర్ అనురాగ్ జయంతి తెలిపారు.




## పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం

అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** భూభారతి పెండింగ్ దరఖాస్తులను వెంటనే క్లియర్ చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.చంద్రారెడ్డి అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మొయినాబాద్ మండలానికి సంబంధించిన భూభారతి పెండెన్సీ క్లియర్ చేయాలని, మీసేవ ఎస్‌ఎల్‌ఏ గడువు దాటిన పెండింగ్ కేసులు, ఎఫ్ లైన్ పిటిషన్లు క్లియర్ చేయాలని తెలిపారు. ప్రభుత్వ భూములను రక్షించాలని, ప్రజల అవసరాలను తీర్చడానికి సిబ్బంది అందుబాటులో ఉండాలని, సిబ్బందికి కేటాయించిన పనులను సకాలంలో పూర్తి చేసే విధంగా చూడాలన్నారు.

## గచ్చిబౌలిలో 2500 గజాల పార్క్‌ను కాపాడిన హైడ్రా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్‌లో ఆక్రమణలపై హైడ్రా అధికారులు చర్యలు చేపట్టారు. గచ్చిబౌలి టెలికాం నగర్‌లో 2500 గజాల పార్క్ స్థలాన్ని కాపాడగా, శామీర్‌పేటలో 15 ఏళ్లుగా మూసివేసిన రోడ్డును తెరిపించారు. 1982 నాటి లేఔట్ ప్రకారం పార్క్ కోసం కేటాయించిన భూమిలో ఆక్రమణలు జరగడంతో హైడ్రా వాటిని తొలగించి ఫెన్సింగ్, బోర్డులు ఏర్పాటు చేసింది. శామీర్‌పేట ఫ్రెండ్స్ కాలనీలో 20 అడుగుల రోడ్డును ఆక్రమించిన గోడలు, గేట్లను తొలగించి ప్రజలకు మార్గం చూపింది. హైడ్రా ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులతో వేగంగా స్పందించిందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

### సర్వే నెంబర్ 66లోని 6.12 ఎకరాలు ప్రభుత్వ భూమే

### స్పష్టం చేసిన హైడ్రా..ఆక్రమణలపై కేసులు నమోదు

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ మండలం కాచవాని సింగారం గ్రామంలోని సర్వే నెంబర్ 66లో ఉన్న 6.12 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించిన ఘటనపై హైడ్రా కఠిన చర్యలు తీసుకుంది. ఈ భూమిని తమదిగా చూపిస్తూ మోసపూరితంగా అమ్మకాలు జరిపిన నల్లమల్లారెడ్డి, మలిపెద్ది హనుమంతరెడ్డి కుటుంబ సభ్యులపై మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ భూమిలో అక్రమంగా ప్లాట్లు విక్రయించడంతో పాటు 3 ఎకరాల్లో మామిడి తోట వేసినట్లు గుర్తించారు. ప్రైవేటు సర్వే నెంబర్లు (62, 63) చూపిస్తూ సర్వే నెంబర్ 66లోని ప్రభుత్వ భూమిలో 50 ప్లాట్లను అమాయకులకు విక్రయించారని అధికారులు తెలిపారు. బాధితులను ముందు పెట్టి హైడ్రాను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని అధికారులు స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో నల్లమల్లారెడ్డి, హనుమంతరెడ్డి కుటుంబ సభ్యులపై కేసులు నమోదు చేశారు. ప్రభుత్వ భూమిని కాపాడుతూ హైడ్రా ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. బాధితులకు ప్రత్యామ్నాయం చూపాల్సిన బాధ్యత ఆక్రమణదారులదేనని హైడ్రా స్పష్టం చేసింది.




## మున్సి'పోల్'లో కలిసొచ్చే పార్టీలతో కలిసి పోటీ

సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** మున్సిపల్ ఎన్నికలలో కలిసివచ్చే ,వామపక్ష లౌకిక పార్టీలతో కలిసి పోటీ చేస్తామని సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య తెలిపారు. గురువారం పార్టీ ముఖ్య నాయకుల సమావేశం చేవెళ్లలోని పార్టీ కార్యాలయంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు రామస్వామి అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి పాలమాకుల జంగయ్య హాజరై మాట్లాడుతూ రాబోయే మున్సిపల్ ఎన్నికలలో చేవెళ్ల, మొయినాబాద్ శంకర్‌పల్లి, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలలో సిపిఐతో కలిసి వచ్చే లౌకిక వామపక్ష పార్టీలతో పోటీలో ఉంటుందన్నారు. చేవెళ్ల మున్సిపాలిటీలో 4 వార్డులు, మొయినాబాద్ మున్సిపాలిటీలో 3 వార్డులు, శంకర్‌పల్లి మున్సిపాలిటీలో 3వార్డులు, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో 2 వార్డులలో సిపిఐ పోటీలో ఉంటుందని తెలిపారు. నిరంతరం ప్రజాపోరాటాలు కార్మిక పోరాటాలలో ముందుండే సిపిఐకి ప్రజల అండదండలు ఉన్నాయని, ప్రజాపోరాటాలే పార్టీకి బలం అని తెలిపారు. కార్యక్రమంలో ఎఐకెఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ప్రభులింగం జిల్లా కార్యవర్గ సభ్యుడు వడ్ల సత్యనారాయణ, చేవెళ్ల మండల కార్యదర్శి ఎం.సత్తిరెడ్డి, శంకర్‌పల్లి మండల కార్యదర్శి సుధీర్, ఇన్సాబ్ జిల్లా అధ్యక్షుడు ఎండి మక్బూల్, బికెఎంయు జిల్లా అధ్యక్షుడు అంజయ్య, పార్టీ సీనియర్ నాయకుడు డాక్టర్ శౌరీ, శివ, పాపయ్య పెంటయ్య పాల్గొన్నారు.

## కష్టపడి..ఇష్టంగా చదవాలి

**ప్రజాపక్షం/తుర్కయంజాల్:** ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో కష్టపడి ఇష్టంగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించి, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని దేవరపల్లి భాగ్యమ్మ, శిగ జంగమ్మ అన్నారు. ఆదిభట్ల సర్కిల్ కొంగరకలాన్ వాసులైన శిగ విజయలక్ష్మి వీరస్వామిగౌడ్ కుమారుని శివ గౌడ్ జన్మదినం పురస్కరించుకొని గురువారం కొంగరకలాన్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడి పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిల్, వాటర్ బాటిల్స్‌ను పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు కృష్ణ, శిగ విజయలక్ష్మి వీరస్వామి గౌడ్‌లతో కలసి దేవరపల్లి భాగ్యమ్మ, శిగ జంగమ్మ అందజేశారు. కార్యక్రమంలో ఉడతల వీరస్వామి గౌడ్, ఉడుగుల ప్రభాకర్‌గౌడ్, శ్రీకాంత్ ముదిరాజ్, నిరంజన్ గౌడ్, మధుసూదన్‌గౌడ్, రాజుగౌడ్, నరసింహగౌడ్, గణేష్‌గౌడ్, రాజుగౌడ్ పాల్గొన్నారు



## క్రీడలతో మానసిక, శారీరక ఆరోగ్యం

**ప్రజాపక్షం/అబ్దుల్లాపూర్మెట్:** క్రీడలతో మానసిక, శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుందని బాటసింగారం గ్రామ సర్పంచ్ ఎర్రవెల్లి గౌరీ శంకరాచారి అన్నారు. అబ్దుల్లాపూర్ మెట్టు మండలం బాటసింగారం గ్రామ పంచాయతీ పరిధిలోని నేతాజీ విగ్రహం సమీపంలోని క్రీడామైదానం వద్ద క్రీడా పోటీలు ప్రారంభించారు. అథ్లెటిక్స్,కబడ్డీ, వాలీబాల్,ఖోఖో, ఫుట్బాల్, యోగా క్రీడలు ప్రారంభించారు. కార్యక్రమానికి సర్పంచ్ గౌరీ శంకరాచారి హాజరై మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో ఉన్న క్రీడాకారులలో ప్రతిభను వెలుగులోకి తీసుకురావడానికి ఈ క్రీడలు ఉపయోగపడతాయని తెలిపారు. గ్రామంలోని రిజిస్ట్రేషన్ చేసుకున్న క్రీడాకారులు 102 మంది పాల్గొన్నారు. పాల్గొన్న క్రీడాకారులకు ప్రశంసపత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ దాసరి ప్రతాప్, ప్రధానోపాధ్యాయుడు, సోలా పోగుల స్వాములు, ఫీజికల్ డైరెక్టర్ నార్లకొండ వెంకటేష్, గడ్డం రమేష్, ఎండీ పాషా, మోడపు వినోద్ కుమార్, మోదీపు శ్యామల కృష్ణ, నేరేడు క్రాంతికుమార్, సీతయ్య చారి, చెంచుల నెహ్రూ, చంచల మమతా సంజీవ, శ్రీశైలం, నేతాజీ యువజన సంఘం ప్రెసిడెంట్ కొండోజు హరిప్రసాద్, ఉప ప్రెసిడెంట్ మోడపు గణేష్ పాల్గొన్నారు.

## మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో మౌలిక వసతులు

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ విద్యాసంస్థలలో ప్రభుత్వం పూర్తి స్థాయి మౌలిక వసతులు కల్పిస్తుందని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి పేర్కొన్నారు. మైనారిటీ రెసిడెన్షియల్ విద్యాసంస్థలలో విద్య ను అభ్యసించేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు నమోదుకు గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో డిఎండబ్ల్యూఒ.కెనవీన్‌రెడ్డి, రీజినల్ లెవల్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వెబ్‌సైట్‌ను ప్రారంబించి కలెక్టర్ మాట్లాడారు. టిజిఎంఆర్ ఇఐఎస్ పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశానికి ఆసక్తి కలిగిన విద్యార్థులు ఐదవ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు తమ పేర్లను వెబ్ సైట్ :tgmreistelangana. cgg. gov. Inలో నమోదు చేసుకోవాలని తెలిపారు. అన్ని ఆధునిక మౌలిక వసతులతో పాటు ఐఐటి, జెఇఇ, నీట్, ఎంసెట్, క్లాట్, యుపిఎస్‌సి, ఎన్‌డిఎ వంటి పరీక్షలకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారని తెలిపారు.ఈ అవకాశాన్ని మైనారిటీ, మైనార్టీయేతర విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలనికలెక్టర్ సూచించారు. కార్యక్రమం పాఠశాల, కళాశాలల ప్రిన్సిపాల్స్ పోలోజు బాలరాజు, జ్యోతి రెడ్డి, పకీర, వజ్రమ్మ, చందర్ రెడ్డి, నిర్మల, శ్రీనివాస్, వనిత, రజిని, అనూష, పియాంక, తదితర అధికారులు, ఉపాధ్యాయులు, పేరెంట్స్ పాల్గొన్నారు.



# త్వరితగతిన డబల్ బెడ్‌రూం ఇండ్లు పూర్తి

రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వి.పి.గౌతమ్



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ఔటర్ రింగ్ రోడ్ (ఒఆర్‌ఆర్) సమీపంలోని పలు ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న డబల్ బెడ్ రూమ్ ఇండ్లను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వి.పి.గౌతమ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయా కాలనీల్లో మౌలిక సదుపాయాలతో పాటు, పాఠశాల, వైద్య సదుపాయాలతో పాటు పార్కుల వంటివి కూడా ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు.కాలనీల్లోని వారు జీవనప్రమాణాలతో నివసించేందుకు వీలుగా అవసరమైన అన్ని రకాలుగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. గురవారం జిహెచ్‌ఎంసి పరిధిలోని పేదల కోసం రంగారెడ్డి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నిర్మిస్తున్న ఇండ్ల పనులను స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. కర్మన్‌ఘాట్ నందనవనం కాలనీ, మల్లాపూర్, కుర్మలగూడ, బాట సింగారం, అబ్దుల్లాపూర్ మెట్ తదితర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ఆయాప్రాజెక్ట్‌లలోని మౌలిక వసతులకల్పన పనులను, ఇండ్ల నిర్మాణాలను సమాంతరంగా చేపట్టాలని, వచ్చే రెండునెలల కాలంలో లబ్దిదారులకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తొలుత కర్మన్‌ఘాట్ నందనవనం కాలనీలో పునరావాసంలో భాగంగా నిర్మించిన 2 బిహెచ్‌కె 80(2బ్లాక్‌లను) ఫ్లాట్స్‌ను ఎండి పరిశీలించారు. దాదాపు పూర్తి అయిన వీటిని వారం రోజుల్లో లాటరీ ద్వారా పారదర్శకంగా లబ్ధిదారులకు అంద చేయాలని స్థానిక రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మౌలిక సదుపాయల పనులు వెంటనే పూర్తి చేయాలని ఇంజనీరింగ్ విభాగానికి, కాంట్రాక్టర్లకు స్పష్టంచేశారు. మల్లాపూర్‌లో నిర్మాణంలో ఉన్న 17 బ్లాక్‌లలో పనులను సమీక్షించారు. ఈ ప్రాజెక్ట్‌లోని భూమలు కబ్జా కాకుండా చర్యలు చేపట్టాలని, హైడ్రా అధికారులను సహాయం తీసుకోవాలని తహసీల్దార్‌ని ఆదేశించారు. ఇక్కడి ప్రాజెక్టు సైట్ ఆఫీసులో పనుల తీరుపై నిశితంగా సమీక్ష జరిపి, కాలనీకి వీలైనంత త్వరగా మంచినీటి, విద్యుత్ కనెక్షన్లను మంజూరు చేయించుకోవాలని సూచించారు. సెప్టెంబరు నాటికల్లా అన్ని పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. మహేశ్వరం నియోజకవర్గం కుర్మల్ గూడలో 1536 ఫ్లాట్స్ పనులను పరిశీలించి, విద్యుత్, మంచి నీరు, డ్రైనేజీ, రోడ్ల పనులును మార్చి నాటికల్లా పూర్తి చేయాలన్నారు. బాటసింగారంలో ని 20 బ్లాక్‌ల నిర్మాణాలను చూసి పనులను వేగవంతంగా చేయాలని, పాఠశాల, హెల్త్ సెంటర్, నిత్యావసర దుకాణాలు, మొదలైనవి కూడా నిర్మించాలని కాంట్రాక్టరకు, వీటిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అధికారులను ఎండి గౌతం ఆదేశించారు. సమీపంలోని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణపు పనులను ఆయన తనిఖీ చేసి, లబ్ధిదారులతో మాట్లాడారు. అబ్దుల్లాపూర్ మెట్‌లో ఇప్పటికే పూర్తి అయిపోయి లబ్ధిదారులు నివాసముంటున్న 2 బిహెకె కాలనీని సందర్శించి స్థానికులతో మాట్లాడారు. ఈ కాలనీలో ఇండ్లు కేటాయించిన లబ్దిదారుల్లో అనేక మంది పలుకారాణాలు చూపుతూ ఇక్కడ నివాసం ఉండటం లేదన్న విషయాన్ని గమనించి, ఇక్కడ కేటాయించిన ఇండ్లలో లబ్ధిదారులు నివాసముండాలని లేనిచో తగుచర్యలు తీసుకుంటామన్నారు. నిత్యావసరాల కోసం చాలా దూరం వెళ్లాల్సి వస్తున్నదనీ, బస్టాప్ లేకపోవడంతో చాలా దూరం నుంచి రాకపోకలు సాగించాల్సి వస్తున్నదని స్థానికులు ఎండి దృష్టికి తీసుకునివచ్చారు. దీనిపై స్పందించి కాలనీలోని కిరాణా షాపులను తెరిపించే ఏర్పాట్లు చేస్తామని, ఆర్టీసీ ఉన్నతాధికారులతో బస్టాప్ విషయంలో మాట్లాడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమాల్లో హౌసింగ్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు ఎం.చైతన్యకుమార్, పి.బలరాం, జి.విజయకుమార్, జిహెచ్‌ఎంసి అధికారులు పి.వి.రవీందర్ తోపాటు ఆయా మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

# ప్రిక్వార్టర్స్‌కు సింధు, శ్రీకాంత్

## ప్రణయ్, జార్జి నిష్క్రమణ



**జకర్తా:** ఇండోనేషియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో తెలుగు షట్లర్లు పివి సింధు, కిడాంబి శ్రీకాంత్ తొలి రౌండ్ విఘ్నాలను దాటి ప్రిక్వార్టర్స్‌కు చేరుకున్నారు. ఇటీవలే ముగిసిన ఇండియా ఓపెన్‌లో నిరాశపరిచిన సింధు.. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో 22–20, 21–18తో ఐదో సీడ్ మనామి సుయిజు (జపాన్)పై గెలిచింది. పురుషుల సింగిల్స్లో శ్రీకాంత్.. 21–15, 21–23, 24–22తో కొకి వతనబె (జపాన్)తో జరిగిన హోరాహోరీ పోరులో విజయం సాధించాడు.
లక్ష్యసేన్.. 21–13, 16–21, 21–14తో వాంగ్ జు వీ (తైవాన్)ను మట్టికరిపించాడు. కానీ సీనియర్ షట్లర్లు కిరణ్ జార్జి 17–21, 14–21తో ఉబైదుల్లా (ఇండోనేషియా) చేతిలో ఓడగా, హెచ్‌ఎస్ ప్రణయ్ 19–21, 11–21తో లీ జి జియా (మలేషియా) కు తలవంచాడు. మహిళల సింగిల్స్‌లో సింధుతో పాటు అన్‌మోల్ ముందంజ వేయగా తన్వి శర్మ, ఆకర్షి కశ్యప్ తొలి రౌండ్‌కే ఇంటిబాట పట్టారు.

# వరల్డ్ కప్‌లో ఆడేందుకు ఇండియా వెళ్లడం లేదు: బంగ్లాదేశ్



**ఢాకా:** టి–20 వరల్డ్ కప్ వేదికలను మార్చడానికి ఐసిసి నిరాకరించడంతో.. ఆ టోర్నీను బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు బహిష్కరించింది. ఫిబ్రవరి 7వ తేదీ నుంచి ప్రారంభం కానున్న వరల్డ్ కప్‌లో ఆడేందుకు ఇండియా వెళ్లడం లేదని బంగ్లా క్రికెట్ బోర్డు పేర్కొన్నది. గురువారం ఢాకాలో క్రికెట్ బోర్డు, జాతీయ క్రికెటర్లు, క్రీడామంత్రి ఆసిఫ్ నజ్రుల్ మధ్య జరిగిన చర్చల అనంతరం ఈ నిర్ణయాన్ని వెల్లడించారు. ఆటగాళ్ల భద్రతకు సమస్య లేదని ఐసిసి పేర్కొన్నా .. ఇండియాలో ట్రావెల్ చేసేందుకు బిసిబి నిరాకరిస్తున్నది. ఇటీవల బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు పెరగడంతో.. ఐపిఎల్లో ఆడుతున్న ముస్తఫిజుర్ను తొలగిస్తూ బిసిసిఐ నిర్ణయం తీసుకున్నది. ఆ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బంగ్లా క్రికెటర్లు ఇండియాలో పర్యటించేందుకు నిరాకరిస్తున్న విషయం తెలిసిందే. వేదికల మార్పు విషయంలో ఐసిసి తీసుకున్న నిర్ణయాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని నజ్రుల్ పేర్కొన్నారు. ఇండియాకు వెళ్లవద్దు అని తమ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు ఆయన చెప్పారు. అయితే తమ మ్యాచ్‌లను శ్రీలంకలో ఆడేందుకు తమకు ఐసిసి అవకాశం ఇస్తుందని ఆశిస్తున్నామని ఆయన అన్నారు. వరల్డ్ కప్‌లో భాగంగా బంగ్లాదేశ్ జట్టు ఇండియాలో నాలుగు మ్యాచ్‌లు ఆడాల్సి ఉన్నది. మూడు కోలకత్తాలో, ఒకటి ముంబై వేదికగా ఆ మ్యాచ్‌లు షెడ్యూల్లో ఉన్నాయి. ఒకవేళ బంగ్లా రాకపోతే ఆ జట్టు స్థానంలో స్కాట్ల్యాండ్ ఆడే అవకాశాలు ఉన్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

### జాతీయ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో

# సత్తాచాటిన తెలంగాణ ప్లేయర్లు




గువాహటి వేదికగా జరిగిన జాతీయ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో తెలంగాణ కరాటే ప్లేయర్లు సత్తాచాటారు. ఈనెల 16 నుంచి 19వ తేదీ వరకు జరిగిన టోర్నీలో తెలంగాణ టీమ్ మొత్తం 34 పతకాలు సొంతం చేసుకుంది. ఇందులో 12 స్వర్ణాలు సహా 13 రజతాలు, 9 కాంస్య పతకాలు ఉన్నాయి. తెలంగాణ ప్లేయర్లు కాటా, కుమిటే వ్యక్తిగత, టీమ్ ఈవెంట్లలో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించారు. అండర్10, 12, 14, 18 వయసు విభాగాల్లో యువ ప్లేయర్లు ప్రతిభ చాటగా, సీనియర్లు ఆకట్టుకున్నారు.

# రోహిత్‌కు డాక్టరేట్



**పుణె:** టీమ్ ఇండియా స్టార్ క్రికెటర్ రోహిత్‌శర్మకు గౌరవ డాక్టరేట్ హోదా దక్కింది. తన నాయకత్వ శైలికి తోడు క్రికెట్‌కు చేసిన అసమాన సేవలకు గుర్తింపుగా అజింక్యా డివై పాటిల్ యూనివర్సిటీ.. రోహిత్‌కు డాక్టరేట్‌తో సత్కరించింది. బుధవారం జరిగిన కాన్వకేషన్ కార్యక్రమంలో హిట్‌మ్యాన్‌కు ఈ పట్టాను ప్రదానం చేసింది. 'క్రికెట్‌లో అభిమానులందరికీ రోహిత్..హిట్‌మ్యాన్‌గా పరిచయం. కానీ అతని కెరీర్లో డాక్టరేట్ సరికొత్త మైలురాయిగా నిలుస్తుంది' అని యూనివర్సిటీ ఒక ప్రకటనలో పేర్కొంది.

# కీళ్ల నొప్పులు సామాన్యం..



వృద్ధాప్యంలో చాలా మంది ఎదుర్కొనే సాధారణ ఆరోగ్య సమస్యల్లో కీళ్ల (రుమాటిక్) నొప్పులు ఒక ముఖ్యమైనవి. మోకాళ్లు, నడుము, మెడ, భుజా లు, వేళ్ల వంటి సంధుల్లో వచ్చే ఈ నొప్పులు క్రమంగా రోజువారీ జీవనాన్ని ప్రభావితం చేస్తాయి. వయస్సు పెరిగే కొద్దీ శరీరంలో జరిగే మార్పులు, జీవనశైలి, పోషక లోపాలు కలిసి ఈ సమస్యను మరింత తీవ్రతరం చేస్తాయి. రుమాటిక్ నొప్పులను సకాలంలో అర్థం చేసుకుని సరైన జాగ్రత్తలు తీసుకుంటే, సౌకర్యవంతమైన జీవితం గడపగలగడం సాధ్యమే.కీళ్ల నొప్పులు అనేవి ప్రధానంగా సంధులు, కండరాలు, నరాల వ్యవస్థను ప్రభావితం చేసే నొప్పుల సమాహారం. ఇవి ఒక్కసారిగా రావచ్చు లేదా సంవత్సరాల పాటు మెల్లగా పెరుగుతూ ఉండవచ్చు. కొంత మందిలో ఉదయం లేవగానే కాళ్లు చేతులు గట్టిగా ఉండటం, కదలడానికి ఇబ్బంది కలగడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. మరికొందరిలో వాతావరణ మార్పులతో నొప్పులు ఎక్కువవుతుంటాయి. రుమాటిక్ పెయిన్స్‌కు ప్రధాన కారణాల్లో వయస్సు పెరగడం ఒకటి. కాలక్రమంలో సంధుల్లో ఉండే కార్టిలేజ్ అరిగిపోవడం వల్ల ఎముకలు ఒకదానికొకటి రాయడం మొదలవుతుంది. దీని వల్ల నొప్పి, వాపు ఏర్పడతాయి. హార్మోన్ల మార్పులు కూడా ముఖ్యపాత్ర పోషిస్తాయి. ముఖ్యంగా మహిళల్లో మెనోపాజ్ తర్వాత ఎముకల సాంద్రత తగ్గిపోవడం వల్ల నొప్పులు పెరుగుతాయి. కాగా, శరీరంలో దీర్ఘకాలిక వాపు ఉండటం మరో కారణం. రుమాటాయిడ్ ఆర్థ్రైటిస్ వంటి వ్యాధుల్లో శరీర రోగ నిరోధక వ్యవస్థనే సంధులను దెబ్బతీస్తుంది. దీర్ఘకాలం శారీరక శ్రమ లేకపోవడం, అధిక బరువు, పాత గాయా లు, పోషకాహార లోపాలు కూడా రుమాటిక్ నొప్పులకు దారితీస్తాయి. చలికాలం, తేమ ఎక్కువగా ఉండే వాతావరణం ఈ నొప్పులను మరింత తీవ్రతరం చేస్తాయి.

**కనిపించే లక్షణాలు...** వృద్ధుల్లో సాధారణంగా ఉదయం లేవగానే సంధులు కదలకపోవడం, కొంతసేపటికి కదలిక సులభమవడం కనిపిస్తుంది. మోకాళ్లలో నొప్పి వల్ల నడవడంలో ఇబ్బంది, మెట్లు ఎక్కడం దిగడం కష్టంగా అనిపించడం సాధారణం. వేళ్ల సంధుల్లో వాపు, పట్టుదల తగ్గిపోవడం, కొన్నిసార్లు స్వల్ప జ్వరం, అలసట కూడా తోడవుతాయి. నొప్పి ఎక్కువగా ఉన్నప్పుడు నిద్ర భంగం కావడం వల్ల మానసిక ఒత్తిడి పెరుగుతుంది.

**ఉపశమన మార్గాలు...** రుమాటిక్ నొప్పులను పూర్తిగా నివారించడం సాధ్యంకాకపోయినా, సరైన జీవనశైలి ద్వారా వాటి తీవ్రతను తగ్గించుకోవచ్చు. రోజూ తేలికపాటి వ్యాయామం చేయడం చాలా ముఖ్యం. నడక, యోగా, నీటిలో చేసే వ్యాయామాలు సంధులపై ఒత్తిడి తగ్గించి కదలిక ను మెరుగుపరుస్తాయి. దీర్ఘకాలం ఒకే స్థితిలో కూర్చోవడం లేదా నిలబడడం తప్పించాలి. చల్లని వాతావరణంలో మోచేతులు, మోకాళ్లు, చేతివేళ్లను వెచ్చగా ఉంచుకోవడం అవసరం. నొప్పి ఉన్న ప్రాంతాల్లో వేడి నీటి కాపు లేదా గోరువెచ్చని నూనెతో మర్దన ఉపశమనాన్ని ఇస్తుంది. బరువును నియంత్రించడం కూడా ముఖ్యం. అధిక బరువు మోకాళ్లు, నడుముపై అదనపు ఒత్తిడిని పెంచుతుంది. అవసరమైతే వైద్యుల సలహాతో నొప్పి నివారణ మందులు, ఫిజియోథెరపీ తీసుకోవచ్చు.



**ఆహారం...** కీళ్ల నొప్పుల నియంత్రణలో ఆహారం కీలక పాత్ర పోషిస్తుంది. ఎముకలు, సంధులు బలంగా ఉండేందుకు కాల్షియం, విటమిన్ 'డి' అధికంగా ఉండే ఆహారం తీసుకోవాలి. పాలు, పెరుగు, నువ్వులు, ఆకుకూరలు, సూర్యకాంతి ఈ విషయంలో ఉపయోగపడతాయి. వాపును తగ్గిం చే ఆహారం కూడా ముఖ్యం. పసుపు, అల్లం వంటి సహజ పదార్థాలు శరీరంలోని వాపును తగ్గించడం లో సహాయపడతాయి. మూడు కొవ్వు ఆమ్లాలు ఉన్న ఆహారం సంధుల నొప్పిని తగ్గించడంలో ఉపయోగపడుతుంది. చేపలు, వాల్‌నట్స్, అవిసె గింజలు ఇందుకు ఉదాహరణ. అధిక చక్కెర, నూనె, ప్రాసెస్డ్ ఆహారాలను తగ్గించాలి. ఇవి శరీరంలో వాపును పెంచుతాయి. తగినంత నీరు తాగడం వల్ల సంధుల్లో తేమ నిలిచి కదలిక సులభమవుతుంది. కాగా, నొప్పితో కూడిన జీవితం వృద్ధుల్లో నిరాశను, ఒంటరితనాన్ని పెంచుతుంది. అందుకే మానసిక ఆరోగ్యాన్ని కూడా సమానంగా చూసుకోవాలి. కుటుంబ సభ్యులతో మాట్లాడటం, తేలికపాటి కార్యకలాపాల్లో పాల్గొనడం, ధ్యానం వంటి పద్ధతులు మనసుకు శాంతిని ఇస్తాయి.

**వైద్యుల సలహా తప్పనిసరి...** నొప్పులు రోజురోజుకూ పెరుగుతూ ఉంటే, సంధుల్లో తీవ్ర వాపు లేదా ఆకృతి మార్పులు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. స్వీయ మందులు వాడటం వల్ల సమస్య తీవ్రమయ్యే అవకాశం ఉంటుంది. సరైన నిర్ధారణతోనే సరైన చికిత్స సాధ్యమవుతుంది. వృద్ధుల్లో రుమాటిక్ నొప్పులు సాధారణమైనప్పటికీ నిర్లక్ష్యం చేయాల్సిన సమస్య కాదు. సరైన ఆహారం, నియమిత వ్యాయామం, జీవన శైలి మార్పులు, మానసిక ధైర్యం ఉంటే ఈ నొప్పులను చాలావరకు నియంత్రించవచ్చు. వృద్ధాప్యం నొప్పులతోనే కాకుండా, సౌకర్యంగా గడపడానికి ముందస్తు జాగ్రత్తలు అత్యంత అవసరం.

సీనియర్ సిటిజన్స్

## 82 ఏళ్ల వయసులో ఫిట్‌నెస్ కోసం వ్యాయామం

చెన్నైకు చెందిన 82 ఏళ్ల వృద్ధురాలు, వయస్సు అనేది ఆరోగ్యానికి అడ్డంకి కాదని నిరూపిస్తూ నేటితరానికి ఒక గొప్ప పాఠం చెబుతోంది. ఆమె పేరు కిరణ్ బాయి. చీర కట్టుకుని, చెప్పులు లేకుండా, ఇంటి ప్రాంగణంలోనే డెడ్‌లిఫ్ట్‌లు, స్క్వాట్లు చేస్తూ ఆమె సోషల్ మీడియాలో వైరల్ అయ్యారు. మనవడు చిరాగ్ చోర్డియా ఆమెతో కలిసి చేసిన వ్యాయామ వీడియోలను పంచుకోవడంతో, కిరణ్‌బాయి ఫిట్‌నెస్ ప్రేరణగా మారారు. 2020లో కిరణ్ బాయి మంచం మీద నుంచి పడడంతో తీవ్రంగా గాయపడ్డారు. కాళ్లకు బలమైన దెబ్బ తగిలింది. ఆ సమయంలో చాలామంది ఆమె ఇక విశ్రాంతి జీవితం గడపాల్సిందే అనుకున్నారు. ఆ సమయంలో ఆమె మనవడు చిరాగ్ చోర్డియా తనఅమ్మమ్మ దగ్గరకు వచ్చాడు. ఆమె జీవితాన్ని చురుకుగా మార్చాలన్న లక్ష్యంతో, ఇంట్లోనే ఒక చిన్న వ్యాయామ కేంద్రాన్ని ఏర్పాటు చేశాడు. ఆమె వయస్సు, ఆరోగ్య స్థితిని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేకంగా వ్యాయామ ప్రణాళికను రూపొందించాడు. వ్యాయామం వల్ల ఆమె కేవలం శారీరకంగా బలపడడమే కాదు, మానసికంగా కూడా ధైర్యం పొందారు. ఈరోజు కిరణ్ బాయి కేవలం అనామక వృద్ధురాలు కాదు... ఆమె ఒక స్ఫూర్తి.



# విద్యావ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్న పాలకులు

దేశ సమగ్రత, విద్యారంగ సమస్యలపై సమరశీల ఉద్యమాలు
ఎఐఎస్‌ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్‌ఎ.స్టాలిన్ పిలుపు
అట్టహాసంగా జరిగిన ఎఐఎస్‌ఎఫ్ ములుగు జిల్లా 2వ మహాసభలు




**ప్రజాపక్షం/ములుగు :** సమాజానికైనా అవసరమైన సామాజిక, ఆర్థిక, రాజకీయ నైతిక విజ్ఞానిక మానవీయ విలువలు ఇచ్చే సాధన విద్య అని, ఆ విద్యను నేటి పాలకులు భ్రష్టు పటిస్తున్నారని ఎఐఎస్‌ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్‌ఎ.స్టాలిన్ ఆరోపించారు. గురువారం ములుగు జిల్లా కేంద్రంలో ఎఐఎస్‌ఎఫ్ జిల్లా 2వ మహాసభలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ముందుగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణం నుంచి డిఎల్‌ఆర్ ఫంక్షన్ హాల్ వరకు విద్యార్థుల భారీ ప్రదర్శన నిర్వహించారు. మహాసభ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎఐఎస్‌ఎఫ్ శ్వేతారుణ పతకాన్ని స్టాలిన్ ఆవిష్కరించారు. అనంతరం నారా దిలీప్, అనుముల రాజ్‌కుమార్‌ల అధ్యక్షవర్గంగా జరిగిన ప్రతినిధుల మహాసభలో స్టాలిన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించకుండా కొత్త సమస్యలను సృష్టిస్తున్నాయని దుయ్యబట్టారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో పాలకులకు చిత్తశుద్ధి లేదన్నారు. ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసి పేద, మధ్య తరగతి వర్గాలకు విద్యను పూర్తిగా దూరం చేసే కుట్ర అమలు చేస్తున్నారన్నారు. దానిలో కేంద్రంలోని బిజెపి నూతన జాతీయ విద్యావిధానం పేరుతో విద్య కార్పొరేటీకరణ, విద్య కేంద్రీకరణ, కాషాయికరణ చూస్తుందని, విద్యారంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు స్వాగతం పలుకుతోందన్నారు. ములుగు జిల్లాలో ఉన్న గిరిజన యూనివర్సిటీకి నిధుల కేటాయింపులు పూర్తి స్థాయిలో జరగలేదని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాశాఖ మంత్రిని కూడా నియమించలేని దుస్థితిలో ఉందన్నారు. జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు కాలేదన్నారు. సమస్యల సుడిగుండంలో ప్రభుత్వ హాస్టళ్లు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ విద్యార్థులకు బకాయిలు చెల్లించకుండా ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా లక్షలాది మంది విద్యార్థులు మానసిక వేదనకు గురవుతున్నారన్నారు. నిధులు విడుదలపై ఉప ముఖ్యమంత్రి ఇచ్చి హామీకి కూడా గ్యారంటీ లేకపోవడం విద్యారంగంపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శమన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం బకాయిలు విడుదల చేసి విద్యార్థి లోకాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మహాసభలో ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోతుకు ప్రవీణ్, జిల్లా కార్యదర్శి కుమ్మరి సాగర్, నాయకులు నేరాళ్ళ జోసెఫ్, నారా దిలీప్, అనుముల రాజ్‌కుమార్, దుర్గం శివకుమార్, కుమ్మరి రంజిత్, కొండగోర్ల సాయి కుమార్, చెన్నూరి రామ్‌చరణ్, జాడి మహేష్, సునర్కని రణధీర్, చీల దేవేందర్, బోడ సాయి, కృష్ణ, రమ్య, సౌజన్య పాల్గొన్నారు.

## ర్యాలీలో పాల్గొన్న సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ నారాయణ

మేడారం సమ్మక్క సారలమ్మ సందర్శన, పర్యటనకు వెళుతున్న సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ నారాయణ జిల్లా కేంద్రంలో ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థుల ర్యాలీ ప్రదర్శనను చూసి ఆగి సందర్శించి మద్దతు పలికి విద్యార్థులతో మాట్లాడారు. ఆయన వెంట సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర నాయకులు విజయ సారధి, పంజాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దుచేయాల్సిందే



కాంట్రాక్టు ఏజెన్సీల ఎంప్లాయీస్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** కాంట్రాక్టు కార్మికులను, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఇలాంటి ఉద్యోగ భద్రత లేకుండా శ్రమ, ఆర్థిక దోపిడికి గురి చేసే కాంట్రాక్టు ఏజెన్సీల వ్యవస్థను రద్దు చేయాలని ఎంప్లాయిస్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఉమ్మడి జిల్లా కమిటీ నేతృత్వంలో రూపొందించిన 2026 నూతన సంవత్సర క్యాలెండర్లను గురువారం మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని యూనియన్ కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం ఆసుపత్రి వివిధ రంగాల కార్మికుల ఉమ్మడి సమావేశం నిర్వహించారు. ల్యాబ్ టెక్నీషియన్‌గా ఉద్యోగం సాధించిన మెడికల్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కేటేశ్వర్‌రెడ్డిని సత్కరించారు. ఈ సందర్భంగా సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యరంగంలో దశాబ్దాల తరబడి శానిటేషన్ పేషెంట్ కేర్ సెక్యూరిటీ సూపర్‌వైజర్ కార్మికులు థర్డ్ పార్టీ ఏజెన్సీల కింద ఎలాంటి ఉద్యోగ భద్రతలకు నోచుకోకుండా వైద్యరంగంలో ప్రాణాలకు తెగించి సేవలు అందిస్తున్నారన్నారు. ఏజెన్సీల విధానం ద్వారా కార్మికులకు జీతాల చెల్లింపుల్లో పారదర్శకత లేదని యూనియన్ పోరాటాలు బలంగా ఉన్నచోట మాత్రమే జీవోలు అమలవుతున్నాయన్నారు. కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.15 లక్షలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని, కాలవ్యవధి ముగిసిన ఏజెన్సీలను రద్దు చేసి తక్షణమే కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని, కార్మికులను పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్, కార్మికులు బి.చెన్నయ్య, దేవానంద్, రంగయ్య, శంకర్‌నాయక్, గోపాల్‌నాయక్, రాజు, అంజిలయ్య, మురళి, నైసన్, భీమయ్య, యాదయ్య, ఖాదర్, అశోక్, శ్రీనివాస్‌రెడ్డి, సత్యం, బాల్‌రాజ్, నరేష్, చిన్నయ్య, అంజి, పద్మమ్మ, లక్ష్మమ్మ, యాదమ్మ, మీనా, అలివేల, మమత, తిరుపతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# మోదీ పాలనలో పెరుగుతున్న నిరుద్యోగం

ఎఐవైఎఫ్ జాతీయ అధ్యక్షుడు రోషన్‌కుమార్ సిన్హా
ఎఐవైఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** దేశంలో ప్రధాని మోదీడీ బిజెపి పాలనలో నిరుద్యోగ తీవ్రత రోజు రోజుకు పెరుగుతుందని ఆలిండియా యూత్ ఫెడరేషన్ (ఎఐవైఎఫ్) జాతీయ అధ్యక్షుడు రోషన్ కుమార్ సిన్హా ఆరోపించారు. గురువారం ఎఐవైఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధులు, మహనీయుల ఫోటోలతో, నిరుద్యోగుల డిమాండ్స్‌తో రూపొందించిన 2026 క్యాలెండర్‌ను రోషన్‌కుమార్ సిన్హా, ఎఐవైఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి నానబాల రామకృష్ణ, జిల్లా నాయులు సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చింతల రమేష్ అధ్యక్షతన జరిగిన సభలో రోషన్‌కుమార్ సిన్హా మాట్లాడుతూ దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతి, ఉద్యోగ క్యాలెండర్‌ను అమలు చేసి నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆఫీస్ బేరర్ శ్రీమాన్, ఖమ్మంజిల్లా సహాయకార్యదర్శి మల్లెబోయిన ఉపేందర్, నాయకులు చిర్రా ఉపేందర్, దాసరి బన్ను, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# సిపిఐలోకి పలువురు యువకుల చేరిక



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** యువతతోనే దేశాభివృద్ధి ఆధారపడి ఉందని, సిపిఐలో చేరేందుకు యువత ముందుకు రావడం అభినందనీయమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం కార్పోరేషన్ పరిధిలోని 8వ డివిజన్(పాల్వంచ)కు చెందిన పలువురు యువకులు కూనంనేని, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా సమక్ష్యంలో గురువారం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జిల్లా సిపిఐ కార్యాలయం శేషగిరి భవన్‌లో వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీలో చేరిన యువత వారివారి ప్రాంతాల్లో సమస్యలపై అధ్యయనం చేసి వాటి పరిష్కారానికి పాటుపడాలని, సమస్యకు పరిష్కార మార్గం చూపిన నాడు ఓ కమ్యూనిస్టుగా పొందే సంతృప్తి వేరుగా ఉంటుందని తెలిపారు. రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీ తీసుకునే నిర్ణయానుసారంగా పని చేయాలని, అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. కె.రవీంద్రబాబు, జి.ప్రశాంత్, పి.మధు, సిహెచ్.సాయికిరణ్, కె.హుస్సేన్, కె.శివప్రసాద్, కె.నాగేంద్రబాబు, కె.సతీష్, కె.మోహన్, ఎం.జంపన్నల ఆధ్వర్యంలో సుమారు 50 మంది యువకులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సలిగంటి శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు నేరెళ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బరిగెల వెంకటేష్

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బరిగెల వెంకటేష్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లాకేంద్రంలోని ధర్మభిక్షం భవన్‌లో నిర్వహించిన ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల విషయంలో, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ విద్యార్థులకు బకాయిలు చెల్లించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని దీని కారణంగా లక్షలాది మంది విద్యార్థులు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిధుల విడుదలపై ఇచ్చిన హామీకి కూడా గ్యారెంటీ లేకపోవడం విద్యారంగంపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శమన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి బకాయిలో ఉన్న ఫీజులను అన్నింటిని విడుదల చేసి విద్యార్థి లోకాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి తమ్మునబోయిన నరేష్, నాయకులు గడ్డం నాగరాజు, నెల్లూరు శివ, గడ్డం వినయ్, జి.సురేష్, ఎస్.నరేష్ పాల్గొన్నారు.



## మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలి

కలెక్టర్ సిక్తా పట్నాయక్

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** జిల్లాలోని నారాయణపేట , మక్తల్, కోస్గి, మద్దూరు మున్సిపాలిటీ లలో ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. మున్సిపల్ ఎన్నికలకు త్వరలో షెడ్యూల్ విడుదల కానున్న నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రానీ కుముదిని గురువారం ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా మహబూబ్ నగర్ , గద్వాల, వనపర్తి, నాగర్ కర్నూలు, నారాయణ పేట జిల్లాల కలెక్టర్లలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల నిర్వహణ ఏర్పాట్ల పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అన్ని విధాలుగా సన్నద్ధం అయి ఉన్నామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కు తెలిపారు. వీటి వివరాలను ఇప్పటికే టీ.పోల్ లో నమోదు చేయడం జరిగిందన్నారు. ఆర్.ఓ ఏ.ఆర్.ఓలను గుర్తించడం జరిగిందని తెలిపారు. పోలింగ్ నిర్వహణకు సరిపడా సిబ్బంది అందుబాటులో ఉన్నారని తెలిపారు. మొత్తం 4 మున్సిపాలిటీలకు గాను 149 పోలింగ్ కేంద్రాలను గుర్తించడం జరిగిందని, పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ చేయనున్నట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో స్థానిక జిల్లా అదనపు రెవెన్యూ కలెక్టర్ శ్రీను, నోడల్ అధికారులు , మున్సిపల్ కమిషనర్‌లు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డికి వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక అందజేత

**ప్రజాపక్షం/జడ్చర్ల :** వెంకటేశ్వర స్వామి జడ్చర్ల వారి బ్రహ్మోత్సవాలకు రావాలని జడ్చర్ల క్యాంప్ ఆఫీస్ లో జడ్చర్ల శాసనసభ్యులు జానంపల్లి అనిరుధ్‌రెడ్డి కి శ్రీ వెంకటేశ్వర స్వామి టెంపుల్ పూజారి అయిన సుధీంద్రా చారి (చిన్న పంతులు) జడ్చర్ల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల జాతర ఆహ్వాన పత్రిక అందించి బ్రహ్మోత్సవాలకు రావాలని ఎమ్మెల్యే ని ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అశోక్ యాదవ్, యాదయ్య, కౌన్సిలర్లు కుమ్మరి రాజు, చైతన్య చౌహన్, కోనేటి నరసింహులు, నర్సింలు యాదవ్, భాస్కర్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజేందర్ గౌడ్, అల్వాల్ రెడ్డి, రాజు నాయక్, తుంగ రఘు, శ్రీకాంత్ రెడ్డి, సర్పరాజు, సునీల్, సంక్ల, కాంగ్రెస్ పార్టీ యువనేత అర్షద్, కృష్ణారావు పాల్గొనడం జరిగింది.




## చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ వి.రజని

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి వి.రజని అన్నారు. మండలంలోని గోవర్ధనగిరి గ్రామ పంచాయితీ వద్ద ప్రజలకు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి వి.రజని మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనం చేయడం వలన జ్ఞానాన్ని మరియు సమయస్ఫూర్తిని పెంపొందించుకోవచ్చు అని సూచించారు. ఆర్టికల్ (14), ఆర్టికల్ (19), ఆర్టికల్ (21) యొక్క ప్రాముఖ్యతను వివరించారు. అదే విధంగా మహిళలకు, చిన్నపిల్లలకు, షెడ్యూల్ ట్రైబ్స్, షెడ్యూల్ క్యాస్ట్, వయోవృద్ధులకు, మతి స్థిమితం లేని వారికి, సామూహిక విపత్తు మరియు మానవ అక్రమ రవాణా బాధితులకు ఉచిత న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. బాల్య వివాహాల నిషేధ చట్టం, బాల కార్మికుల నిర్మూలన చట్టం, మోటార్ వాహనాల చట్టం, ఉచిత మరియు నిర్బంధ విద్య హక్కు చట్టం, సైబర్ క్రైమ్స్ మరియు డ్రగ్ అబ్యూస్ గురించి అవగాహన కల్పించారు. ఉచిత న్యాయ సలహాల కొరకు NALSA 15100 టోల్ ఫ్రీ నెంబర్ ను సంప్రదించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచు ముంత జ్యోతి, ఎస్ఐ కె.రాణి, ఎంఈఓ నరసింహ పాల్గొన్నారు.

## పిచ్చిమొక్కలు తొలగింపు



**ప్రజాపక్షం/వెల్దండ :** మండలపరిధిలోని చెదురుపల్లి గ్రామంలో స్మశానవాటికలో పిచ్చిమొక్కలు, చెట్లను గ్రామ సర్పంచ్ వడ్త్యావత్‌ధన్సింగ్ నాయక్ తన సొంతనిధులతో జెసిబిసాయంతో తొలగించారు. అదేవిధంగా ఎన్నో సంవత్సరాలుగా పిచ్చిమొక్కలు చెట్లతోకూరుకుపోయిన స్మశానవాటికను శుభ్రం చేయించాలని 5వవార్డు సభ్యులు శివయాదవ్ సర్పంచ్‌ను కోరగా వెంటనే స్పందించిన ఆయన జెసిబితో మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. గ్రామంలో ఏళ్లతరబడి ఉన్న సమస్యను పరిష్కరించినందున గ్రామస్తులు సర్పంచ్‌ను అభినందించారు. కార్యక్రమంలో మద్రాస్ బాలయ్య, తగుళ్లరాజుయాదవ్, కమ్మగొనిమహేష్, చలమంద పాల్గొన్నారు.

## ఘన సన్మానం



**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** మండలంలోని కల్వకోల్ గ్రామ ప్రాథమిక పాఠశాలను గ్రామసర్పంచ్ బంట్రోతుశ్రీనివాసులు గురువారం సందర్శించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గౌరివినిత గ్రామసర్పంచ్‌ని శాలువాతో సన్మానించారు. అనంతరం పాఠశాలలో నెలకొన్న సమస్యలపై పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వివరించారు. సర్పంచ్ సానుకూలంగా స్పందించి సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాముయాదవ్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

# రంజాన్ పండగ ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** వచ్చే నెలలో ప్రారంభమయ్యే పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు ఆచరించే ఉపవాస దీక్షలకు (రోజా), రంజాన్ పండుగ రోజు కల్పించాల్సిన ఏర్పాట్లపై గురువారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్, రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతేడాది మాదిరిగానే ఈసారి కూడా రంజాన్ మాసాన్ని, పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, రంజాన్ మాస ఉపవాస దీక్షలకు అవసరమైన వసతి, సౌకర్యాలను ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆమె ఆదేశించారు. సమావేశంలో మైనార్టీ నాయకులు మాట్లాడుతూ రంజాన్ సందర్భంగా నెల రోజుల పాటు పట్టణంలో తాగునీటి సరఫరా, విద్యుత్, పారిశుద్ధ్యం మెరుగు పర్చాలని కోరారు. ముఖ్యంగా ఆ నెల మొత్తం విద్యుత్ సరఫరా కు ఆటంకం లేకుండా ఆ శాఖ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. వీటితో పాటు మసీదులు, ఈద్గాల వద్ద రోజు సాయంత్రం మున్సిపాలిటీ చెత్త ఆటో రిక్షా ను అందుబాటులో ఉంచాలని, ఇఫ్తార్ ముగిసిన తర్వాత వ్యర్థ పదార్థాలను ఆ ఆటో రిక్షాల లో వేస్తారని లేదంటే ఆయా ప్రాంతాల్లో దుర్గంధం నెలకొంటుందని చెప్పారు. రంజాన్ పండుగ కు పది రోజుల ముందు పట్టణంలో దుకాణాలు రాత్రి వేళల్లో తెరచి ఉంచేందుకు అనుమతి ఇవ్వాలని, పండుగ షాపింగ్ ఎక్కువగా రాత్రి వేళల్లోనే చేస్తారని మైనార్టీ నాయకులు తెలిపారు. రంజాన్ పండుగ రోజు ఈద్గా వద్ద సెమ్యాలు , టెంట్లు, తాగునీటి వసతి కల్పించాలని వారు కోరారు. రంజాన్ పండుగ రోజు ఈద్గా వద్ద కు రావాలని జిల్లా కలెక్టర్ ను నాయకులు కోరారు. మైనార్టీ నాయకులు కోరిన వాటి పై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. శాఖల వారీగా అధికారులు ఆయా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామంలోనూ తగిన ఏర్పాట్లు చేయాలని డిపివో సుధాకర్ రెడ్డి కి కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఆర్డీవో రామచందర్ నాయక్, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ఎం.ఏ. రషీద్, వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శైలజ, మున్సిపల్ మేనేజర్ అజీమ్, మైనార్టీ నాయకులు అమీరొద్దీన్, సర్పరాజ్ అన్సారి, మహిముద్ ఖురేషీ, అజీమ్ మడ్కీ, ఫిరోజ్, మహిముద్, అజహర్, ఎం.ఐ.ఎం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్, పట్టణ అధ్యక్షుడు తఖి, ఫీర్ తఖి తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ వర్శిటీ పాత బ్యాచ్‌ల విద్యార్థులకు 'రీ అడ్మిషన్'

1986 నుండి 2013 బ్యాచ్‌లకు చెందిన వారికి అవకాశం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** డా.బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ పాత బ్యాచ్‌ల విద్యార్థుల నుండి వచ్చిన విజ్ఞప్తులను పరిశీలించి, వారు కోర్సు పూర్తి చేసుకోవడానికి ప్రత్యేక అవకాశం (స్పెషల్ రీ అడ్మిషన్) కల్పిస్తున్నట్లు విద్యార్థి సేవల విభాగం డైరెక్టర్ డా. వై వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. విద్యా సంవత్సరం 1986 నుండి 2013 వరకు డిగ్రీ (బి.ఏ, బి.కాం, బి.యస్‌సి) బ్యాచ్‌లకు చెందిన విద్యార్థులకు విశ్వవిద్యాలయం స్పెషల్ రీ అడ్మిషన్ పొందడానికి ప్రత్యేక అవకాశం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. గతంలో విశ్వవిద్యాలయంలోని పలు కోర్సుల్లో చేరి, సకాలంలో కోర్సు పూర్తి చేయలేకపోయిన (ఓల్డ్ బ్యాచ్) విద్యార్థులకు వాటిని పూర్తి చేయడానికి అవకాశం ఇస్తున్నట్లు తెలిపారు. స్పెషల్ రీ అడ్మిషన్ పొందాలి అనుకునే విద్యార్థులందరూ, జూబ్లీహిల్స్ (హైదరాబాద్) లోని విశ్వవిద్యాలయ ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్, విద్యార్థి సేవల విభాగంను సంప్రదించాలని పేర్కొన్నారు. విద్యార్థులకు ఇదే చివరి అవకాశంగా పేర్కొన్నారు. రీ అడ్మిషన్ పొందిన విద్యార్థులకు డిసెంబర్ 2026 వరకు నిర్వహించే పరీక్షలు రాయడానికి రెండు అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం అభ్యర్థులు విశ్వవిద్యాలయ వెబ్ సైట్ www.braou.ac.in, కాల్ సెంటర్: 18005990101, హెల్ప్ డెస్క్ 04023680222,333,555 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.




## కల్వకుర్తి మున్సిపాలిటి బిజెపి ఎన్నికల ఇన్‌చార్జిగా అందే శ్రీరాములు యాదవ్

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** రాబోయే మున్సిపాలిటి ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కల్వకుర్తి మున్సిపాలిటి బిజెపిఎన్నికల ఇన్‌చార్జిగా మహేశ్వరం నియోజకవర్గం బిజెపి సీనియర్ నాయకుడు అందెల శ్రీరాములుయాదవ్‌ని భారతీయ జనతాపార్టీ రాష్ట్రశాఖ నియామకం చేసింది. ఎన్నికల ఇంచార్జీగా నియమింపబడిన తర్వాత మొదటిసారి కల్వకుర్తికి విచ్చేసిన సందర్భంగా నాయకులు కార్యకర్తలతో బిజెపి కార్యాలయంలో జాతీయ మాజీ బిసి కమిషన్ మెంబర్ తల్లోజు ఆచారి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. రాబోయే మున్సిపల్ ఎన్నికలలో బిజెపి ఘనవిజయం సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక బిజెపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఆర్థిక అక్షరాస్యతపై ఖాతాదారులకు అవగాహన

**ప్రజాపక్షం/పెబ్బేరు :** ప్రతి ఖాతాదారుడు ఆర్థిక స్వావలంబన సాధించడానికి తెలంగాణ గ్రామీణ బ్యాంకు అందిస్తున్న పలు పథకాలను వినియోగించుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. గురువారం రోజు గుమ్మడం గ్రామ పంచాయితీ కార్యాలయ ఆవరణలో ఖాతాదారులు , గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి, బ్యాంకులు అందిస్తున్న పలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి , టర్మ్ ఇన్సూరెన్సులు, ఎస్బిఐ లైఫ్, స్మాల్ మరియు లాంగ్ టర్మ్ బిజినెస్ లోన్లు ఇలాంటి పథకాలను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ శ్రీనివాస్ తో పాటు క్షేత్రాధికారి ఆఫీసర్ సందీప్ క్యాషియర్ వెంకటేశ్, మెసెంజర్ జయంత్ తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## స్మశాన వాటిక స్థలాన్ని పరిశీలించిన తహసీల్దార్

**ప్రజాపక్షం/శ్రీరంగాపూర్ :** శ్రీరంగాపూర్ మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో చాలా సంవత్సరాల నుంచి స్మశాన వాటికకు స్థలం లేకపోవడంతో సర్పంచ్ భారతీ ఎల్లా గౌడ్ సర్వే నెంబర్ 254లో ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి అధికారులకు తెలియజేయడంతో గురువారం స్మశాన వాటిక స్థలాన్ని అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజు, ఆర్ఐ రాధాకృష్ణ, పెబ్బేరు సర్వేయర్ వెంకటలక్ష్మి, ఉప సర్పంచ్ సామెల్ తదితరులు పాల్గొన్నారు.

## ముందస్తు నేత్ర పరీక్షలతో కంటి ముప్పు తప్పించవచ్చు

జిల్లా కంటి వైద్య బృందం డాక్టర్ క్లవిన్



**ప్రజాపక్షం/గోపాల్‌పేట్ :** అనియంత్రిత మధుమేహం వల్ల కంటి చూపు కోల్పోయే ప్రమాదం ఉందని, ముందస్తు నేత్ర పరీక్షలు జరుపుకుంటే ఈ ముప్పు తప్పించవచ్చునని జిల్లా కంటి వైద్య బృందం డాక్టర్ క్లవిన్, తెలిపారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గోపాల్‌పేట మండలంలోని బుద్దారం పాటిగడ్డ తండా గ్రామ పంచాయతీలో డయాబెటిక్ రెటినోపతి సదస్సు నిర్వహించారు. గ్రామంలోని 94 మందికి కంటి పరీక్షలు చేయగా ఇందులో కాటరాక్ట్ 15, డయాబెటిక్ రెటినోపతి కేసులు ఒకరిని, ఎఎమ్డీ ఇద్దరిని గుర్తించడం జరిగిందన్నారు. గుర్తించిన అందర్నీ కూడా గవర్నమెంట్ జర్నల్ హాస్పిటల్ వనపర్తికి రెఫర్ చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా మధుమేహ వ్యాధిగ్రస్తుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఈ దృష్టి కార్యక్రమాన్ని ప్రతి ఒక్క షుగర్ పేషెంట్ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచు ఉషా హర్యానాయక్, రజనీ రాందాస్, జిల్లా కంటి వైద్య బృందం డా.క్లవిన్, సీహెచ్‌ఓ సిద్ద గౌడ్, ఆప్తమాలజిస్టు పార్వతి, జిల్లా హెల్త్ అసిస్టెంట్స్ మధుబాబు, జ్ఞానేశ్వర్, ఏఎన్ఎమ్ లక్ష్మి , శివలీల, ఆశా కార్యకర్త రమణి తండా వాసులు తదితరులు పాల్గొన్నారు.

# 'బిసి కార్పొరేషన్లు' ఏర్పాటు చేయాలి



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** రాష్ట్రంలోని బిసి కులాల సమగ్రాభివృద్ధికి ఆయా సామాజికవర్గాలకు ప్రకారం కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలని తెలంగాణ బిసి ఫెడరేషన్ కులాల సమితి రాష్ట్ర అధ్యక్షులు బెల్లాపు దుర్గారావు, ప్రధానకార్యదర్శి కీర్తి యుగంధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బిసిలకు ఇచ్చిన కామారెడ్డి డిక్లరేషన్‌ను నెరవేర్చాలని కోరారు. అత్యంత వెనుకబడిన బిసిలోని ఆయా సామాజికవర్గాల్లోని నిరుద్యోగ యువతకు ఉపాధి నిమిత్తం రాయితీ రుణాలను, కార్పొరేషన్ల ద్వారా మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో బి.ప్రవీణ్‌కుమార్ ( సారోళ్లు), మహమద్ సలీం( ఫకీర్), బొగ్గుల సునీత (వంజర), త్రినాథ స్వామి (సిస్టకరణం), సయ్యద్ బాషా (దూదేకుల), ఇమామ్ బాషా (తుర్క కాశ), రాణా నగేశ్ సింగ్ (బొందిలి), గోగికార్ కిశోర్ ( ఆరెకటిక) తదితరులు పాల్గొన్నారు.

## 25న ఓటింగ్‌పై అవగాహన కార్యక్రమం

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా ఈ నెల 25న ఓటు హక్కు వినియోగంపై 'రన్‌ఫర్ ఓట్ ఇండియా', అవగాహన కార్యక్రమాన్ని నెక్లెస్‌రోడ్డు సంజీవయ్య పార్కు వద్ద నిర్వహిస్తున్నట్టు తెలంగాణ ప్రవాసి వెల్ఫేర్ ఆర్గనైజేషన్ (టిపిఎస్‌డబ్ల్యూఒ) అధ్యక్షులు సుభాష్ అగర్వాల్ తెలిపారు. గురువారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించి, ఆయన మాట్లాడారు. ఓటు హక్కు ఐదేళ్ల భవిష్యత్తును నిర్ణయిస్తుందన్నారు. సామాన్య ప్రజలు ఓటు హక్కును సద్వినియోగం చేసుకొనేలా పలు కార్యక్రమాలు చేపడుతున్నట్టు వివరించారు. 25న ఉదయం 6.30 గంటల నుంచి 9గంటల వరకు జరిగే కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా భారత మేజర్ జనరల్ అజయ్ మిశ్రా, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ హాజరవుతారని తెలిపారు. వందశాతం ఓటింగ్‌పై ప్రచారం ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేయనున్నదని పేర్కొన్నారు.

## గ్రామీణప్రాంత క్రీడాకారుల అభివృద్ధి కోసమే సిఎం కప్

ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

**ప్రజాపక్షం/అచ్చంపేట :** గ్రామీణ ప్రాంతంలోని క్రీడాకారులను గుర్తించేందుకే సిఎం కప్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. గురువారం ఆయన పట్టణంలో క్రీడాజ్యోతి కార్యక్రమంలో పాల్గొన్నారు. మొదట ఆయన అంబేద్కర్ విగ్రహంవద్ద పూలమాలవేసిన అనంతరం ప్రసంగించారు. విద్యార్థులతో రౌండప్ కార్యక్రమం నిర్వహించారు. నేడు జాతీయస్థాయిలో ఉన్నతశిఖరాలు అందుకున్న క్రీడాకారులు గ్రామీణ ప్రాంతంనుండే వచ్చారని గుర్తుచేశారు. గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం వలన క్రీడలపై శ్రద్ధ చూపకపోవడంతోపాటు, గ్రామీణప్రాంతంలోని క్రీడాకారులకు ప్రోత్సాహం ఇవ్వలేదని గుర్తుచేశారు. నేడు అదిగమనించిన ముఖ్యమంత్రి సిఎంకప్‌పేర క్రీడాజ్యోతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.




## మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** జిల్లాలోని నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్ మున్సిపాలిటిల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ తెలిపారు. మున్సిపల్ ఎన్నికలకు త్వరలో షెడ్యూల్ విడుదలకానున్న నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమీషనర్ రాణికుముదిని గురువారం జిల్లాల కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ మాట్లాడుతూ మూడు మున్సిపాలిటిల పరిధిలో 65వాటిలో ఎన్నికలు నిర్వహించేందుకు 131 కేంద్రాలను ఏర్పాటుచేయడం జరిగిందని, పోలింగ్‌కేంద్రాల్లో అవసరమైన 158బ్యాలెట్‌బాక్సులతోపాటు అదనంగా 20శాతం బ్యాలెట్‌బాక్సులు సిద్ధం చేయడం జరిగిందన్నారు. ఎన్నికల బ్యాలెట్‌పేపర్ ప్రింటింగ్‌కొరకు మహబూబ్‌నగర్‌లో గుర్తించడం జరిగిందని, సిబ్బందికి శిక్షణ తరగతులను నిర్వహించడం జరిగిందన్నారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అన్నివిధాలుగా సన్నద్ధమై ఉన్నామని రాష్ట్ర ఎన్నికల కమీషనర్ దృష్టికి తెచ్చారు. జిల్లాలోని మూడు మున్సిపాలిటిల పరిధిలో పోలింగ్‌కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. వీటివివరాలను ఇప్పటికే టీపోల్‌లో నమోదు చేయడం జరిగిందన్నారు. పోలింగ్‌కేంద్రాల విషయమై వచ్చిన అభ్యంతరాలను నిశితంగా పరిశీలిస్తూ పరిష్కరించడం జరిగిందన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని నియమిస్తూ వారికి శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వీడియోకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ దేవసహాయం, మున్సిపల్ కమీషనర్లు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ ఎన్నికల్లో సిపిఐ అధిక స్థానాల్లో పోటీ

సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** త్వరలో జరగనున్న మున్సిపాలిటి ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ జిల్లాలోని అన్ని మున్సిపాలిటిల్లో వీలైనమేరకు అధికస్థానాల్లో సిపిఐ పార్టీ పోటిచేస్తుందని సిపిఐజిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ తెలియజేశారు. సిపిఐజిల్లా సమితిసభ్యులు బండిలక్ష్మి పతి , తుమ్మలశివుడు, మర్యాదవెంకటయ్య, పరుషరాంతో కలిసి ఈవిషయాన్ని వెల్లడించారు. ఈఎన్నికల్లో ప్రజలు పెద్ద ఎత్తున ఎన్నికల్లో పోటిచేస్తున్న అభ్యర్థులచరిత్రను పరిశీలించి ఓటువేయాలని, నీతినిజాయితి నిత్యం ప్రజలకోసం పనిచేసే వ్యక్తులను ఎన్నుకోవడం ద్వారా మనపట్టణప్రాంతాలన్ని అభివృద్ధివైపు నడవడానికి వీలు ఉంటుందన్నారు. ప్రజలకోసం వారి సమస్యల పరిష్కారంకోసం అహర్నిశలు కృషిచేస్తున్న పోరాట ఉద్యమాలు నిర్మిస్తున్న సిపిఐపార్టీ అభ్యర్థులకు సిపిఐబలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



## జర్నలిజాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది

జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**ప్రజాపక్షం/వనపర్తిటౌన్ :** జర్నలిజాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. గురువారం తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (ఐజెయు) డైరీ, జిల్లా అధ్యక్షుడు మాధవరావు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ సునీత రెడ్డి, యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జి.మధుగౌడ్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ సమాజంలో జర్నలిజం నాలుగో స్తంభం లాంటిదని, జర్నలిస్టులు ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ వార్తలను అందించాలని, ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి పరిష్కారమయ్యే విధంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిపిఆర్ఓ సీతారాములు, ఎస్పిఆర్ఓ రాజ గౌడ్, జాతీయ కౌన్సిల్ సభ్యులు మల్యాల బాలస్వామి, రాష్ట్ర హౌస్ సైట్ కో కన్వీనర్ జి.శ్రీనివాసరావు, సీనియర్ పాత్రికేయులు పోలిశెట్టి బాలకృష్ణ, నాగేంద్ర చారి, వెంకట్ గౌడ్, జిల్లా కోశాధికారి మన్యం, జిల్లా కార్యదర్శి కమల్ రెహమాన్, చిన్న రాజు, క్రమశిక్షణ కమిటీ సభ్యులు పికిలి రాము, తిరుపతయ్య, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా కార్యదర్శి నరసింహ రాజు, ప్రచార కార్యదర్శి రవి, పట్టణ అధ్యక్షులు తైలం అరుణ్ కుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి సిల్‌మార్తి, ఆంజనేయులు పాల్గొన్నారు.

## ఒక నిర్లక్ష్యపు చర్య జీవితాంతం బాధ మిగిలిస్తుంది : ఎస్ఐ

**ప్రజాపక్షం/ధన్వాడ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా ధన్వాడ పోలీస్ స్టేషన్‌లో ధన్వాడ ఎస్సై ఎన్. రాజశేఖర్ అధ్యక్షన మీడియా అవుట్? రీచ్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరులతో పలు విషయాల పై భద్రత అంశాల పై సూచనలు సమాజంలో జరుగుతున్న అంశాల పై మాట్లాడుతూ వాహనదారులు ఇంటి నుంచి బయలుదేరి సురక్షితంగా గమ్యాన్ని చేరి తిరిగి ఇంటికి క్షేమంగా చేరుకోవాలని ప్రధాన లక్ష్యంతోనే ఈ అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పత్రిక విలేకరులు పాల్గొన్నారు.





## ప్రజలకు ప్రభుత్వాలకు మధ్య పత్రికలు వారధి

### ప్రజాపక్షం క్యాలెండర్ ఆవిష్కరించిన తహసీల్దార్

**ప్రజాపక్షం/చింతపల్లి :** మండల కేంద్రంలో గురువారం తహసీల్దార్ కార్యాలయంలో తాహశీల్దార్ విజయలక్ష్మి చేతుల మీదుగా ప్రజాపక్షం జాతీయ దినపత్రిక 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు భాషా సాహిత్యాన్ని, సంస్కృతిని పరిరక్షించడానికి పత్రికలు తోడ్పడుతున్నాయన్నారు. ప్రజలకి ప్రభుత్వాలకు మధ్య పత్రికలు వారధిగా పని చేయాలన్నారు. ప్రజల గొంతుకగా ప్రజాపక్షం పత్రిక పనిచేసి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని ఆమె ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రామారావు, ప్రజాపక్షం చింతపల్లి మండల రిపోర్టర్ ఆరెకంటి రాధాకృష్ణ, ఏర్పుల డావలయ్య తదితరులు పాల్గొన్నారు.

## సమ్మిళిత వార్తల సమాహారం 'ప్రజాపక్షం'



**ప్రజాపక్షం/డిండి:** ప్రజా సమస్యలను ఎలుగెత్తి చాటుతూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తూ ప్రజల గొంతుకగా ప్రజాపక్షం తెలుగు జాతీయ దినపత్రిక నిలుస్తుందని సిపిఐ కింది శేషాయికుంట గ్రామ సర్పంచ్ వరికుప్పల స్వప్న అయోధ్య అన్నారు. గురువారం శేషాయికుంట గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రజాపక్షం తెలుగు జాతీయ దినపత్రిక 2026నూతన సంవత్సర క్యాలెండర్‌ను సర్పంచ్ స్వప్న అయోధ్య ఆవిష్కరించారు. ప్రజాపక్షం దినపత్రిక యాజమాన్యానికి, విలేకరులకు సర్పంచ్ స్వప్న అయోధ్య నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

## నిరంతరం సాధన చేస్తే సాధ్యం కానిది ఏమీ లేదు

### పిఆర్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



**ప్రజాపక్షం/చండూరు:** విద్యార్థి నిరంతరం సాధన చేస్తూ చదివితే సాధించలేనిది ఏదీ ఉండదని చండూరు ఆర్డీవో శ్రీదేవి ,మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరి రావు అన్నారు. గురువారం చండూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పిఆర్‌ఆర్ ఫౌండేషన్ సోషల్ సర్వీస్ చైర్మన్ చల్లం పాండురంగారావు ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాగగిరి రావు ,ఆర్డీవో హాజరై మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేస్తూ కష్టపడి చదవాలని సూచించారు. అనంతరం స్టడీమెటీరియల్‌ను ఆర్డీవో శ్రీదేవి, మాజీ ఎమ్మెల్యే యాదగిరి రావు చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. న్యాయవాది బొమ్మరబోయిన వెంకన్న పాడిన ప్రేరణాత్మక గీతాలు విద్యార్థులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సిపిఐ చండూరు మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్, కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ప్రిన్సిపాల్ శేఖర్ , చండూరు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కోటేశ్వర్ రెడ్డి, ఉపాధ్యాయులు విజయలక్ష్మి పాల్గొన్నారు.

## ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు

### ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంఎల్‌ఏ బాలునాయక్



**ప్రజాపక్షం/దేవరకొండ :** దేవరకొండ పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని గురువారం ప్రజా ప్రతినిధులతో కలిసి దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని అన్ని వార్డుల్లో తిరుగుతూ చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి, వారికి అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉండే విధంగా డాక్టర్లు, సిబ్బంది చూసుకోవాలన్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్య సేవలను అందించాలని డాక్టర్లకు సూచించారు. ఈకార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.
దేవరకొండ మండలంలోని ముదిగొండ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో పిఎండిఏ, జేజియూఏ నిధుల నుండి మంజూరు అయిన రూ. 2కోట్లతో అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ. 80లక్షలతో బోధన సిబ్బంది కోసం ప్రత్యేక గదుల నిర్మాణ పనులకు అధికారులు ప్రజా ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోమౌలిక వసతుల కల్పనలో భాగంగా అదనపు తరగతి గదులను నిర్మిస్తున్నామన్నారు.

## భూసేకరణకు రైతులతో ముఖాముఖీ



**ప్రజాపక్షం/మోతె :** ప్రతి రైతుకు ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారం ఇవ్వడం జరుగుతుందని రైతులు నష్టపోకుండా చేయడం జరుగుతుందని ఆర్‌డిఓ మాధవరావు అన్నారు. గురువారం మండలంలోని బుర్కచర్ల గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించి వారికి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తుందని బరోసా ఇచ్చారు. బుర్కచర్ల, రాంపురం తండ, గోల్‌తండ గ్రామాల రైతులు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ యం వెంకన్న, డిటి పుష్ప, ఏఇ స్వప్న, ఆర్‌ఐలు కర్ణాకర్ రెడ్డి, రమేష్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు బానోతు కవిత పాల్గొన్నారు.

# ప్రత్యేక పర్యాటక కేంద్రంగా సూర్యాపేట

### రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట :** సూర్యాపేటను ప్రత్యేక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సద్దుల చెరువు సుందరీకరణ పనులకు శంఖుస్థాపన చేసి ఆయన మాట్లాడారు. సద్దుల చెరువు మినీ ట్యాంక్ బండ్ అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. రూ. 5 కోట్లతో మినీ ట్యాంక్‌బండ్ బ్యూటిఫికేషన్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. ఆరు మాసాల లోపు ట్యాంక్ బండ్ ఒక ఆకర్షణీయమైన ప్రాంతంగా అందుబాటులోకి తీసుకవస్తామన్నారు. పర్యాటకులకు ఆనందకరమైన వాతావరణం కల్పించేలా క్యాంటీన్, వాకింక్ ట్రాక్ లైన్, విశ్రాంతి ప్రదేశాలతోపాటు ఇతర మౌళిక సదుపాయాలు అందుబాటులోకి తెస్తామని చెప్పారు. తాను రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన తరువాత ప్రత్యేకంగా రూ. కోటి అంచనా వ్యయంతో 80 సీట్ల ఏసి బోటింగ్‌ను మంజూరి చేయించినట్లు తెలిపారు. ఈ బోటింగ్ నిర్మాణ పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయని నెల లోపు పూర్తిచేసి రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చేతులమీదుగా ప్రారంభిస్తామని వెల్లడించారు. ఈ బోటింగ్‌ను ప్రధానంగా బర్త్‌డే పార్టీలు, చిన్న చిన్న ఫంక్షన్‌లు చెరువు మధ్యలో నిర్వహించుకునే విధంగా అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు చెప్పారు. సద్దుల చెరువు పరిసర ప్రాంతంలోని 5 ఎకరాల స్థలంలో రూ.15 కోట్లతో ఇంటర్నేషనల్ లెవెల్ పార్కును అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే నిధులు మంజూరి చేసినట్లు తెలిపారు. అవసరమైతే అదనంగా మరో రూ.10కోట్ల వ్యయంతో పార్కును, ట్యాంక్‌బండ్, ఐ లాండ్ పార్క్ తరహాలో అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. పట్టణంలోని ప్రజలు కుటుంబ సమేతంగా సద్దుల చెరువు దగ్గరకు వచ్చి ఆనందంగా గడిపేందుకు ఫ్లయింగ్ జోన్, మిని థియేటర్ వంటి ప్రత్యేక ఆకర్షణలు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. సూర్యాపేట పర్యాటక అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరి చేసిన మంత్రి జూపల్లి కృష్ణారావు, సిఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ పెద్దిరెడ్డి రాజా, సీనియర్ నాయకులు డాక్టర్ రామ్మూర్తి యాదవ్, మాజీ డిసిసిబి డైరెక్టర్ ముదిరెడ్డి రమణారెడ్డి, నాయకులు నేరేళ్ళ మధు గౌడ్, మాజీ కౌన్సిలర్లు వెలుగు వెంకన్న, వల్దాసు దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# గవర్నర్ పర్యటనలో లోటుపాట్లు ఉండొద్దు

### రాష్ట్ర గవర్నర్ రాక సందర్భంగా ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ (మఠంపల్లి) :** రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ శుక్రవారం సూర్యాపేట జిల్లా, మట్టపల్లి లక్ష్మి నృసింహ స్వామి దర్శనార్థం మట్టపల్లి వస్తున్న సందర్భంగా ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్‌పి కె నరసింహతో కలిసి గురువారం పరిశీలించారు. డయాస్, ప్రముఖులు, ఇతరుల సీటింగ్, పబ్లిక్ అడ్రస్ సిస్టం, ఎల్‌ఈడీల ఏర్పాటు, డయాస్ పక్కనే వివిధ అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనకు సంబంధించిన శిలాఫలకాల ఏర్పాట్లు పరిశీలించారు. రాష్ట్ర గవర్నర్‌కు ఇచ్చే పోలీస్ గౌరవ వందనం, వివిధ శాఖల ద్వారా ఏర్పాటు చేస్తున్న స్టాల్స్, దేవాలయంలో డెకరేషన్ తదితర అన్ని ప్రదేశాలను కలెక్టర్, ఎస్‌పిలు తనిఖీ చేయడమే కాకుండా అధికారులు, సిబ్బందికి తగు సూచనలను జారీ చేశారు. గవర్నర్ రాక సందర్భంగా ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదని, గవర్నర్ మట్టపల్లి వచ్చినప్పటి నుండి తిరిగి వెళ్ళిపోయే వరకు అన్ని సవ్యంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కాగా రాష్ట్ర గవర్నర్ మట్టపల్లి సందర్శన సందర్భంగా హుజూర్‌నగర్ సమీపంలోని ముగ్దుమ్ నగర్ వద్ద రూ.126 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న వ్యవసాయ విశ్వవిద్యాలయానికి, కోదాడలో రూ.50కోట్ల వ్యయంతో నిర్మించనున్న జవహర్ నవోదయ విద్యాలయ భవనానికి, రూ.1 కోటి వ్యయంతో మట్టపల్లి లక్ష్మి నృసింహ స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మించనున్న డార్మెటరి, కిచెన్ షెడ్, తాగునీటి ట్యాంకుకు, అలాగే మరో కోటి రూపాయల వ్యయంతో నిర్మించనున్న యాత్రికా సదన్, పిపిజిఐ షెడ్డు, సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. రాష్ట్ర గవర్నర్ రాక సందర్భంగా దేవాలయ ఆవరణలో వ్యవసాయ, పౌరసరఫరాలు, ఉద్యాన, డిఆర్‌డిఏ, విద్య, నీటిపారుదల, గృహ నిర్మాణ శాఖలు ఏర్పాటు చేస్తున్న స్టాల్స్‌ను రాష్ట్ర గవర్నర్ సందర్శించనున్నారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా అధికారులు, ఆర్‌డిఓలు, పోలీసు అధికారులు ఉన్నారు.

# మిర్యాలగూడ పట్టణాభివృద్ధికి చర్యలు

### ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ పట్టణ మెరుగుకై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా మిర్యాలగూడ పట్టణంలోని ఎన్‌ఎస్పీ క్యాంపు రాజీవ్‌గాంధీ స్టేడియంలో అరైవ్ అలైవ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణానికి ఒకటే ప్రధాన రోడ్డు కావడం ఆ రోడ్డుపైనే అన్ని రకాల షాపులు ఉండడంతో ట్రాఫిక్ విపరీతంగా పెరిగిందని, ట్రాఫిక్ క్రమబద్ధీకరించేందుకు ట్రాఫిక్ సిగ్నల్స్ అవసరమన్నారు. ఇందుకు అందరి సహకారంతో చర్యలు తీసుకుంటామన్నారు. వాహనదారుడు భద్రంగా చేరుకోవాలన్న ఉద్దేశ్యంతో అరైవ్, అలైవ్ చేపట్టడం అభినందనీయమన్నారు. కోదాడ జడ్చర్ల రహదారి విస్తరణ అనంతరం మేదరవాడ నుంచి ఆర్టీసి బస్టాండ్ వరకు విస్తరణ పనులు పూర్తయితే ట్రాఫిక్ మెరుగు అవుతుందని ప్రజలు సహకరించాలని కోరారు. హెల్మెట్ల పంపిణి ప్రారంభించామని శివరాత్రి లోపు 20వేల హెల్మెట్లు పంపిణి చేస్తానన్నారు. మిర్యాలగూడ అభివృద్ధి చూసిన వారికి ఆదర్శమయ్యేలా చేయాలని ఉందని సహకరించాలని కోరారు. రోడ్డు భద్రతపై అన్ని విధాల ప్రజలకు అవగాహన, చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తుండడం అభినందనీయమని సబ్ కలెక్టర్ నారాయణ్అమిత్ అన్నారు. 18 సంవత్సరాలు నిండని వారు వాహనాలు నడిపితే శిక్షలు తప్పవని డీఎస్పీ రాజశేఖర్‌రాజు అన్నారు. ఎంవీఐ చంద్రశేఖర్, మున్సిపల్ కమీషనర్ జి.శ్రీనివాస్, సీఐలు నాగభూషణరావు, సోమ నర్సయ్య, పీఏ న్‌డీ.ప్రసాద్, లారీ అసోసియేషన్ బాధ్యులు మల్లారెడ్డిలు పాల్గొన్నారు.



## నమ్మిన భక్తుల కోర్కేలు తీర్చేది జాన్‌పహాడ్ దర్గా ఉర్సు

**ప్రజాపక్షం/పాలకవీడు:** నమ్మిన భక్తుల కోర్కేలు తీర్చే దైవంగా మత సామరస్యానికి ప్రతీకలుగా నిలుస్తూ దినదినాభివృద్ధి చెందుతూ నేరేడు చర్ల మండలానికి 20 కిలో మీటర్లు, పాలకవీడు మండల కేంద్రానికి 10 కిలోమీటర్ల దూరాన ఉన్న జాన్‌పహాడ్ దర్గా ఉమ్మడి జిల్లాలోనే గాక, రెండు ఉభయ తెలుగు రాష్ట్రాలకు పేరున్న దర్గాగా ప్రసిద్ధి చెందింది. ఈనెల 22,23,24 తేదీలలో ఉర్సు ఉత్సావాలు రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో ఘనంగా జరగనున్నాయి. పక్క రాష్ట్రాల నుండి అధిక సంఖ్యలో ఉర్సు ఉత్సవాలకు తరలివస్తుంటారు. ఈ దర్గా ముస్లీంలకు పవిత్ర స్థలమైనప్పటికీ హిందువులే అధిక సంఖ్యలో దర్శించుకుంటున్నారు. భక్తులు తమ కోర్కేలు తీరితే కందూరు పేరిట మొక్కులు చెల్లించుకుంటారు. సంతానం లేని వారు సంతానం కలిగితే సైదులు బాబా పేరును పుట్టిన బిడ్డలకు నామకరణం చేస్తుంటారు. ఈ సంవత్సరం ఉత్సవాలకు భారీగా లక్షల సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉంది. జాన్‌పహాడ్ సైదన్నను దర్శించుకునేందుకు తెలంగాణ రాష్ట్రంతో పాటు ఆంధ్ర, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు నుండి అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉంది. ఈ ఉర్సు ఉత్సవాలు వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు పకడ్బందీగా చేశారు.

### ఉర్సు ఉత్సవానికి పటిష్ట భద్రత

జాన్‌పహాడ్ దర్గా ఉర్సు ఉత్సవాలకు పటిష్ట భద్రత ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్‌పి కె.నర్సింహా అన్నారు. గురువారం మండలంలోని జాన్‌పహాడ్ ఉర్సు ఉత్సవం జరిగే ప్రాంతాన్ని పరిశీలించి, దర్గాను సందర్శించి ప్రార్థనలో పాల్గొన్నారు. ప్రతి ఒక్కరు సోదరభావంతో కలిసిమెలసి ఉత్సవం నిర్వహించుకోవాలని కోరారు. దర్గా, వాహనాల పార్కింగ్ స్థలాలు, ఉత్సవం ప్రాంతంలోకి వచ్చిపోయే మార్గాలను పరిశీలించారు. ఉత్సవం ప్రాంతంలో 65 సిసి కెమోరాలతోఓ ఉత్సవ పర్యవేక్షణ చేయడం జరుగుతుందని అన్నారు. బందోబస్తు పర్యవేక్షణకు అదనపు ఎస్‌పి రవీందర్‌రెడ్డిని నియమించినట్లు తెలిపారు. అదనపు ఎస్‌పి రవీందర్‌రెడ్డి, డిఎస్‌పి శ్రీసివాసరెడ్డి, సర్కిల్ ఇన్స్‌పెక్టర్ చరమందరాజు, మునగాల సిఐ రామకృష్ణారెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ రామారావు పాల్గొన్నారు.

# ముందే లీక్... అంతా షాక్!

### మున్సిపల్ చైర్మన్ రేసులో కొప్పుల... ఆశావహుల ఆశలపై నీళ్ళు...

**సూర్యాపేట మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని అధికార కాంగ్రెస్ కైవసం చేసుకునేం దుకు పావులు కదుపుతుంది. ఎన్నికలకు ముందే చైర్మన్ పదవిని ఆశిస్తున్న వారి సంఖ్య కూడా ఘననీయంగానే ఉంది. చైర్మన్ రేసులో మేమంటే మేమే ఉన్నామంటూ తమ సన్నిహితుల వద్ద నేతలు చెప్పుకుంటున్నారు. ఇదిలా ఉండగా తాజాగా మాజీ మంత్రి, దివంగత రాంరెడ్డి దామోదర్ రెడ్డి కుడి భుజంగా ఉన్న సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి తాను కూడా రేసులో ఉన్నానని లీక్ ఇవ్వడంతో అంతా షాక్ అవుతున్నారు. గత కొంత కాలంగా చైర్మన్ పీఠాన్ని ఆశిస్తున్న ఆశావహుల ఆశలు ఒక్కసారిగా నీరుగారాయి.**

**ప్రజాపక్షం/సూర్యాపేట :** సూర్యాపేట మేజర్ మున్సిపాలిటీ చైర్మన్ పీఠంపై అధికార పార్టీ గురి పెట్టింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత రెండు పర్యాయాలు జరిగిన ఎన్నికల్లో గులాబీ పార్టీ తమ జెండా ఎగరవేసింది. ఈ ఎన్నికల్లో అత్యధికంగా వార్డులు కైవసం చేసుకొని చైర్మన్ పీఠాన్ని దక్కించుకోవాలని మాజీ మంత్రి, స్వర్గీయ రాంరెడ్డి దామోదర్ రెడ్డి తనయుడు ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ముందు నుండే పావులు కదుపుతున్నారు. ప్రధాన ప్రతిపక్షమైన బిఆర్‌ఎస్ వ్యూహాలను అంచనా వేస్తూ గెలుపు గుర్రాలను ఎన్నికల బరిలోకి దింపాలని కసరత్తు చేస్తున్నారు. దీంతో ఆ పార్టీలో చైర్మన్ పీఠాన్ని ఆశిస్తున్న వారి సంఖ్య కూడా ఎక్కువగానే ఉంది. అన్ని రాజకీయ పార్టీల కన్నా కాంగ్రెస్‌లో నాయకులకు స్వేచ్ఛ ఎక్కువగా ఉండడంతో మేమేంటే మేమే మున్సిపల్ చైర్మన్‌లమంటూ తమ సన్నిహితులతో చెప్పుకుంటూ వస్తున్నారు. తాజాగా సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి చైర్మన్ పీఠాన్ని తాను ఆశిస్తున్నట్లు ఎన్నికల్లో 10వ వార్డు నుండి పోటీ చేయనున్నట్లు ముందే లీక్ ఇవ్వడంతో అంతా షాక్ అవుతున్నారు.

**ఆశావహుల ఆశలపై నీళ్ళు...**

మాజీ మంత్రి, స్వర్గీయ రాంరెడ్డి దామోదర్ రెడ్డికి ప్రధాన అనుచరుడు, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి సూర్యాపేట మున్సిపల్ చైర్మన్ స్థానాన్ని ఆశిస్తూ ఎన్నికల బరిలో నిలుస్తున్నట్లు ముందే లీక్ ఇవ్వడంతో ఆ పార్టీ నుండి ఆ పదవిని ఆశిస్తున్న మిగతా ఆశావహుల ఆశలు ఒక్కసారిగా నీరుగారాయి. సూర్యాపేట నియోజకవర్గంలో ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి తరువాత కొప్పుల వేణారెడ్డి పార్టీకి పెద్ద దిక్కుగా ఉన్నారు. అతన్ని కాదని పార్టీలో చైర్మన్ స్థానానికి పోటీపడేందుకు ఎవరూ కూడా సహసించే వారు ఎవరూ లేరన్నది అక్షర సత్యం. దీంతో గత కొంత కాలంగా చైర్మన్ స్థానం తమదంటే తమదేనని చెప్పుకున్న ఆశావహులు ఒక్కసారిగా సైలెంట్ అయ్యారు.




**రాజకీయ వ్యూహంలో భాగంగానే...**

రాజకీయ వ్యూహంలో భాగంగానే మున్సిపల్ చైర్మన్ స్థానాన్ని వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి ఆశిస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ప్రస్తుతం వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్‌గా ఆయన కొనసాగుతున్న పదవి కాలం కేవలం 14 మాసాలు మాత్రమే ఉంది. మున్సిపల్ చైర్మన్ స్థానం దక్కించుకుంటే 5 సంవత్సరాలు పదవీలో కొనసాగే అవకాశం ఉండడంతో దీనిపై కన్నేసినట్లు స్పష్టమవుతుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన కూడా మరో మూడు సంవత్సరాల్లో ముగియనుంది. పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా తన పదవికి డోకా ఉండదని, తాను చైర్మన్‌గా పదవిని చేపడితే రానున్న జనరల్ ఎలక్షన్‌లో కూడా పార్టీకి మేలు జరుగుతుందని ఊహించే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చర్చ సాగుతుంది.

## హరీష్ రావువి 'కాకమ్మ కథలు'.. నిజాలు నిప్పులాంటివి

### ఎంపి చామల కిరణ్ రెడ్డి



**ప్రజాపక్షం/యాదాద్రి :** తెలంగాణ మాజీ మంత్రి హరీష్ రావు విమర్శలకు భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నందుకే నోటీసులు ఇస్తున్నారన్న హరీష్ రావు వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. గురువారం ఆయన దావోస్ నుంచి మీడియాతో మాట్లాడారు. నైనీ బొగ్గు బ్లాకు టెండర్ల విషయంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఇప్పటికే పూర్తి స్పష్టత ఇచ్చారని, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అవకతవకల వల్లే అప్పట్లో టెండర్లు రద్దు అయ్యాయన్న నిజాన్ని కిషన్ రెడ్డి బయటపెట్టారని గుర్తు చేశారు. సైట్ విజిటింగ్ ప్రక్రియ అనేది టెండర్లలో ఒక సాధారణ భాగమని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసిందని, నైనీ బొగ్గు బ్లాకు కోసం 17 మంది దరఖాస్తు చేసుకున్నారని కిరణ్ రెడ్డి తెలిపారు. ఈ ప్రక్రియ ఇంకా పూర్తి కాకముందే, సైట్ విజిటింగ్ సర్టిఫికెట్ ఎవరికీ ఇవ్వకముందే.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన బంధువులకు కట్టబెడుతున్నారంటూ బీఆర్‌ఎస్ అసత్య ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో సిట్ విచారణ జరుగుతుండటంతో ఆ విచారణను తప్పుదోవ పట్టించడానికే కేటీఆర్, హరీష్ రావు నైనీ బ్లాక్ అంశాన్ని తెరపైకి తెచ్చారని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో స్వయానా కేసీఆర్ అల్లుడి ఫోన్నే ట్యాప్ చేసిన చరిత్ర వారిదని, తమకు ఎదురులేదని బావాబామ్మర్దులు విర్రవీగితే ప్రజలు ఎన్నికల్లో షాక్ ఇచ్చారని ఎద్దేవా చేశారు. పదేళ్ల కాలంలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి దోచుకున్నందునే ప్రజలు వారిని ఇంటికి పరిమితం చేశారని, ఇప్పటికీ వారు అబద్ధాలతో అధికారంలోకి రావాలని కలలు కంటున్నారని విమర్శించారు. హరీష్ రావు ఇప్పటికైనా బూటకపు మాటలు మానుకుని నిర్మాణాత్మక రాజకీయాలు చేయాలని, ఫోన్ ట్యాపింగ్ విచారణకు సహకరించాలని చామల కిరణ్ రెడ్డి డిమాండ్ చేశారు.

## మునిసిపల్ ఎన్నికలపై ఎంపి, ఎమ్మెల్యే సమీక్ష



**ప్రజాపక్షం/హాలియా:** రానున్న మునిసిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని అధికార కాంగ్రెస్ పార్టీ హాలియా, నందికొండ మునిసిపాలిటీ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బుధవారం రాత్రి హాలియా మునిసిపాలిటి ముఖ్య నాయకులతో నల్గొండ ఎంపి కుందూరు రఘువీర్‌రెడ్డి, సాగర్ ఎంఎల్‌ఏ కుందూరు జైవీర్‌రెడ్డిలు సమావేశాన్ని నిర్వహించి ముఖ్య నాయకులతో ముఖాముఖి నిర్వహించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అధికార పార్టీ కావడంతో ఆశావాహుల సంఖ్య భారీగా ఉండడం ప్రతి ఒక్క కార్యకర్త టికెట్ ఆశించడం కొంత ఇబ్బందికర పరిస్థితే ఎదురువుతున్నట్లు తెలుస్తోంది. పార్టీ నిర్ణయించిన అభ్యర్థి బీఫామ్ వస్తుందని ఎవరైనా రెబల్‌కు ప్రయత్నిస్తే పార్టీ నుండి ఉద్వాసన తప్పదనే హెచ్చరికలు కూడా వస్తున్నట్లు తెలుస్తుంది. హాలియా మునిసిపాలిటీ చైర్ పర్సన్ జనరల్ కావడంతో ఆశావాహుల సంఖ్య పెరుగుతుంది. వీటన్నింటికి చెక్ పెట్టేందుకు ఎంపి రఘువీర్‌రెడ్డి, ఎంఎల్‌ఏ జైవీర్‌రెడ్డిలు పార్టీని ఒకే తాటిపైకి తెచ్చి అందరిని కలుపుకొని పోయే వ్యక్తులను అభ్యర్థులుగా ప్రకటించేందుకు చర్చలు జరుగుతున్నట్లు పార్టీ ముఖ్యనాయకులు చెబుతున్నారు. సాగర్ నియోజకవర్గంలో ఉన్న రెండు మునిసిపాలిటిను కైవసం చేసుకునేందుకు ఎంపి, ఎంఎల్‌ఏ కసరత్తు చేస్తున్నారు. హాలియా, నందికొండ మునిసిపాలిటిలో ఉన్న ముఖ్య నాయకులతో ఈ సమావేశం నిర్వహించినట్లు తెలిపారు.

## 'ప్రజాపక్షం' ఎప్పుడూ ప్రజల వైపే

**ప్రజాపక్షం/హాలియా :** పత్రిక ఎప్పుడు ప్రజల పక్షంగానే వ్యవహరించి వారికి మంచి జరిగేలా చూడాలని నల్లగొండ ఎంపి కుందూరు రఘువీర్ రెడ్డి, సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి లు అన్నారు. గురువారం సాగర్ క్యాంప్ కార్యాలయంలో ప్రజాపక్షం దినపత్రిక క్యాలెండర్ ఎంపి, ఎమ్మెల్యే కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాపక్షం దినపత్రిక ఎప్పుడు ప్రజల వైపే వ్యవహరించి మంచి కథనాలు రాస్తూ ప్రజలకు మేలు జరిగేలా చూస్తున్నారని చెప్పారు. సమాజంలో జర్నలిజం ఎప్పుడు ప్రజల పక్షమే ఉండాలని వారి కష్టసుఖాలను ఎప్పటికప్పుడు అధికారంలో ఉన్న పార్టీలకు తెలియపరుస్తూ ఇరువురికి వారధి లాగా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చాపల శ్రీనివాస్, చిత్రం ప్రసాద్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



ప్రజాపక్షం
Telugu National Daily
మహబూబ్‌నగర్
శుక్రవారం
23-01-2026
www.prajapaksham.in

"మెగా అభిమానులు మెచ్చేలా ఉన్న 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రం, బాక్సాఫీస్ దగ్గర కాసుల వర్షం కురిపిస్తోంది. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా రూ.300 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను సాధించి, చిరంజీవి సినీ ప్రయాణంలో అతి పెద్ద విజయంగా నిలిచింది. ఈ నేపథ్యంలో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కి చెందిన పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్ 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపింది."

# రీల్

## 'వెళ్లేదారిలో' పాట విడుదల



చింతా వరలక్ష్మీ సమర్పణలో శ్రీ చక్రాస్ ఎంటర్టైన్మెంట్ బ్యానర్ మీద చింతా వినీష రెడ్డి, చింతా గోపాల కృష్ణా రెడ్డి నిర్మాతలుగా చింతా రాజశేఖర్ రెడ్డి సహ నిర్మాతగా వినయ్ రత్నం తెరకెక్కించిన చిత్రం 'శ్రీ చిదంబరం. వంశీ తుమ్మల, సంధ్యా వశిష్ట జంటగా నటించిన 'శ్రీ చిదంబరం' చిత్రంలో ప్రముఖ సంగీత దర్శకుడు ఎమ్ఎమ్ కీరవాణి ఆలపించిన 'వెళ్లే దారిలో' అనే ఓ పాట బ్యూటిఫుల్ పాటను విడుదల చేశారు. ఈ పాటను సంగీత దర్శకుడు ఎమ్.ఎమ్.కీరవాణిపాటను విడుదల చేశారు. చందు రవి సంగీతం అందించిన ఈ పాటకు చంద్రశేఖర్ సాహిత్యాన్ని సమకూర్చారు. ఈ పాట ట్యూన్తో పాటు సాహిత్యం అందించారు. కీరవాణి గాత్రం ఈ పాటకు ప్రాణం పోసింది. ఈ సందర్భంగా నిర్మాత గోపాల కృష్ణ రెడ్డి మాట్లాడుతూ కీరవాణి ఈ పాటలను ఆలపించడం ఎంతో సంతోషంగా ఉంది. ఆయన గాత్రంతో ఆ పాట ఎంతో గొప్పగా మారింది. సినిమా విషయానికొస్తే ఇదొక ఓ అందమైన ప్రేమ కథా, వింటేజ్ విలేజ్ డ్రామాలో పూర్తి కొత్తదనం నిండి ఉంటుంది. ప్రతి పాత్ర, ప్రతి విజువల్ ఎంతో సహజంగా ఉంటుంది.ఇక ఇందులో హీరోకి ఉన్న అసలు పేరు కాకుండా.. ఊరంతా కూడా చిదంబరం అని ఎందుకు పిలుస్తుంటారు.. మరి అలా ఎందుకు పిలుస్తారు? అసలు హీరో ఎప్పుడూ కూడా కళ్లద్దాలు ఎందుకు పెట్టుకుని ఉంటాడు? అలా చేయడానికి గల కారణం ఏంటి? అనే ఇలాంటి ఎన్నో ఆసక్తికరమైన ప్రశ్నలకు సమాధానం ఈ సినిమా. కొత్తదనంతో నిండిన సినిమాలను ఆదరించే తెలుగు ప్రేక్షకులకు తప్పకుండా మా చిత్రం నచ్చుతుంది' అన్నారు. వంశీ తుమ్మల, సంధ్యా వశిష్ట, గోపీనాథ్, శివకుమార్ మట్ట, కల్పలత గార్లపాటి, అరుణ్ కుమార్, తులసి, నాయుడు మోరం, శంకర్ రావు తదితరులు నటిస్తున్నారు.

## పురుషలో వెన్నెల కిషోర్ పోస్టర్ రిలీజ్




భార్యాభర్తల కథకు కాస్త కామెడీ జోడించి, రియాలిటీకి దగ్గరగా చూపిస్తే ఆ సినిమా ఇచ్చే కిక్కే వేరేలా ఉంటుందని చెప్పుకోవచ్చు. సరిగ్గా అదే లైన్ తీసుకొని వినూత్నంగా ఎంటర్టైన్ చేయడానికి ప్రేక్షకుల ముందుకు వస్తున్న చిత్రం'పురుష:' ప్రస్తుత తరానికి తగ్గట్టుగా ట్రెండీ మేకింగ్తో రాబోతున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. మరో పక్క ప్రమోషన్ పనుల్లో బిజీగా ఉన్నారు. ఇందులో భాగంగా ఎప్పటికప్పుడు 'పురుష:' మూవీ టీమ్ వదులుతున్న పోస్టర్స్ ఆడియన్స్ లో క్యూరియాసిటీ పెంచేస్తున్నాయి. పెళ్లి తర్వాత పురుషులు పడే అవస్థలు చూపిస్తూనే.. పెళ్లి తర్వాత జీవితంలో భార్యల ఇంపార్టెన్స్ ఏంటనేది ఈ సినిమాలో చూపించనున్నారని ఇప్పటికే విడుదల చేసిన టీజర్ స్పష్టం చేసింది. ఇక తాజాగా మరో డిఫరెంట్ పోస్టర్ వదిలి సినిమాపై ఇంకాస్త హైప్ పెంచేశారు. తాజాగా వదిలిన ఈ పోస్టర్ లో వెన్నెల కిషోర్ ఏదో అయోమయంలో పడినట్లు కనిపిస్తుండగా.. కిటికీ దగ్గర ఏం జరిగింది అని పోస్టర్ పై రాసి ఇంకాస్త క్యూరియాసిటీ పెంచారు. మొత్తానికి జనాల్లో ఇంట్రెస్ట్ క్రియేట్ చేస్తున్న మేకర్స్.. ఇప్పటి వరకు హీరోల పాత్రలు, వారి బిహేవియర్, పాత్రల తీరుకి తగ్గట్టుగా పరిచయం చేశారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫర్గా సతీష్ ముత్యాల పని చేస్తుండగా.. శ్రవణ్ భరద్వాజ్ సంగీతం అందిస్తున్నారు. ఎడిటర్గా కోటి, ఆర్ట్ డైరెక్టర్గా రవి బాబు దొండపాటి వర్క్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమాకి సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. అతి

ఈ పోస్టర్ చూస్తుంటే సినిమాలో ఖచ్చితంగా ఫుల్ ఫన్ ఉంటుందని, గతంలో ఏ సినిమాలో కూడా చూడని డిఫరెంట్ సీన్స్ ఆడియన్స్ ఈ సినిమాలో చూడబోతున్నారని స్పష్టమవుతోంది. బత్తుల సరస్వతి సమర్పణలో కళ్యాణ్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై బత్తుల కోటేశ్వరరావు ఈ 'పురుష:' సినిమాను నిర్మిస్తున్నారు. వీరు వులవల దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాతో పవన్ కళ్యాణ్ బత్తుల హీరోగా పరిచయం కాబోతున్నాడు. కేవలం పోస్టర్లు, ఫస్ట్ లుక్స్తోనే త్వరలో ఈ సినిమా రిలీజ్ డేట్ అనౌన్స్ చేయనున్నారు. సినిమాలో పవన్ కళ్యాణ్, సప్తగిరి, కసిరెడ్డి రాజకుమార్, వైష్ణవి కొక్కుర, విషిక, హాసిని సుధీర్, శ్రీ సంధ్య, గబిరాక్, అనైరా గుప్తా, వెన్నెల కిషోర్, రాజీవ్ కనకాల, పమ్మి సాయి, వి.టి.వి. గణేష్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

## 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్ర బృందానికి పవన్ ప్రశంసలు



మెగా అభిమానులు మెచ్చేలా ఉన్న 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రం, బాక్సాఫీస్ దగ్గర కాసుల వర్షం కురిపిస్తోంది. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా రూ.300 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను సాధించి, చిరంజీవి సినీ ప్రయాణంలో అతి పెద్ద విజయంగా నిలిచింది. ఈ నేపథ్యంలో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కి చెందిన పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్ 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపింది.మెగా బ్లాక్బస్టర్ విజయాన్ని సాధించిన సందర్భంగా మెగాస్టార్ చిరంజీవికి, అలాగే 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్ర యూనిట్ సభ్యులందరికీ శుభాకాంక్షలు అని పవన్ కళ్యాణ్ విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.నాలుగు దశాబ్దాలకు పైగా చిరంజీవి గారు ప్రజల హృదయాలకు అత్యంత దగ్గరగా నిలుస్తూ.. అదే తపన, అదే ఉత్సాహంతో తన నటన, హాస్యం, నృత్యాల ద్వారా ప్రేక్షకులను నిరంతరం అలరిస్తున్నారు. ఆయన అద్భుతమైన సినీ ప్రస్థానంలో ఇది మరో విజయవంతమైన చిత్రంగా నిలిచింది. ఈ చిత్రానికి దర్శకత్వం వహించిన అనిల్ రావిపూడి గారికి ప్రత్యేక అభినందనలు. సంక్రాంతికి మరో ఘన విజయాన్ని అందించిన ఆయన ప్రతిభ ప్రశంసనీయం. చిరంజీవి , విక్టరీ వెంకటేష్ ఒకే తెరపై కలిసి కనిపించడం ప్రేక్షకులకు నిజంగా అపూర్వ ఆనందాన్ని కలిగించింది.సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో అందించిన అద్భుతమైన సంగీతం, సినిమాకు మరింత శక్తిని జోడించింది.నిర్మాతలు సాహు గారపాటి, సుష్మిత కు కూడా ప్రత్యేక అభినందనలు అని పవన్ కళ్యాణ్ తెలిపారు.

## మొగుడు గ్లింప్స్ రిలీజ్





తమిళ దర్శకుల్లో 'సుందర్ సి ' సినిమాలకు ఉండే క్రేజే వేరు. ఆయన తీసిన సినిమాలు తెలుగు ప్రేక్షకులకు కూడా బాగా కనెక్ట్ అవుతుంటాయి. ఈ క్రమంలోనే తాజాగా హీరో విశాల్తో ఓ సినిమా రూపొందిస్తున్నారు. సుందర్ సి. అవ్ని సినీమాక్స్ ప్రైవేట్ లిమిటెడ్, బెంజ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్లపై కుష్బూ సుందర్ సమర్పణలో తెరకెక్కుతున్న ఈ సినిమాకు ఏసిఎస్ అరుణ్ కుమార్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. మొగుడు అనే టైటిల్ తో రాబోతున్న చిత్రంలో విశాల్ సరసన తమన్నా భాటియా హీరోయిన్ గా నటిస్తోంది. కమెడియన్ యోగిబాబు ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. హిప్ హాఫ్ తమీజా సంగీతం అందిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా సాగుతుండగా, మరోవైపు ప్రమోషన్స్ మొదలుపెట్టారు. ఇందులో భాగంగా తాజాగా మొగుడు టైటిల్, గ్లింప్స్ రిలీజ్ చేశారు. ఏకంగా 5 నిమిషాల నిడివితో ఈ వీడియో కట్ చేసి ఒక్కసారిగా సినిమాపై హైప్ తీసుకొచ్చారు. ఇందులో విశాల్ తమన్నాలను భార్యాభర్తలుగా చూపిస్తూనే సినిమాలో డెప్త్ ఏంటనేది క్లియర్ గా చెప్పేశారు. 'ఇలా చూడండి.. మొగుడులా ఉండటం ముఖ్యం కాదు.. మొగుడు మొగుడులా ఉండటమే ముఖ్యం. అర్థమైందా అత్తయ్యా'' అంటూ యోగిబాబు చెప్పిన సీరియల్ క్లిపింగ్ చూపిస్తూ మొగుడు గ్లింప్స్ మొదలు పెట్టారు. ఆ తర్వాత తమన్నా ఇంటికి యోగిబాబు రావడం, ఆమె అందానికి ఫిదా కావడం.. చివరకు తమన్నా మొగుడు విశాల్ని చూసి బిత్తరపోవడం లాంటి సీన్స్ ఆసక్తికరంగా చూపించారు. మరీ ముఖ్యంగా భార్యాభర్తలుగా విశాల్ తమన్నా అదరగొట్టారనే చెప్పుకోవాలి. భర్తకు ఆర్డర్స్ వేసే భార్యగా తమన్నా, ఇంట్లో వంట పనులు చేస్తూనే శత్రువుల తాట తీసే భర్తగా విశాల్ భలే కిక్కిచ్చారు. ఈ వీ డియో చూస్తుంటే మొగుడు మూవీ ఫ్యామిలీ ఎంటర్టైనర్ గా తెరకెక్కిస్తున్నారు. విశా ల్ 36వ చిత్రంగా ఇది నిర్మిస్తున్నారు. ఎగ్జిగూటివ్ ప్రొడ్యూసర్ ఎన్.మణి వన్నన్.

## ఇన్ ఫ్లుయెన్సర్ యామిని హీరోయిన్‌గా చిత్రం



సోషల్ మీడియా ఇన్ ఫ్లుయెన్సర్ యామినీ ఈఆర్ ను హీరోయిన్ గా పరిచయం చేస్తున్నారు . రతన్ రిషి దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. ప్రస్తుతం తన మూడో చిత్రంగా యామినీ ఈఆర్ తో హీరోయిన్ ఓరియెంటెడ్ సినిమాగా తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రంలో కాళకేయ ప్రభాకర్, అజయ్ ఘోష్ నటిస్తున్నారు. ఈ మూవీలో ఎంతో స్పెషల్ గా, ఇంట్రెస్టింగ్ గా ఉండే హీరోయిన్ తండ్రి పాత్ర కోసం నైటీస్ సినిమాలోని ఒక నటుడ్ని పెట్టాలని ఆలోచిస్తున్నారు. ఈ సినిమా సంబంధించిన పోస్టర్‌ను కూడా రిలీజ్ చేశారు. ప్రస్తుతం ఉన్న ఈ సిస్టమ్, సొసైటీలో జరిగే ప్రేమ కథతో మూవీ రూపొందుతున్నట్లు దర్శకుడు రిషి తెలిపారు. ప్రేమికుల రోజు ఫిబ్రవరి 14న టైటిల్ ప్రకటించనున్నారు.

## 'హనీ' టెర్రిఫిక్ టీజర్ రిలీజ్




నవీన్ చంద్ర, దివ్య పిళ్లై ప్రధాన పాత్రల్లో కరుణ కుమార్ రచన, దర్శకత్వం వహించిన సైకలాజికల్ హారర్ మూవీ హనీ. ఓవిఏ ఎంటర్టైన్మెంట్స్ బ్యాన్ప రవి పీట్ల, ప్రవీణ్ కుమార్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రాన్ని శేఖర్ స్టూడియోస్ సమర్పిస్తోంది. ఈ చిత్రం నిజ జీవిత సంఘటనల నుంచి ప్రేరణ తో మూఢనమ్మకాలు, అంధ విశ్వాసాలు, డార్క్ సైకలాజిక్ ఎలిమెంట్స్ తో ఉండబోతోంది. తాజాగా ఈ చిత్రం టీజర్ రిలీజ్ చేశారు. వెన్నులో వణుకు పుట్టించేలా వున్న టీజర్ సినిమాపై అమాంతం ఆసక్తిని పెంచింది. ఇప్పటివరకు మనం చూసిన హారర్ కు భిన్నంగా, హనీ టీజర్ పూర్తిగా నిశ్శబ్దం, చీకటి, మర్మమైన చూపులు, తెలియని శక్తులు కలిసి ఒక మార్మిక ప్రపంచాన్ని ఆవిష్కరిస్తున్నాయి. దర్శకుడు కరుణ కుమార్ ఇప్పటి వరకు ఎన్నడూ చూడని కథను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాడనే సంకేతాలు టీజర్లో బలంగా చూపించాడు. హారర్ను కేవలం భయపెట్టే అంశంగా కాకుండా ఊహకు అతీతంగా ప్రజెంట్ చేస్తున్న విధానం ఆసక్తిని రేకెత్తిస్తోంది. ప్రతి ఫ్రేమ్లోనూ ఏదో పెద్ద రహస్యం దాగుంది అన్న ఫీలింగ్ కలుగుతుంది. మార్తాండ్ కె వెంకటేష్ ఎడిటింగ్, నాగేష్ బానెల్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు.సైకాలజికల్ డెప్త్, సోషల్ రిలెవెన్స్, హారర్ అంశాల సమ్మేళనంతో రూపొందిన 'హనీ' ఫిబ్రవరి 6న ప్రేక్షకులకు అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్పీరియన్స్ అందించేందుకు సిద్ధంగా ఉంది. ఈ చిత్రానికి రచన, దర్శకత్వం కరుణ కుమార్, నిర్మాతలు: రవి పీట్ల, ప్రవీణ్ కుమార్ రెడ్డి , సినిమాటోగ్రఫీ నగేష్ బన్నెల్ ఎడిటింగ్ మార్తాండ్ వెంకటేష్ అందిస్తున్నారు.

## భారీ ఎన్‌కౌంటర్

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభమయ్యాయని చెప్పారు. సరండా అడవిలో అనల్ దా తన బృందంతో పాటు ఉన్నాడని పోలీసులకు అందిన సమాచారం మేరకు ఈ ఆపరేషన్ ప్రారంభించామని ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఆపరేషన్స్) మైఖేల్ రాజ్ ఎస్ పిటిఐకి తెలిపారు. గిరిడిహ్ జిల్లాలోని పిర్తాండకు చెందిన అనల్ దా 1987 నుండి చురుకుగా ఉన్నాడు. పోలీసులు చాలా సంవత్సరాలుగా అతని కోసం గాలిస్తున్నారు. సిఆర్‌పిఎఫ్ డైరెక్టర్ జనరల్ జ్ఞానేంద్ర ప్రతాప్ సింగ్ సోమవారం పశ్చిమ సింగ్‌భూమ్ జిల్లా కేంద్రమైన చైబాసాను సందర్శించారు. కోల్హాన్, సరండా ప్రాంతాలు జార్ఖండ్‌లో మావోయిస్టులకు చివరి కంచుకోటలుగా పరిగణించబడతాయి. బుద్ధ పహాడ్ చక్రా, లతేహార్, గుమ్లా, లోహర్దగా, రాంచీ, పారస్‌నాథ్ ప్రాంతాలలో భద్రతా బలగాలు వారి కార్యకలాపాలను సమర్థవంతంగా అరికట్టాయని అధికారులు తెలిపారు.

## ఎలా చర్చిస్తారు?

(మొదటి పేజీ తరువాయి)

ద్వీపం భవిష్యత్తు గురించి డెన్మార్క్ లేదా గ్రీన్‌లాండ్ తరపున నాటో అధిపతి చర్చలు జరపలేరని, ఆ అధికారం ఆయనకు లేదని ఘాటుగా స్పందించారు. గ్రీన్‌లాండ్ సహా యావత్ ఆర్కిటిక్ ప్రాంత భవితవ్యానికి సంబంధించి నిర్దేశిత ప్రణాళిక నిమిత్తం ఒక చట్రాన్ని తయారు చేసేందుకు ట్రంప్–మార్క్ రట్టే అంగీకరించడాన్ని ఆమె తప్పు పట్టారు. తమ అంతర్గత సార్వభౌమాధికారాన్ని తామే నిర్ణయించుకుంటామన్నారు. నాటో ప్రధాన కార్యదర్శి మార్క్ రట్టేతో ట్రంప్ చర్చలు జరపడం మంచి విషయమేనని, కానీ జరగాల్సిన విధంగా ఈ సంభాషణలు విపులంతగా జరగలేదని ఆమె తప్పుపట్టారు. ఆర్కిటిక్ ప్రాంతంలో భద్రత యావత్ నాటో కుటుంబానికి సంబంధించిన సమస్య అని, అందువల్ల సహజంగానే ట్రంప్–నాటో అధిపతి మధ్య చర్చలు జరగడం మంచి విషయమేనని అన్నారు. ఆర్కిటిక్‌లో నాటో భద్రత పెంచాలనే విషయంపై చాలాకాలంగా మేం అడుగుతూనే ఉన్నామని గుర్తుచేశారు. దావోస్‌లో సమావేశానికి ముందునుండే తాము నాటో ప్రధాన కార్యదర్శితో సంభాషణలు చేస్తూనే ఉన్నామన్నారు. ''డెన్మార్ రాజ్యపాలన గురించిన ప్రతి విషయం నాటోకు క్షుణ్ణంగా తెలుసు, మేం మా డెన్మార్క్‌దేశ ఆర్థిక వ్యవస్థ, పెట్టుబడులు,సామాజిక వ్యవస్థ, భద్రత వంటి దేనిగురించైనా చర్చించగలం, కానీ మా సార్వభౌమాధికారం గురించి సంప్రదింపులు చేయలేం, డెన్మార్క్,గ్రీన్‌లాండ్ సార్వభౌమాధికారం, అంతర్గత విషయాల గురించి మేమే నిర్ణయించుకోగలం '' అని మెట్టే ఫ్రెడరిక్సెన్ తన ప్రకటనలో పేర్కొన్నారు. మా దేశ సమగ్రతను,సార్వభౌమాధికారాన్ని గౌరవిస్తూ, ఆర్కిటిక్ ప్రాంత భద్రతను బలోపేతం చేసే విషయంపై చర్చిస్తే మిత్రదేశాలతో కలిసి ఆ సంభాషణల్లో అందరూ (నాటో కూటమి) పాల్గొనాలని డెన్మార్క్ ప్రభుత్వం కోరుకుంటోందని ఆమె స్పష్టం చేశారు. డెన్మార్క్ రక్షణమంత్రి ట్రోయెల్స్ లండ్ పౌల్సెన్ కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. ఐతే నాటో ఐక్యతను కొనసగించడానికి రట్టే విధేయతతో పనిచేస్తున్నారనీ,ఆర్కిటిక్ లో భద్రతను బలోపేతం చేయడానికి కూటమి మరింత చేయాల్సి ఉందని చెప్పడం సానుకూలంగా ఉందన్నారు. ఇదిలా ఉండగా, సుంకాల ఉపసంహరణ, గ్రీన్‌లాండ్‌పై బలప్రయోగ విరమణకు ట్రంప్ తీసుకున్న నిర్ణయం పట్ల డెన్మార్క్ విదేశాంగమంత్రి లార్స్ లోకే రాస్ముస్సేన్ హర్షం ప్రకటించారు. ''ఈరోజు ఉదయం కంటే అస్తమయం ఎంతో మెరుగైన విధంగా ముగిసిందని రాస్ముస్సేన్ ఎన్‌బిసి న్యూస్‌తో అన్నారు. ఇక ట్రంప్‌ను ప్రశంసించే కాలం ముగిసిందని తొలుత దావోస్‌లో బుధవారం రాస్ముస్సేన్ విమర్శించారు. గ్రీన్‌లాండ్‌పై బలప్రయోగాన్ని, యూరప్‌పై అదనపు సుంకాలను నిలిపివేస్తామని ట్రంప్ రెండు శుభవార్తాలు చెప్పారన్నారు.

### బ్రస్సెల్స్‌లో అత్యవసర సమావేశం

గ్రీన్‌లాండ్‌లో బలప్రయోగం చేయబోమని, విభేదించిన యూరప్ దేశాలపై 10 శాతం అదనపు సుంకాలు విధించబోమని దావోస్ వేదికగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన తర్వాత యూరప్ దేశాలు ఊరట చెందాయి. దావోస్‌లో కొన్ని గంటలపాటు చెలరేగిన గందరగోళాన్ని యూరప్‌దేశాల నాయకులు ఇప్పుడిప్పుడే జీర్ణించుకుంటున్నారు. కానీ ఇంకా చాలా ప్రశ్నలు మిగిలిపోయి ఉన్నాయని యూరప్ దేశాలు భావిస్తున్నాయి. ట్రంప్ కొంత వెనుకంజ వేసినాగానీ గ్రీన్‌లాండ్ సమస్య పరిష్కారానికి ఇంకా..ఇంకా చాలా దూరంలోనే ఉండిపోయింది. దీంతో ట్రాన్స్ అట్లాంటిక్ కూటమి విచ్ఛిన్నమయ్యే ప్రమాదం పొంచి ఉందన్న విషయంపై కూటమి నాయకులు గురువారం రాత్రి పొద్దుపోయాక బ్రస్సెల్స్‌లో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ వివరాలు పూర్తిగా తెలియాల్సి ఉంది. కాగా ట్రంప్‌తో చర్చలు జరిపిన నాటో ప్రధాన కార్యదర్శి మార్క్ రట్టో ట్రంప్‌ను డాడీ అని సంబోధించి విమర్శలకు గురయ్యారు. నాటో కుటుంబంలో రక్షణవ్యయాన్ని బాగా పెంచడంలో కృషి చేశారని ట్రంప్‌ను ప్రశంసిస్తూ ఆయనను రట్టో డాడీ అని సంబోధించారు. బ్రిటన్‌కు కొంత ఊరట కలిగినప్పటికీ ప్రధానమంత్రి కీర్ స్టార్‌మర్ చుట్టూ ఉన్నవారంతా మాత్రం ట్రంప్ వెనకడుగు ఉద్దేశపూర్వకంగా, తన చర్యలను తాను సమర్థించుకున్నారని భావిస్తున్నారు. బిబిసి విశ్లేషకులు ఈ విషయం వెల్లడించారు. స్వీడన్ ఉప ప్రధానమంత్రి ఎబ్బా బుష్ మాట్లాడుతూ, అమెరికాతో సంబంధాలు ఇప్పుడు దెబ్బతిన్నాయని, అందువల్ల యూరప్ ఇప్పుడు తనను తాను బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. డెన్మార్ నుండి గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకోవడానికి వ్యతిరేకించే దేశాలపై పదీ శాతం సుంకాలు విధిస్తానంటూ కొద్ది రోజులుగా తీవ్ర కలకలం రేపారు. నిర్ణీత ప్రకారం ఫిబ్రవరి ఒకటో తేదీ నుండి ఈ పదీశాతం అదనపు సుంకాల భారం ఎనిమిది యూరప్ దేశాలపై అమలులోకి వస్తాయని తొలుత ట్రంప్ చెప్పారు. యూరప్ దేశాలకు ప్రత్యక్షంగా ఆర్థిక నష్టం కలిగించకుండా తాత్కాలిక చర్యలు తీసుకున్నప్పటికీ, గ్రీన్‌లాండ్ విషయంలో ఆయన వెనక్కు తగ్గలేదు.




## లక్షలాది మంది కార్మికుల హక్కుల పరిరక్షణకు ఎఐటియుసి కృషి

### నూతన డైరీ ఆవిష్కరణలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎఐటియుసి 1920 అక్టోబర్ 31న బ్రిటీష్ హయాంలో స్థాపించటం జరిగిందని, ఆనాటి నుండి ఈనాటి వరకు లక్షలాది కార్మిక సంఘాలకు, కోట్లాది మంది కార్మికుల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తున్నట్లు ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ తెలిపారు. హైదరాబాద్, హిమాయత్‌నగర్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో గురువారం 2026వ సంవత్సరపు కార్మికుల మార్గదర్శి డైరీని ఎఐటియుసి ఎస్.బాల్‌రాజ్, ఉప ప్రధాన కార్యదర్శి యం.నర్సింహ్మా, రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి యాదయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పానుగంటి పర్వతాలు, జక్కు రాజు, రాష్ట్ర సమితి సభ్యులు బొడ్డుపల్లి కిషన్, దత్తు నాయక్, మద్దిలేటి, వాటర్‌వర్క్ రమేష్, శివశంకర్ తదితరులు పాల్గొని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఐటియుసి నూతన డైరీ కార్మికులకు మార్గదర్శి, నిత్యం చేసే కార్యక్రమాలను డైరీలో పొందుపరుస్తూ, ఏ నెలకు ఆ నెల కార్యక్రమాల రిపోర్టును రాష్ట్ర కేంద్రానికి పంపించాలని కోరారు. ఎఐటియుసి చొరవ వల్ల ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య అక్టోబర్ 3, 1945లో ఏర్పడనాటికి ఎఐటియుసి విశేష కృషి జరిపిందని ఆయన తెలిపారు. నేడు మోడీ నాయకత్వాన ఏర్పడిన బిజెపి ప్రభుత్వంపై చట్టాలన్నింటినీ రద్దు చేసి 4 లేబర్ కోడ్‌లలో వేతనాల కోడ్, పారిశ్రామిక సంబంధాల చట్టం, వత్తి రీత్యా రక్షణ, ఆరోగ్యం పనిపరిస్థితుల కోడ్, సోషల్ సెక్యూరిటీ కోడ్‌లను తీసుకొచ్చి కార్పొరేట్లకు, పెట్టుబడిదారులకు మేలు చేసేందుకు, కార్మికుల హక్కుల్ని కాలరాసేందుకు చట్టాలను రద్దు చేసిందన్నారు. దీనికి వ్యతిరేకం గా 10 కేంద్ర కార్మిక సంఘాలు గతంలోని 25సార్లు దేశవ్యాపిత సార్వత్రిక స మ్మెలు చేస్తూ, కోడ్లను రద్దు చేయాలని, 44 చట్టాలను యధావిధిగా అమలు చే యాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 12న దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెను నిర్వహించాలని గురువారం జరిగిన రాష్ట్ర సదస్సు తీర్మానించిందని బాల్‌రాజ్ తెలిపారు.

## కార్మికులను మళ్లీ బానిసత్వంలోకి నెట్టడమే

(మొదటి పేజీ తరువాయి)

రిసెర్చ్ సెంటర్ డైరక్టర్ డాక్టర్ సురేష్ బాబు అధ్యక్షత వహించారు. లేబర్‌కోడ్‌లను తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సదస్సు ఏకగ్రీవంగా తీర్మానించింది. సదస్సులో అమర్‌జీత్ కౌర్ మాట్లాడుతూ దశాబ్దాల పోరాటాల ఫలితంగా సాధించిన ప్రధాన కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటిని కేవలం నాలుగు కోడ్‌లుగా మార్చడం సంస్కరణ కాదని, ఇది కార్మిక హక్కులపై ప్రత్యక్ష దాడి అని దుయ్యబట్టారు. ఇఎస్‌ఐ, పిఎఫ్ వంటి సామాజిక భద్రతా పథకాల పరిధి తగ్గిపోవడంతో కార్మికుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని అమర్‌జీత్ కౌర్ హెచ్చరించారు. గిగ్ వర్కర్లు, ప్లాట్‌ఫామ్ వర్కర్లకు భద్రత ఉంటుందన్న ప్రభుత్వ హామీలు కేవలం మాటలకే పరిమితమయ్యాయని, చట్టబద్ధమైన హక్కులు మాత్రం లేవని విమర్శించారు. కార్మికులు తమ న్యాయమైన డిమాండ్‌ల కోసం సమ్మె చేసే హక్కును కూడా కొత్త కోడ్‌లు కాలరాస్తున్నాయని, అనేక నిబంధనలు పెట్టి యూనియన్లను నిర్వీర్యం చేస్తున్నారని దుయ్యబట్టారు. 'ప్రజాస్వామ్య హక్కులు కార్మిక హక్కులు' ఒకదానితో మరొకటి ముడిపడి ఉన్నాయని, వీటిని కాపాడుకునేందుకు కార్మిక వర్గం రాజకీయాలకు అతీతంగా ఏకం కావాలని పిలుపునిచ్చారు. పారిశ్రామిక కార్మికులతో పాటు ఐటి, మీడియా, అసంఘటిత రంగాల వారు కూడా ఈ చట్టాల వల్ల నష్టపోతారని, అందుకే అందరూ ఏకమై దేశవ్యాప్త పోరాటాలకు సన్నద్ధం కావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కోడ్‌లను అమలు చేయకుండా ఒత్తిడి తీసుకురావాలని సూచించారు.

### యజమానులకు అపరిమిత అధికారాలు : పి. ప్రసాద్



ఐఎఫ్‌టియు జాతీయ ఉపాధ్యక్షుడు పి.ప్రసాద్ మాట్లాడుతూ 1926లో ఆమోదించిన ట్రేడ్ యూనియన్ల చట్టం కొత్త కోడ్‌లతో సమాధి చేయబడుతోందన్నారు. కొత్త కోడ్‌లో పొందుపర్చిన 60 రోజుల ముందస్తు నోటీసు వంటి నిబంధనలు కార్మికుల నిరసన గళాన్ని అణచివేయడమేనని అన్నారు. కొత్త లేబర్ కోడ్‌లు యజమానులకు అపరిమిత అధికారాలను కల్పిస్తూ 'హైర్ అండ్ ఫైర్' విధానాన్ని చట్టబద్ధం చేస్తున్నాయని విమర్శించారు. గిగ్ వర్కర్లు, అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత కల్పిస్తామన్న ప్రకటనలకు స్పష్టమైన నిధులు, అమలు విధానం లేకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని చెప్పారు. కార్మికులు తమ సమస్యల పరిష్కారానికి ఉపయోగపడే ట్రేడ్ యూనియన్ల ఏర్పాటు, సమ్మె లాంటి ప్రాథమిక హక్కులపై తీవ్రమైన ఆంక్షలు విధించిందని మండిపడ్డారు. యూనియన్లు లేని కార్మిక వర్గం నిస్సహాయంగా మారుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

### జర్నలిస్టులపై ప్రభావం : శ్రీనివాస్‌రెడ్డి



తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గతంలో జర్నలిస్టులకు రక్షణగా ఉన్న 'వర్కింగ్ జర్నలిస్ట్ యాక్ట్'ను రద్దు చేసి, దానిని ఇతర కార్మిక చట్టాలతో కలిపి 'ఆక్యుపేషనల్ సేఫ్టీ, హెల్త్ అండ్ వర్కింగ్ కండిషన్స్ కోడ్‌లో చేర్చడం వల్ల జర్నలిస్టుల ప్రత్యేక గుర్తింపు, రక్షణ పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వేజ్ బోర్డుల వ్యవస్థ దెబ్బతింటే యాజమాన్యాల దయాదాక్షిణ్యాలపై జర్నలిస్టులు ఆధారపడాల్సి వస్తుందని, ఉద్యోగ భద్రత లేకుండా మీడియా స్వేచ్ఛ నిలబడబోదని ఆయన స్పష్టం చేశారు. జర్నలిస్టులకు ఉద్యోగ భద్రత లేకపోతే, వారు స్వేచ్ఛగా వార్తలు రాయలేరని, ఇది ప్రజాస్వామ్యానికే ముప్పు అని అన్నారు. 1952లో ఏర్పాటు చేసిన విచారణ కమిషన్ సిఫారసుల మేరకు స్వాతంత్ర్యం తర్వాత రెండు చట్టాలు ఆమోదించారని, అవి జర్నలిజం ప్రమాణాలను మెరుగుపరచడానికి ఉద్దేశించిబడినవని, 1955లో వర్కింగ్ జర్నలిస్ట్ చట్టం, 1958లో మూడు చట్టాలు ఆమోదించి, భారత ప్రెస్ కౌన్సిల్, వార్తా పత్రికల నమోదు, జర్నలిస్టుల వేతన సవరణ కోసం వేతన బోర్డు ఏర్పాటుకు దారితీశాయని తెలిపారు. ఈ రెండు చట్టాలు జర్నలిస్టుల సంక్షేమం, ప్రెస్ స్వేచ్ఛకు కీలకమైనవని, కానీ కొత్త కార్మిక కోడ్‌లలో 29 చట్టాలతో పాటు వీటిని కూడా రద్దు చేశారని తెలిపారు. ఈ కొత్త చట్టాలు ప్రధానంగా కార్పొరేట్ సంస్థలకు, యజమానులకు అనుకూలంగా ఉన్నాయని, తద్వారా పని గంటలు పెరగడం, ఉద్యోగ భద్రత తగ్గడం వంటి సమస్యలు ఎదురవుతాయన్నారు. ఈ లేబర్ కోడ్‌లను తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయవద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అన్ని కార్మిక సంఘాలకు విజ్ఞప్తి చేయాలని శ్రీనివాస రెడ్డి సూచించారు. కేవలం పారిశ్రామిక కార్మికులతో పాటు జర్నలిస్టులు, మీడియా రంగంలో పనిచేసే వారు కూడా ఈ చట్టాల వల్ల ప్రభావితమవుతారని, అందరూ ఐక్యంగా పోరాడాలని సూచించారు. కార్మికులు, జర్నలిస్టులు, మేధావులు అందరూ కలిసి ఈ లేబర్ కోడ్‌లను వ్యతిరేకించాలన్నారు.






Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com